thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 200 కరీంనగర్ శనివారం, 27 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## యమునా నది ఉధృతి.. వాగుల్లా వీధులు, మడుగుల్లా మార్కెట్లు

న్యూఢిల్లీ: భారీ వర్షాలకు రాజధాని నగరం ఢిల్లీ విలవిల్లాడుతోంది. యమునా నది ప్రమాద స్థాయిని దాటి ప్రహహిస్తుండటంతో జనావాసాలు పలు చోట్ల నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వీధులు వాగులను, మార్కెట్ ప్రాంతాలు మడుగులను తలపిస్తున్నాయి. మంజూ కా తిలా నుంచి మదన్‌పూర్ ఖాదర్, బదర్‌పూర్‌లోని పలు కుటుంబాలు తాత్కాలిక శిబారాలలో తలదాచుకుంటున్నాయి. యమునా నది 207 మీటర్ల వద్ద ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఓల్డ్ రైల్వే బ్రిడ్జి మూసేశారు. నిత్యం రద్దీగా ఉండే 'మంజూ కా తిలా' మార్కెట్‌లోకి వరద నీరు చొచ్చుకురావడంతో ఒక్కసారిగా మూగవోయింది. దుకాణాలు ఖాళీ చేయడం, చేతికి అందిక వస్తువులతో నీటి నుంచి దుకాణదారులు బయటపడటం వంటివి కనిపించాయి.



## మహిళల అకౌంట్లలోకి రూ.7,500 కోట్లు

### మహిళల అకౌంట్లలోకి రూ.7,500 కోట్లు.. ముఖ్యమంత్రి మహిళా యోజన షురూ

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం నాడు ప్రారంభించారు. ఈ పథకం కింద ఒక్కో మహిళకు రూ.10,000 చొప్పున రూ.7,500 కోట్ల మొత్తాన్ని వాళ్ల ఖాతాలోని నేరుగా బదిలీ చేశారు. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఇతర మంత్రుల సమక్షంలో వర్చువల్ తరహాలో న్యూఢిల్లీ నుంచి మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. 'నవరాత్రి ఉత్సవాల తరుణంలో బిహార్ మహిళల సంతోషంలో భాగస్వామ్యం అవుతున్నా. లక్షలాది మంది మహిళల ఆశీస్సులే మాకు కొండంత బలం. వారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా' అని మోదీ వర్చువల్ మీట్‌లో పేర్కొన్నారు. ఈరోజు ముఖ్యమంత్రి మహిళా యోజన పథకాన్ని ప్రారంభమిస్తున్నామని, ఈ పథకంలో ఇంతవరకూ 75 లక్షల మంది మహిళలు చేరారని, వీరందరికీ రూ.10,000 చొప్పున వారివారి అకౌంట్లలో జమ చేశామని చెప్పారు.

**బిహార్ కోసం పనిచేస్తున్నాం...** ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలకు ఎంతో చేశామని, ప్రధాని సైతం మహిళల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం ఎన్నడూ మహిళలను పట్టించుకోలేదన్నారు. లాలూను తొలగించినప్పుడు ఆయన తన భార్యను ముఖ్యమంత్రిని చేశారని, తన కుటుంబం గురించే లాలూ ఆలోచన చేశారని మండిపడ్డారు. తాము అలా కాదని, బిహార్ అభివృద్ధికి కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. బిహార్‌లోని అధికార ఎన్డీయే ప్రభుత్వం చొరవతో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకం ప్రారంభమైంది. స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఈ పథకం కింద ప్రతి ఇంటిలోని ఒక మహిళకు జీవనోపాధి కల్పనకు ఆర్థికసాయం అందిస్తారు. తొలి విడతగా రూ.10,000, ఆ తర్వాత దశల వారిగా రూ.2లక్షల వరకూ ఆర్థిక సాయం అందిస్తారు.




## జూబ్లీహిల్స్ బైఎలక్షన్.. సునీత పేరును అధికారికంగా ప్రకటించిన కేసీఆర్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌కు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత పేరు ఖరారైంది. మాగంటి సునీత పేరును పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆకాంక్షల మేరకే సునీతకు అవకాశం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. చిత్తశుద్ధి కలిగిన నిస్వార్ధనేతగా, మాగంటి గోపీనాథ్ నిబద్ధతను పరిశీలించామని కేసీఆర్ పేర్కొన్నారు. అన్నింటిని గమనించి గోపీనాథ్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపు గౌరవాన్నిస్తున్నాన్నారు.

**గోపీనాథ్ ఆకస్మిక మరణంతో బైఎలక్షన్...** మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచారు. 2023 ఎన్నికల్లోనూ విజయం సాధించారు. 2025, జూన్ 8వ తేదీన గుండెపోటు కారణంగా ఆయన చనిపోయారు. జూన్ 5వ తేదీన ఆయన గుండెపోటుతో ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. ఆయన్ని బతికించడానికి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చికిత్స పొందుతూ జూన్ 8వ తేదీన తుదిశ్వాస విడిచారు. గోపీనాథ్ మరణం నేపథ్యంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీకి ఉప ఎన్నిక అనివార్యం అయింది.




## అల్ప పీడనం ఎఫెక్ట్.. తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు..

బంగాళాఖాతంలో ఉత్తర ఒడిస్సా గ్యాంగ్టక్ వెస్ట్ బెగాల్ తీరాల సమీపంలో కేంద్రీకృతమైన అల్ప పీడనం బలపడింది. ముఖ్య తూర్పు, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడింది. ఇది దక్షిణ ఒడిస్సా తో పాటు ఉత్తరాంధ్ర కోస్తా ప్రాంతంలో ఈ నెల 27న తీరాన్ని దాటే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ బిగ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏపీతో పాటు తెలంగాణలో ఈ రోజు రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదరు గాలులు వీచే అవకాశాలున్నాయి. మరోవైపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. అల్ప పీడన ప్రభావంతో తెలంగాణలో భూపాలపల్లి, వికారబాద్, మెదక్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వవనసర్తి, సిరిసిల్ల, జిగిత్యాల, నిర్మల, నిజామాబాద్, ములుగు, వరంగల్ జిల్లాలకు ఆరెంట్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆయా జిల్లాల్లో 10 సెం.మీ నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం ఈ రోజు నమోదు అయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. దీంతో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాదు భారీ వర్షాల నేపథ్యంలో మరోసారి ఉత్తర తెలంగాణలో గోదావరికి వరద ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే బాసర, మంజీరా నది ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. తెలంగాణ భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా చెరువు సమీపంలోని కట్టలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కరెంట్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. అందుబాటులో ట్రాన్స్ ఫార్మర్ లను దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన ప్రభుత్వ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.




# తుది దశకు 'స్థానిక' రిజర్వేషన్లు

## తెలంగాణ స్థానిక ఎన్నికలపై రేవంత్ సంచలనం..

హైదరాబాద్ : తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. బీసీలకు 42 శాతం ఎస్సీ, ఎస్టీలకు 27 శాతం రిజర్వేషన్లు తో కలిపి మొత్తం 69 శాతం రిజర్వేషన్లు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

సెప్టెంబర్ చివరి నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువు ముగిసిపోయే సమయం ఆసన్నమైనా.. ఎన్నికల నోటిఫికేషన్ మాత్రం ఇంకా విడుదల కాలేదు. బీసీ రిజర్వేషన్ల అంశం స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రధానమైన అడ్డంకిగా మారింది. ఇదిలా ఉండగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసారు. ఈ నేపథ్యంలో 27న పొలిటికల్ పార్టీలతో కలెక్టర్లు మీటింగ్‌లు ఏర్పాటు చేసి, రిజర్వేషన్లను పబ్లిష్ చేసేలా ప్లాన్ చేసారు. దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను ప్రచురించి ఈ నెల 28వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేయనుంది. ఆ మరుసటి రోజు 29న రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. రిజర్వేషన్ల గెజిట్ ప్రచురించేంత వరకు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా ప్లాన్ చేసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు 26, 27వ తేదీల్లో ట్రైనింగ్ క్లాసులు జరపాలని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

శిక్షణ కార్యక్రమానికి ఆయా మండలాల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ఎలాంటి సెలవులకు అనుమతి ఉండదని జిల్లాల కలెక్టర్లు తెలిపారు. హాజరుకాని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు దీనిపై ఎవరైనా కోర్టు ఆదేశిస్తే స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ వాయిదా పడే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# విషం చిమ్ముడు ఆపని ట్రంప్

## ఫార్మా ఉత్పత్తులపై 100% టారిఫ్స్ తో భారత్‌పై తీవ్ర ప్రభావం!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనపై విషం చిమ్మటం ఆపలేదు. భారత ఫార్మా ఉత్పత్తులపై అక్టోబర్ 1 నుంచి 100% దిగుమతి సుంకం (టారిఫ్) విధించాలని తీసుకున్న నిర్ణయం భారత్‌పై బహుముఖ తీవ్ర ప్రభావాలను చూపనుంది. ఇది భారత ఫార్మా రంగానికి అతిపెద్ద దెబ్బగా పరిగణించవచ్చు.

**భారత ఫార్మా రంగంపై పెను ప్రభావం...** అమెరికా భారత ఫార్మా కంపెనీలకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. ఫైనాన్షియల్ ఇయర్ 2024లో భారత్ నుంచి జరిగిన $27.9 బిలియన్ ఫార్మా ఎగుమతుల్లో $8.7 బిలియన్ (దాదాపు 31%) కేవలం అమెరికాకే వెళ్లాయి.

డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, సన్‌ఫార్మా, జైడస్, గ్లాండ్ ఫార్మా వంటి అగ్రశ్రేణి కంపెనీల రెవెన్యూలో 30-50% వరకు అమెరికా మార్కెట్ నుంచే వస్తోంది. టారిఫ్‌లు రెట్టింపు కావడంతో 100% సుంకం అంటే ధర రెట్టింపు అవుతుంది దీంతో ఈ కంపెనీల ఆదాయం నేరుగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

**అమెరికా మార్కెట్‌లో ఔషధాల ధరల పెరుగుదల...** ఈ టారిఫ్‌ల ప్రభావం భారత్‌తో పాటు అమెరికన్ వినియోగదారులపైనా పడుతుంది. ప్రస్తుతం అమెరికాలో వినియోగించే జనరిక్ ఔషధాల్లో 45% భారత్ నుంచే వెళ్తున్నాయి. అలాగే, బయోసిమిలర్లలో కూడా 15% సరఫరా భారతదేశం నుంచే జరుగుతుంది. 100% టారిఫ్‌ల కారణంగా ఈ ఔషధాల ధరలు రెట్టింపు అయ్యే అవకాశముంది. ఇది అమెరికా ప్రజల హెల్త్‌కేర్ ఖర్చులను గణనీయంగా పెంచుతుంది.

**అమెరికాలో తయారీ ఒత్తిడి...** ట్రంప్ తన విధానాన్ని స్పష్టంగా చెప్పారు. అమెరికాలో ప్లాంట్లు స్థాపించే విదేశీ కంపెనీలకు ఈ సుంకాలు వర్తించవు. ఈ నిబంధన భారత ఫార్మా సంస్థలను అమెరికాలో తయారీ యూనిట్లు (ప్లాంట్లు) నిర్మించేలా లేదా జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేసేలా తీవ్రంగా ఒత్తిడి చేస్తుంది. ఈ మార్పు భారత కంపెనీలకు అదనపు ఖర్చు, భారీ పెట్టుబడులు అవసరం అవుతాయి.

**భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తత...** ఈ 100% ఫార్మా టారిఫ్‌ల నిర్ణయం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతను పెంచుతుంది. రష్యా నుంచి చమురు దిగుమతుల కారణంగా భారత్‌పై ఇప్పటికే 50% టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఇప్పుడు ఫార్మా రంగంపై విధించిన టారిఫ్‌లతో ఈ వాణిజ్యపరమైన ఉద్రిక్తత మరింత పెరుగుతుంది, ఫలితంగా ఇరుదేశాల మధ్య జరగాల్సిన ముఖ్యమైన వాణిజ్య చర్చలు మరింత క్లిష్టం కానున్నాయి.

**భారత్ ఫార్మా కంపెనీల భవిష్యత్తు వ్యూహాలు...** ఈ సవాలును ఎదుర్కోవడానికి భారతీయ ఫార్మా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అమెరికా మార్కెట్‌పై ఆధారాన్ని తగ్గించుకుని, యూరప్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి ఇతర మార్కెట్లను విస్తరించడం అత్యవసరం. కేవలం జనరిక్ ఔషధాలపైనే కాకుండా, పరిశోధన (R&D), ఇన్నోవేటివ్ డ్రగ్స్‌పై దృష్టి పెట్టి బ్రాండెడ్ ఔషధాలను అభివృద్ధి చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో తమ స్థానాన్ని పదిలం చేసుకోవచ్చు. అమెరికా మార్కెట్‌లో కొనసాగాలంటే, అక్కడికక్కడే జాయింట్ వెంచర్లు లేదా ప్లాంట్లు ఏర్పాటు చేయడం తప్పనిసరి కావచ్చు. ట్రంప్ విధించిన 100% టారిఫ్‌లు భారత ఫార్మా రంగానికి నిస్సందేహంగా ఒక భారీ షాక్. తక్షణ ఫలితంగా కంపెనీల ఆదాయం పడిపోవడం, అమెరికా మార్కెట్‌లో ఔషధ ధరలు పెరగడం జరుగుతుంది. అయితే దీర్ఘకాలంలో ఇది భారత ఫార్మా కంపెనీలను కొత్త మార్కెట్ల అన్వేషణ, అమెరికాలో పెట్టుబడుల విస్తరణ, పరిశోధనలపై ఎక్కువ దృష్టి పెట్టడం వైపు నెట్టి, రంగంలో కీలకమైన మార్పులకు కారణమయ్యే అవకాశం ఉంది.



# ఎంత వర్షం పడినా నగరం సేఫ్‌గా ఉండాలి

## అధికారులకు సీఎం ఆదేశాలు

హైదరాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలపై సీఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రాతో పాటు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేయాలని సీఎస్‌కు తెలిపారు. బాహుబలి సీన్ తలపించేలా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద జ్ఞాన దీపాలు ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరద కారణంగా కాళేశ్వరం జలాశయానికి జలకళ సంతరించుకుంది. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగడంతో సాధారణ, జ్ఞాన తీర్థ పుష్కర ఘాట్ల వద్ద మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో త్రివేణి సంగమం వద్ద 11.490 మీటర్ల నీటి మట్టం నమోదైంది. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన జ్ఞాన దీపాలు బాహుబలి సీన్ తలపించేలా సగం వరకు నీటమునిగాయి. మరోవైపు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది.



# భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతి

## మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రెండు రోజుల క్రితం 30 అడుగుల వద్ద ఉన్న గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ఇవాళ ఉదయానికి 40 అడుగులకు చేరింది. మధ్యాహ్నం 12 గంటలకు 43 అడుగులకు చేరింది. గోదావరి ఉద్ధృతితో స్నానఘట్టాల వద్ద చాలా మెట్లు, విద్యుత్ స్తంభాలు నీటిలో మునిగాయి. నదిలో స్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.**

# ఎల్ అండ్ టీ నిష్క్రమణ.. తెలంగాణ ప్రభుత్వానికి మాయని మచ్చ: కేటీఆర్



హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ మెట్రోకు మంచి డిమాండ్ ఉండేదని, తాము దిగిపోయే నాటికి దేశంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థగా ఉందని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడే ఎయిర్‌పోర్టు మెట్రోకు కూడా శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ఆర్ ఓఆర్ఆర్ నిర్మించినప్పుడు ఒక మంచి పని చేశారని, రోడ్డు పక్కన కొంత భూమిని అదనంగా వదిలారని చెప్పారు."400కి.మీ మేర మెట్రో విస్తరణకు కేసీఆర్ ప్రణాళికలు రచించారు. దశలవారీగా మెట్రో విస్తరణకు గతంలో కేబినెట్ ఆమోదం తెలిపింది. అధికారంలోకి రాగానే రేవంత్‌రెడ్డి అనాలోచితంగా ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేశారు. ఆయన తలచుకుంటే ఇప్పటికే ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తయ్యేది. భూసేకరణ ఇబ్బంది కూడా లేదు. ఎయిర్‌పోర్టు మెట్రో కొనసాగించాలని ఎల్ అండ్ టీ కోరింది. అందుకు రేవంత్‌రెడ్డి ఒప్పుకోలేదు. అప్పటి నుంచే సీఎం, ఎల్ అండ్ టీ మధ్య గొడవ మొదలైంది. రేవంత్‌రెడ్డి వల్ల ఆ సంస్థ చాలా ఇబ్బంది పడింది. ఆయన వైఖరి వల్లే ఆ సంస్థ వెళ్లిపోతోంది. అనేక కష్టాలు ఎదుర్కొని ఎల్ అండ్ టీ .. మెట్రోను నడిపింది. దాని నిష్క్రమణ రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ. పెట్టుబడిదారులను సాక్షాత్తూ ముఖ్యమంత్రే బెదిరిస్తున్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

# ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసిన ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితులు



నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని రీజనల్ రింగ్ రోడ్ భూ నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులకు భూమితో భావోద్వేగ సంబంధం ఉంటుందని, ఆ బంధాన్ని గౌరవించాలని ఆయన అన్నారు. పార్టీ, ప్రభుత్వం కంటే ప్రజలే తనకు ముఖ్యమని, ప్రజల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ పనిచేస్తానని చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు వల్ల భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, రహదారి వెళ్లే దక్షిణ భాగంలోని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చర్చలు జరుపుతున్నట్లు కోమటిరెడ్డి తెలిపారు. ఈ సమస్యపై చాలా మంది ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అధికార పార్టీలో ఉన్నప్పటికీ తాను ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడతానని ఆయన స్పష్టం చేశారు. పదవి కిరీటం కాదని, అది ఒక బాధ్యత అని, ధర్మం, న్యాయం వైపు తాను ఎప్పుడూ ఉంటానని ఆయన అన్నారు.

మునుగోడు నియోజకవర్గంలో సగం భాగం ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు పరిధిలోకి వస్తుందని కోమటిరెడ్డి తెలిపారు. రహదారి అలైన్‌మెంట్ మార్పు విషయంలో రైతులకు సరైన వివరణ ఇచ్చి, వారిని ఒప్పించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిపక్షాలు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, కానీ తాము ప్రజల కోసం నిజాయితీగా పనిచేస్తామని ఆయన అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ వెళ్లే నియోజకవర్గాల ఎమ్మెల్యేలంతా కలిసి ముఖ్యమంత్రితో ఈ విషయమై చర్చిస్తామని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మనకే అవకాశాలెక్కువ: కేసీఆర్

ములుగు: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు పలువురు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి కార్యకర్తలను అప్రమత్తం చేసి తద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేయాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.



# పటాన్‌చెరులో 65వ జాతీయ రహదారిపై భారీగా వరద

## పటాన్‌చెరులో నేషనల్ హైవేపై భారీగా వరద.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి 65వ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ వద్ద నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంగారెడ్డి నుంచి ఇస్నాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద నీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి.

దీంతో కార్యాలయాలకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.



# హైదరాబాద్‌లో భారీ వర్షం

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలన్న ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్: గురువారం అర్ధరాత్రి నుంచి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది.

ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

**మియాపూర్–కొండాపూర్ మార్గంలో ట్రాఫిక్‌జామ్...** మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం, కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్ మంజీరా పైపులైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మైహోం మంగళ మార్గంలో రైల్వే అండర్ పాస్‌లోకి వరదనీరు చేరింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**లాగింగ్ పాయింట్లను పరిశీలించిన అవినాశ్ మహంతి..** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాటర్ లాగింగ్ పాయింట్లను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి పరిశీలించారు. మియాపూర్ మంజీరా పైపు లైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మై హెూం మంగళ మార్గంలో రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# నవమిలోపు తేల్చకపోతే మరణమే శరణ్యం: మాజీ డీఎస్పీ నళిని



భువనగిరి (క్రైమ్): ఈ నవమిలోపు తన విషయం తేల్చకపోతే మరణమే శరణ్యమని, జీవసమాధి అవుతానని.. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన డీఎస్పీ నళిని అన్నారు. మరణ వాంగ్మూలం పేరిట ఆమె ఫేస్‌బుక్‌లో గత వారం రోజుల నుంచి పలు పోస్టులను పెడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తాజాగా మరో పోస్టు పెట్టారు. తన విషయం సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తన మరణ వాంగ్మూలాన్ని ఆర్డీవోతో రికార్డ్ చేయించడం మినహా ఇప్పటి వరకు ఇంకేమీ చేయలేదన్నారు. "సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకోవడానికి వారికి వారం కూడా పట్టలేదు. కానీ నా విషయంలో సంవత్సరాల తరబడి కావాలని తాత్సారం చేస్తున్నారు. ఏ అధికారినైనా సస్పెండ్ చేస్తే 6 నెలల్లోపు విచారణ పూర్తి చేయాలి. విచారణ సమయంలో 1/3 లేదా 1/2 జీతాన్ని జీవన భృతి కింద ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఇవ్వకపోవడం నేరం కిందికి వస్తుంది. సీఎం రేవంత్ రెడ్డికి 21 నెలల క్రితం నేనిచ్చిన రిపోర్టుపై ఇంకా చర్యలు తీసుకోకుండా నిర్లిప్తంగా ఉన్నారు" అని నళిని ఆరోపించారు.

# హైదరాబాద్‌కు 2 కొత్త వందే భారత్ రైళ్లు.. ఆ ఎక్స్‌ప్రెస్ స్థానంలో వస్తుందా..




తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ప్రయాణించే ప్రయాణికులకు గుడ్ న్యూస్. ఎందుకంటే రైల్వే శాఖ ఈ మార్గంలో రెండు కొత్త వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీంతో ఈ ప్రాంతాల్లో రైలు ప్రయాణం మరింత ఈజీగా మారబోతుంది. ఒక రైలు హైదరాబాద్ నుంచి పూణేకు, మరొకటి సికింద్రాబాద్ నుంచి నాందేడ్‌కు నడుస్తుంది. ఈ కొత్త రైళ్లు ప్రయాణ సమయాన్ని రెండు నుంచి మూడు గంటల వరకు తగ్గించనున్నాయి. ఈ రెండు కొత్త రైళ్లు తెలంగాణ, మహారాష్ట్రల మధ్య ప్రయాణ సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచనున్నాయి. సికింద్రాబాద్–పూణే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో భర్తీ చేయాలని రైల్వే ఆలోచిస్తోంది. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం ఎనిమిదిన్నర గంటల్లో ఈ దూరాన్ని పూర్తి చేస్తుంది. ఈ రైలు వారంలో ఆరు రోజులు (మంగళవారం తప్పు) నడుస్తుంది. తక్కువ స్టాప్‌లతో, రెండు ఏసీ ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు, తొమ్మిది ఏసీ చైర్ కార్లు, రెండు ఈఓజీ కోచ్‌లతో ఉంటుంది. ఈ నిర్ణయం సికింద్రాబాద్–విశాఖపట్నం, సికింద్రాబాద్–తిరుపతి, కాచిగూడ–యశ్వంత్‌పూర్ రూట్లలో ఇప్పటికే నడుస్తున్న వందే భారత్ రైళ్ల భారీ ఆదరణ నేపథ్యంలో తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు కొత్త రైళ్లతో సౌత్ సెంట్రల్ రైల్వే (%బాజ=%) మొత్తం ఏడు వందే భారత్ సర్వీసులను నడుపుతుంది. ఇది ఈ స్వదేశీ సెమీ–హైస్పీడ్ రైళ్లను అత్యధికంగా నడిపే జోన్లలో ఒకటిగా నిలుస్తుంది. అంతేకాక, సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా ఒక నెలలోపు ప్రారంభమవుతుంది. ఇది నగరం నుంచి మరో లాంగ్–డిస్టెన్స్ ట్రైన్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. వందే భారత్ రైళ్లు ఆధునిక సౌకర్యాలతో, వేగవంతమైన ప్రయాణ సమయంతో ప్రయాణికులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తాయి. ఈ రైళ్లు స్వదేశీ సాంకేతికతతో నిర్మితమై, భారత రైల్వేలో ఒక కొత్త ప్రయాణ అనుభవాన్ని అందిస్తున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి ఈ కొత్త సర్వీసులు ప్రారంభమైతే, ప్రయాణికులకు మరింత సౌలభ్యం లభిస్తుంది.

# సత్ఫలితాలు అందిస్తున్న కగార్ ఆపరేషన్... బలహీన పడుతున్న మావోయిస్టు ఉద్యమం



మావోయిస్ట్ ఉద్యమం భారత దేశంలో 1967 నక్సల్బరీ ఉద్యమం నుంచి ప్రారంభమై, వివిధ దశల్లో పునరావృతమై 2004లో సిపిఐ (మావోయిస్ట్)గా పునర్ వ్యవస్థీకరించ బడింది. దాదాపు అరవై ఏళ్ల చరిత్రలో నాయకత్వం మార్పులు చాలా తక్కువ. మొదట చారు మజుందర్ సిద్ధాంత ఆధారిత నక్సల్బరీ తిరుగుబాటు తర్వాత పలు ప్రాంతీయ దళాలు ఏర్పడ్డాయి. 1980లలో పీపుల్స్ వార్ గ్రూప్ (%భాఔ+%) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలను ఆధారంగా చేసుకొని బలపడింది. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ విలీనం చెంది సిపిఐ (మావోయిస్ట్)గా అవతరించింది. ఆ విలీనానికి ముందు నుంచి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి ప్రధాన కార్యదర్శిగా కొనసాగి 2018 వరకు సుమారు పదమూడు సంవత్సరాలు పార్టీని నడిపించాడు. ఆయన తప్పుకున్న తరువాత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రధాన కార్యదర్శిగా నియమితుడై దాదాపు ఆరు సంవత్సరాలు ఆ స్థానంలో ఉన్నాడు. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2010లో మావోయిస్ట్ ప్రభావిత జిల్లాలు 223 ఉండగా, 2024 నాటికి 45 జిల్లాలకు తగ్గాయి. ఒకప్పుడు దాదాపు 90 జిల్లాల్లో తీవ్ర ప్రభావం కలిగిన ఈ ఉద్యమం ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార?ండ్ లోని కొన్ని అరణ్య. ప్రాంతాల్లో మాత్రమే నిలిచి ఉంది. భద్రతా బలగాల నిరంతర ఆపరేషన్లలో 2010–2020 మధ్య కాలంలో దాదాపు 2000 మంది మావోయిస్ట్ లు హతమయ్యారు. 2014–2024 మధ్య పదేళ్లలో 10,000 మందికి పైగా లొంగి పోయారు. ఈ సంఖ్యలు ఉద్యమ బలహీనతను ప్రతిబింబిస్తున్నాయి. అటువంటి సమయంలో 2025 మే నెలలో ఎన్కౌంటర్ లో బసవరాజు మృతి చెందడం ఉద్యమానికి ఊహించని శూన్యతను తెచ్చింది. బసవరాజు మరణానంతరం మూడు నెలలపాటు కేంద్ర కమిటీ అత్యవసరంగా సమావేశమై కొత్త నాయకత్వాన్ని నిర్ణయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో ప్రధానంగా ఇద్దరు నాయకుల పేర్లు చర్చకు వచ్చాయని చర్చ. ఒకరు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజీ, మరొకరు మల్లోజుల వేణు గోపాలరావు అలియాస్ సోను. తిప్పిరి తిరుపతి కరీంనగర్ జిల్లా కోరుట్ల పట్టణానికి చెందినవాడు. మాదిగ దళిత వర్గానికి చెందిన ఈ నాయకుడు 1980ల లోనే పీడబ్ల్యుజీ కార్య కలాపాలలో చేరి తరువాతి మూడు దశాబ్దాలుగా అరణ్య ప్రాంతాల్లో మావోయిస్ట్ దళాలను నడిపాడు. ఆయన ప్రధానం గా సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు అధిపతిగా పనిచేస్తూ, దళాల నియంత్రణలో కీలక స్థానాన్ని సంపాదించాడు. ప్రస్తుతం ఆయన వయసు అరవై సంవత్సరాలు దాటింది. చత్తీస్ గఢ్, మహారాష్ట్ర సరిహద్దు అరణ్య ప్రాంతాల్లో ఆయన నేరుగా నడిపిన దాడులు దశాబ్దాలుగా భద్రతా బలగాలకు ముప్పుగా నిలిచాయి. వేణు గోపాలరావు మరోవైపు సిద్ధాంత విభాగానికి అధిపతి. ఆయన అన్న మల్లోజుల కోటేశ్వర రావు అలియాస్ కిషన్జీ ఒకప్పుడు పశ్చిమ బెంగాల్‌లో అత్యంత ప్రభావవంతమైన మావోయిస్ట్ నాయకుడిగా 2011లో ఎన్కౌంటర్లో మరణించాడు. పెద్దపల్లి జిల్లా, బ్రాహ్మణ వర్గానికి చెందిన వేణుగోపాలరావు ప్రస్తుతం 69 ఏళ్ల వయసులో ఉన్నాడు. సిద్ధాంతపరమైన దృఢత ఉన్నప్పటికీ, సైనిక అనుభవం తక్కువగా ఉండటం, వయసు ఎక్కువ కావడం ఆయనకు ప్రతికూలమైనట్లు చర్చ. ఈ రెండు పేర్ల మధ్య చివరకు తిప్పిరి తిరుపతిని సెప్టెంబర్ 2025లో కేంద్ర ప్రధాన కార్యదర్శిగా నియమించగా, అధికారికంగా వెంటనే ప్రకటించ లేదు. అంటే అధికారికంగా ఎన్నిక ప్రక్రియ కాదు. అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర కమిటీ తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయం. ఈ నియామకానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి ఆయనకు ఉన్న సైనిక ఆధిపత్యం, రెండవది ఆయన దళిత వర్గానికి చెందిన వాడని పార్టీ ప్రదర్శించు కోవడం. మావోయిస్ట్ ఉద్యమంలో ఇప్పటివరకు ఉన్న బ్రాహ్మణ, మధ్యతరగతి ఆధిపత్యానికి బదులుగా దళిత నాయకత్వాన్ని ముందుకు తెచ్చి సామాజిక సమీకరణాన్ని బలోపేతం చేయాలన్న ఉద్దేశం ఇక్కడ ప్రతిఫలించింది. మావోయిస్టు ఉద్యమం క్రమేపీ బలహీన పడుతున్న వేళ...తిరుపతి, వేణుగోపాల్ మధ్య అభిప్రాయ భేదాలు ముదిరి పాకాన పడి, ఆయుధాల వదిలివేత, సాయుధ పోరాటం భావజాలాల మధ్య ... వేణుగోపాల్ రావు పేరున ప్రకటన విడుదల పట్ల అయోమయ వాతావరణం నెలకొంటున్న క్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు ఎన్కౌంటర్ లో మృత్యువాత పడటం ఉద్యమానికి విఘాతం కలిగించే పరిస్తితి తెచ్చింది. దీనికి తోడు 71 మంది అజ్ఞాత తీవ్రవాదులు ఏకకాలంలో లొంగిపోయిన సంఘటన మావోయిస్టు ఉద్యమానికి ఆశనిపాత మయింది. ఈ వరుస సంఘటనలు దశాబ్దాల తీవ్రవాద ఉద్యమ భవిష్యత్తుకు పెను సవాళ్ళగా మారాయి. ఎందుకంటే 2006లో మావోయిస్ట్ హింసాత్మక సంఘటనలు 1591గా నమోదవ్వగా, 2023 నాటికి అవి 500లోపే మిగిలాయి. 2010లో మావోయిస్ట్ దాడుల్లో 1005 మంది మరణించగా, 2023లో అది 200లోపే పరిమితమైంది. ఈ గణాంకాలు ఉద్యమ శక్తి తగ్గుముఖం పట్టింద నడానికి సాక్ష్యం. ఈ నేపథ్యంలో తిప్పిరి తిరుపతి బాధ్యతలు చేపట్టడం ఒక వైపు ఉద్యమాన్ని నిలబెట్టే ప్రయత్నం, మరోవైపు భద్రతా బలగాల కఠిన చర్యలకు ఎదురొడ్డి నిలబడే సవాలు. ఆయనకు ఉన్న అనుభవం, సామాజిక వర్గ నేపథ్యం ఒక ఆశా కిరణం చూపవచ్చేమో కానీ వాస్తవ గణాంకాలు మాత్రం మావోయిస్ట్ ఉద్యమం దిగజారి. పోతున్నదని తెలుపు తున్నాయి. ఇలా చూస్తే తిప్పిరి తిరుపతి కేంద్ర ప్రధాన కార్యదర్శిగా అవతరించడం ఒక పరిణామం మాత్రమే కాదు, ఉద్యమ దిశను నిర్దేశించే కీలక మలుపు. తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచి పెడతామన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే స్పష్టం చేస్తున్న, ప్రకటనను క్రమంగా సాకారం చేస్తున్న క్రమంలో... భవిష్యత్తులో తిప్పిరి తిరుపతి నాయకత్వం మావోయిస్ట్ కదలికను స్థిరంగా కొనసాగిస్తుందా లేదా క్షీణింప చేస్తుందా అన్నది భారతీయ తీవ్రవాద చరిత్రలో కీలకమైన ప్రశ్నగా నిలుస్తోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ప్రాచీన చారిత్రక సాక్ష్యాల ఆత్మఘోష - సెప్టెంబర్ 27... ప్రపంచ పర్యాటక దినోత్సవం



అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరివ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహ వంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకులలో అక్కడక్కడ నిక్షిప్తమై యున్న చరిత్ర కొంతవరకు వెలుగు లోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్ట మొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెన వేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్ట లేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజా ప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజక వర్గం లోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాత వాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్ట మౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించ బడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు – చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం అవిభక్త రాష్ట్రంలో తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... మరో వైపు ప్రాచీనత్వానికి ఆనవాళ్లు అయిన, అపురూప చారిత్రక సాక్ష్యాలను కనుమరుగు చేస్తుంటే, వారి ఆత్మ ఘోష వినిపిస్తుంటే, భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించు కోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# అమెరికాకు ఫార్మా ఎగుమతిదారుల లిస్ట్ : ఇండియాకు ఏం కాదు.. నష్టం ఎవరికంటే?



ప్రపంచంలోనే అతిపెద్ద ఔషధాల వినియోగదారు మార్కెట్‌గా పేరొందిన అమెరికాకు ఫార్మా ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్న దేశాల గణాంకాలు తాజాగా వెల్లడయ్యాయి. 2024 ట్రేడ్ డేటా ప్రకారం.. ఐర్లాండ్ అగ్రస్థానాన్ని దక్కించుకోగా, భారత్ 5వ స్థానంలో నిలిచింది. అమెరికా మార్కెట్‌కు అత్యధిక విలువైన ఔషధాలను సరఫరా చేయడంలో ఐర్లాండ్ తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.

**ఐర్లాండ్ ఆధిపత్యం, భారత్ స్థానం...** ప్రపంచ ఫార్మా వాణిజ్యంలో ఐర్లాండ్ తన పట్టును నిరూపించుకుంది. గణాంకాల ప్రకారం, %వి%65.7 బిలియన్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను ఐర్లాండ్ ఒక్కటే అమెరికాకు ఎగుమతి చేసింది. ఇది మొత్తం ఎగుమతులలో అత్యధిక వాటా కావడం విశేషం. ఈ జాబితాలో భారత్ 5వ స్థానంలో నిలిచింది. భారత్ నుంచి అమెరికాకు %వి%16.7 బిలియన్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా ఫార్మా దిగుమతుల్లో భారత వాటా కేవలం 6 శాతం మాత్రమే కావడం గమనార్హం. సో అమెరికా ఫార్మా ఎగుమతిపై 100 శాతం టారిఫ్ లు భారత్ కంపెనీలపై పెద్దగా ప్రభావం పడవనే చెప్పొచ్చు. భారత్ ప్రధానంగా తక్కువ ధరలో అధిక నాణ్యత గల జెనరిక్ మందులు, యాంటీబయోటిక్స్, వ్యాక్సిన్లు, ఏపీఐలను సరఫరా చేస్తోంది. ఫార్మా రంగంలో భారత్‌ను ప్రపంచం "ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్" గా పరిగణిస్తుంది. ముఖ్యంగా, అమెరికా మార్కెట్‌కు అవసరమయ్యే జెనరిక్ మందుల్లో దాదాపు 40% వరకు భారత్ నుంచే సరఫరా అవుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

**టాప్ 5 ఎగుమతిదారులు (2024)...** విలువ పరంగా చూస్తే, టాప్ 10 దేశాల జాబితాలో మొదటి మూడు స్థానాల్లో యూరోపియన్ దేశాలు ఉన్నాయి . 2024 ఫార్మా ఎగుమతులు (బిలియన్ డాలర్లలో) గణాంకాలు చూస్తే.. ఐర్లాండ్ %–% 65.7 బిలియన్ డాలర్లతో తొలిస్థానంలో ఉంది. స్విట్జర్లాండ్ – 19.3,జర్మనీ – 17.4,ఇతర యూరోపియన్ దేశం 13.6, భారత్ %–% 16.7తో ఐదో స్థానంలో ఉంది. ఇతర యూరోపియన్ దేశాలు – 13.6, 12.0, 9.5, యూకే – 7.6, మరొక దేశం 7.4 లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. విశ్లేషకుల ప్రకారం.. ఐర్లాండ్, స్విట్జర్లాండ్, జర్మనీ వంటి దేశాలు అధిక విలువ కలిగిన ఇన్నోవేటివ్ డ్రగ్స్, బయోలాజికల్స్ ఎగుమతిపై దృష్టి సారిస్తుండగా.. భారత్ తక్కువ ధరలో నాణ్యమైన జెనరిక్స్ సరఫరా చేయడంలో తన ప్రత్యేక బలాన్ని చాటుకుంటోంది.

**ట్రంప్ టారిఫ్స్ ప్రభావంపై ఆందోళన...** ప్రస్తుత పరిస్థితిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించిన 100% టారిఫ్స్ భారత ఫార్మా రంగంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం 6% వాటా ఉన్న భారత్, అదనపు సుంకాల కారణంగా ఎగుమతుల్లో మరింత పోటీని ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ "టారిఫ్ ఒత్తిడి ఉన్నప్పటికీ, అమెరికా మార్కెట్లో భారత జెనరిక్స్ డిమాండ్ తగ్గే అవకాశం లేదు. ఎందుకంటే తక్కువ ధరలో అత్యవసర ఔషధాల అవసరం అమెరికాకు ఎప్పుడూ ఉంటుంది" అని ఫార్మా విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మొత్తానికి, అమెరికా ఫార్మా మార్కెట్లో ఐర్లాండ్ మొత్తం విలువ పరంగా నంబర్ 1 గా కొనసాగుతుండగా, భారత్ ప్రపంచంలోని అత్యధిక జెనరిక్ మందుల సరఫరాదారుగా కీలక దేశంగా తన స్థానాన్ని నిలుపుకుంది.

# నగ్న వీడియోలు, అశ్లీల డాన్స్ క్లిప్స్.. అందాల 'బేబి'కి బిగుస్తోన్న ఉచ్చు

థాయ్‌లాండ్ అందాల రాణి సుపన్నీ నోయినోంతాంగ్ అలియాస్ 'బేబీ' చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా ముగిసిన ప్రావిన్స్ స్థాయి బ్యూటీ కాంటెస్ట్‌లో కిరీటం దక్కిన ఈమె.. మరుసటి రోజే పెద్ద వివాదంలో ఇరుక్కొంది. కారణం ఆమె పాత నగ్న వీడియోలు, అశ్లీల డాన్స్ క్లిప్స్ నెట్టింట వైరల్ కావడమే. ఈ పరిణామం వెంటనే పోటీ నిర్వాహకులు ఆమె టైటిల్‌ను వెనక్కి తీసుకోవడానికి దారితీసింది.

**కిరీటం దక్కిన రోజు.. కుంభకోణం వెలుగులోకి....** థాయ్‌లాండ్‌లోని ప్రావిన్స్ వారీ బ్యూటీ క్వీన్ పోటీల్లో 27 ఏళ్ల బేబీ ప్రాచువాప్ ఖిరీ ఖాన్ నుంచి విజేతగా నిలిచింది. సెప్టెంబర్ 20న ఆమె తలపై కిరీటం పెట్టగానే, మరుసటిరోజే సోషల్ మీడియాలో ఆమెకు సంబంధించిన అశ్లీల వీడియోలు షేర్ అవ్వడం సంచలనం సృష్టించింది. ఈ–సిగరెట్లు కాలుస్తూ, నగ్న నృత్యాలు చేస్తూ కనిపించిన ఆ వీడియోలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**బేబీ క్షమాపణలు.. కన్నీటి కథ...** వీడియోల్లో ఉంది తానేనని బేబీ ఫేస్‌బుక్‌లో అంగీకరించింది. కరోనా సమయంలో తన తల్లి తీవ్ర అనారోగ్యం పాలవ్వడంతో ఆసుపత్రి ఖర్చులకు డబ్బు సంపాదించేందుకు అశ్లీల వెబ్‌సైట్‌లో పని చేయాల్సి వచ్చిందని



చెప్పింది. అయినప్పటికీ తన తల్లిని కాపాడలేకపోయానని బాధ వ్యక్తం చేసింది. అప్పటి నుంచి మళ్లీ అలాంటి పనుల్లో భాగం కాలేదని, ఇది తనకు విలువైన గుణపాఠం నేర్పిందని తెలిపింది.

**న్యాయపరమైన చిక్కులు...** అందాల పోటీలో పాల్గొనే ముందు కంటెస్టెంట్లు అశ్లీల కార్యకలాపాలకు దూరంగా ఉన్నామనే డిక్లరేషన్‌పై సంతకం చేయాలి. బేబీ తెలిసీ ఆ క్లాజ్‌పై సంతకం చేయడం వల్ల ఇప్పుడు ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని న్యాయనిపుణులు సూచిస్తున్నారు. తప్పుడు డిక్లరేషన్ కారణంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

**మద్దతు, మరో ఆశ...** ఈ ఘటన తర్వాత బేబీకి సోషల్ మీడియాలో మద్దతు పెరుగుతోంది. ఉద్దేశపూర్వకంగానే తన పాత వీడియోలు బయట పెట్టారని, వారిపై కోర్టులో కేసులు వేస్తానని ఆమె హెచ్చరించింది. మరోవైపు, నిర్వాహకులను కలసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని ఇవ్వమని విజ్ఞప్తి చేసింది. టైటిల్ వెనక్కి ఇచ్చే అంశాన్ని పునరాలోచన చేస్తామని నిర్వాహకులు చెప్పడంతో ఆమెకు కొంత ఊరట లభించింది. ప్రస్తుతం అందాల భామ బేబీ భవితవ్యం న్యాయపరమైన తీర్పుపైనే ఆధారపడి ఉంది. ఒక్కవైపు మద్దతుదారుల ఆశీర్వాదం, మరోవైపు చట్టం బిగుస్తున్న ఉచ్చు.. ఈ రెండింటి మధ్య బేబీ భవిష్యత్తు నిలిచిపోయింది.

# ఆ 27 రైల్వే స్టేషన్లలో రూ.20కే ఫుడ్.. మిస్ కావొద్దు

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు.. ప్రభుత్వ రంగ సంస్థలు కొన్ని పథకాల్ని అమలు చేస్తుంటాయి. దీనికి సంబంధించిన వివరాలు అమలు చేసేటోడికి.. కొందరు కీలక అధికారులకు తప్పించి మిగిలిన వారికి అవగాహనే ఉండదన్నట్లుగా పరిస్థితి ఉంటుంది. ఇప్పుడు చెప్పే ఉదంతం కూడా ఆ కోవకే వస్తుంది. రైల్వే స్టేషన్లలో ఆహారం కొనుగోలు చేయటమంటే ఖర్చుతో కూడుకున్నదన్న విషయం తెలిసిందే. అయితే.. సామాన్య ప్రజానీకం కోసం దక్షిణ రైల్వే చెన్నై డివిజన్.. ఐఆర్ సీటీసీతో కలిసి అన్ రిజర్వుడ్ కోచ్ లలో ప్రయాణిస్తున్న ప్రయాణికుల సౌకర్యం కోసం రూ.20లకే ఆహారాన్ని అందించే ప్రోగ్రాంను అమలు చేస్తున్నారు. బ్యాడ్ లక్ ఏమంటే.. ఈ పథకం గురించి ఎవరికి అవగాహన ఉండదు. నిజానికి ఇలాంటి పథకాలు పాపులర్ అయితే.. ప్రజలకు మేలు కలుగుతుంది. చౌక ధరల్లో




నాణ్యమైన ఫుడ్ అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని రైల్వే ప్రయాణికులు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అయితే.. ఇది పరిమిత స్థాయిలో ఉన్న రైల్వే స్టేషన్లలో మాత్రమే అందుబాటులో ఉండటంతో.. ఆయా స్టేషన్ల పరిధిలో ప్రయాణించే వారికే మేలు కలుగుతుందని చెప్పాలి. చెన్నై సెంట్రల్.. ఎగ్మూరు.. చెంగల్పట్టు.. కాట్పాడి తదితర రైల్వే స్టేషన్లలో ఈ చౌక ఆహార కేంద్రాల్ని నిర్వహిస్తున్నారు. ఇంతకూ రూ.20లకే అందించే ఆహారం విషయానికి వస్తే.. పులిహోర, పెరుగన్నం, లెమన్ రైస్, పప్పు కిచిడీ, పూరీ పరోటా లాంటి ఆహారాన్ని అందిస్తున్నారు. మొత్తం 27 రైల్వే స్టేషన్లలో ఈ తరహా చౌకైన 67 ఆహార కేంద్రాల్ని నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైల్వే ప్రయాణికులు వినియోగించుకోవాలని దక్షిణ రైల్వే పేర్కొంది. దక్షిణ రైల్వే మాదిరే తెలుగు రాష్ట్రాల పరిధి అత్యధికంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వేలో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పాలి. ఆ కోణంలో రైల్వే అధికారులు పథక రచన చేయాల్సిన అవసరం ఉంది.

# చురకలు

## సంపాదకీయం

### టిక్‌టాక్ డీల్ పై ట్రంప్ సంతకం.. అమెరికాకు కొత్త విజయమా?

అమెరికాలో టిక్‌టాక్ భవిష్యత్తుపై నెలల తరబడి నడిచిన అనిశ్చితికి ముగింపు లభించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. టిక్‌టాక్ అమెరికాలో కొనసాగడానికి అనుమతిస్తూ షరతులు విధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై ఆయన సంతకం చేశారు. ఈ నిర్ణయం టిక్‌టాక్ వినియోగదారులతో పాటు.. అమెరికన్ కంపెనీలకు కూడా పెద్ద ఉపశమనం కలిగించింది. ఈ డీల్ మొత్తం విలువ సుమారు 14 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ ఈ అంచనాను వెల్లడించినప్పటికీ, అసలు కొనుగోలు ధరను మాత్రం గోప్యంగా ఉంచారు. డీల్ ప్రకారం, టిక్‌టాక్‌ను యాజమాన్యం చేస్తున్న చైనా కంపెనీ బైట్‌డ్యాన్స్ కి కేవలం 20 శాతం మాత్రమే వాటా మిగులుతుంది. మిగిలిన వాటా అమెరికన్ ఇన్వెస్టర్లు, టెక్ దిగ్గజ కంపెనీల ఆధీనంలోకి వెళ్తుంది.

**షీ జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చ...** ఈ ఒప్పందం కుదరడానికి ముందు ట్రంప్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చ జరిపినట్లు వెల్లడించారు. "నేను షీ జిన్‌పింగ్‌తో చాలా మంచి సంభాషణ జరిపాను. ఆయన పట్ల నాకు గౌరవం ఉంది. ఆయనకూ నాపట్ల గౌరవం ఉందని ఆశిస్తున్నాను. టిక్‌టాక్ గురించి మేము మాట్లాడాం. ఆయన ఈ డీల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు," అని ట్రంప్ తెలిపారు.


**అమెరికన్ కంపెనీలకే పెద్ద పాత్ర...** టిక్‌టాక్‌కి అమెరికాలో కొత్త రూపాన్ని ఇవ్వబోతున్నవారు ప్రముఖ అమెరికన్ ఇన్వెస్టర్లు. ముఖ్యంగా లారీ ఎల్లిసన్ నేతృత్వంలోని ఒరాకిల్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించనుంది. ట్రంప్ మాటల్లో "ఇది ఇప్పుడు అమెరికన్ ఇన్వెస్టర్లు, అమెరికన్ కంపెనీలు నడపబోతున్నాయి. ఇవి గొప్ప కంపెనీలు, గొప్ప ఇన్వెస్టర్లు. యువత కూడా దీన్ని బలంగా కోరుకున్నారు. ఒరాకిల్ టిక్‌టాక్‌కి భద్రత, సేఫ్టీ, టెక్నాలజీ పరంగా ప్రధాన భూమిక పోషించబోతోంది " అని పేర్కొన్నారు.

**చైనా ప్రభావం తగ్గనుంది....** ఈ ఒప్పందం వల్ల టిక్‌టాక్‌పై చైనా కంపెనీ బైట్‌డ్యాన్స్ నియంత్రణ గణనీయంగా తగ్గనుంది. ఇప్పటి వరకు టిక్‌టాక్ ప్రత్యేకతగా నిలిచిన అల్గోరిథంపై చైనా ఆధిపత్యం ఉండేది. కానీ కొత్త డీల్ ప్రకారం ఆ కంట్రోల్ అమెరికన్ ఇన్వెస్టర్ల చేతుల్లోకి వెళుంది. దీంతో అమెరికా యువత వినియోగించే డేటా, భద్రతా అంశాలు ఇకపై అమెరికన్ సంస్థల ఆధ్వర్యంలో ఉండనున్నాయి.

**మేక్ అమెరికా గ్రేట్ అగేన్ ప్రచారానికి బూస్ట్...** టిక్‌టాక్ డీల్‌ను ట్రంప్ తన "మేక్ అమెరికా గ్రేట్ అగేన్ " ప్రచారంలో మరో విజయంగా చూపిస్తున్నారు. చైనాపై ఆధిపత్యం తగ్గించి, అమెరికన్ కంపెనీలకు పెద్ద అవకాశాలు కల్పించడం ద్వారా, ట్రంప్ తన వ్యూహాత్మక విజయాలను అమెరికన్ ఓటర్ల ముందు ఉంచాలని భావిస్తున్నారు.

**యువతలో సంతోషం...** అమెరికాలో టిక్‌టాక్ వినియోగదారులు ప్రధానంగా యువతే. వీరంతా ఈ డీల్ కోసం ఎదురుచూశారు. టిక్‌టాక్ నిషేధం వస్తుందనే భయం నెలల తరబడి వారిలో కనిపించింది. ఇప్పుడు ట్రంప్ ఆర్డర్‌తో ఆ ఆందోళన తొలగిపోయింది. అమెరికన్ కంపెనీల ఆధ్వర్యంలో యాప్ మరింత భద్రతతో నడుస్తుందని వారు విశ్వసిస్తున్నారు. మొత్తం మీద, టిక్‌టాక్‌పై ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం ఒకవైపు అమెరికన్ ఇన్వెస్టర్లకు లాభదాయకం కాగా, మరోవైపు చైనాపై ఆధిపత్యం తగ్గించడంలో ఒక పెద్ద అడుగుగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన ఈ యాప్ ఇప్పుడు అమెరికా నియంత్రణలోకి వెళ్తుండడం గ్లోబల్ టెక్ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది.

# తెలంగాణ ఉద్యమ ఆది గురువు కొండా లక్ష్మణ్ - సెప్టెంబర్ 21.. బాపూజీ వర్ధంతి



భారత స్వాతంత్ర్య పోరాటంలో , ముల్కీ ఉద్యమంలో , నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో , తెలంగాణ 1969 నాటి తొలి, ఇటీవలి మలి దశ ఉద్యమాలలో కీలక పాత్రలు వహించిన, జీవితాంతం తెలంగాణ సమస్యలపై పోరాటం చేసిన తెలంగాణ పక్షపాతి దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ. ఏక కాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగి ఉన్న ప్రజాఉద్యమాలతో ఆయన జీవితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. అవి వరుసగా నిజాం వ్యతిరేక పోరాటం, వెనుకబడిన కులాల ఉద్యమం, చేనేత సహకారోద్యమం, ప్రత్యేక తెలంగాణోద్యమం. వాస్తవానికి తెలంగాణ ఉద్యమానికి ఆయన ఆది గురువు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర వితం ముడివడి ఉన్నదని చెప్పడం సముచితం. 1969లో తొలి దశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని కూడా తృణ ప్రాయంగా త్యజించిన త్యాగశీలి. తెలంగాణ వాసుల కష్టాలు తీరాలంటే, ప్రత్యేక రాష్ట్ర సాధన తప్ప వేరే మార్గం లేదని భావించి, అందుకు వివిధ మార్గాలలో నిరసన స్వరాలు వినిపించాడు. అలనాటి నిజాం సంస్థానంలో ఆదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ జన్మించాడు. చిన్నతనాన తల్లిని కోల్పోగా, ప్రాథమిక విద్య ఆసిఫా బాద్ లో, హైదరాబాద్ లో న్యాయ శాస్త్ర విద్య పూర్తి చేసి, 1948లో న్యాయ వాద వృత్తి చేపట్టాడు. ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారి పక్షాన కేసులను వాదించి, గెలిపించే వాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన , దేశంలోని అంతర్భాగమైన నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ, నిజాం నిత్య అకృత్యాలకు లోనైన దుస్థితిలో తెలంగాణ విమోచనోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. 1947 డిసెంబర్ 4న నిజాం ప్రభువు పై బాంబులు విసిరిన నారాయణరావు పవార్ బృందంలో కొండా లక్ష్మణ్ కూడా నిందితుడే. కొంతకాలం అజ్ఞాతుడుగా ఉన్నాడు. నిజాం నిరంకుశ పాలన పై నిప్పుల వర్షం కురిపిస్తూ, ఆయన పాలన అంతానికి, తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తొలుదొలుత వ్యూహ రచన చేసింది బాపూజీయే. 1952 లో తొలిసారి ఆసిఫాబాద్ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, శాసనసభలో అడుగు పెట్టాడు. 1957లో చిన్న కొండూరు నుండి గెలుపొంది శాసనసన డిప్యూటీ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించాడు. 1962లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా, ప్రత్యర్థి ఆక్రమాలతో గెలిచారని కేసు పెట్టి, విజయం సాధించాడు. 1967లో భువనగిరి నుండి గెలిచాడు. 1957-60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీ పడ్డాడు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్‌గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెపితే, సున్నితంగా తిరస్కరించాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిత్వ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా ఉంటూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ పక్షపాతిగా ఉద్యమ ఉధృతి కోసం రాజీనామా చేశాడు. 1969 మార్చి 27న తన రాజీనామాను ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అందజేసిండు. దాన్ని ఆమోదిస్తున్నట్లు సీఎం ప్రకటించిండు. ఈ రాజీనామా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పిందని చెప్పవచ్చు. 1972లో భువనగిరి నుండి విజయం కైవసం చేసుకున్నాడు. 1973 లో పాములపర్తి వేంకట నరసింహారావు తదనంతరం ముఖ్యమంత్రి అయ్యే అవకాశం గడప తొక్కిన , ఇందిరా గాంధీ ఒప్పుకున్నా, నాటి హోం మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టు వల్ల వెంగళరా వు కు ముఖ్య మంత్రి అయ్యే ఛాన్స్ దొరికింది. 1958లో హుస్సేన్ సాగర్ తీరాన భూమి కొనుక్కుని జలదృశ్యం నిర్మించు కోగా, 2002 లో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని నేలమట్టం చేయించగా , కోర్టు కెళ్ళి తనకు అనుకూల తీర్పు పొందాడు. చివరకు 97వ సంవత్సరంలో 2012 సెప్టెంబర్ 21న మరణించగా , జలదృశ్యం లోనే అంత్య క్రియలు జరిగాయి. 1952లో ముల్కీ ఉద్యమంతో తెలంగాణ కోసం పోరాటం ప్రారంభించి, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి రాజీనామా చేసి, 97 ఏళ్ల పండు ముదుసలి వయసులో, ఎముకలు కొరికిన చలిని లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేసి, గాంధీ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, బాపూజీ గా పిలువబడే కొండా లక్ష్మణ్, తన ఆస్తులను , జీవితాన్ని ధారబోసి, కొండంత గొప్ప వ్యక్తిత్వం, నిబద్ధత కలిగిన రాజకీయ ఆదర్శ నేతగా గుర్తింపు నొందాడు. 2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌ను ప్రోత్సహించడమే కాదు సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న తన నివాస బంగ్లా జలదృశ్యంను టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఇక్కడే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. నాటి నుంచి అశోక్ నగర్‌లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి శ్వాస ఉన్నంత వరకు చిత్తశుద్ధితో కృషి చేసి, మూడు తరాల వారధి ఉన్న తెలంగాణ రాష్ట్ర అలు పెరుగని, అవిశ్రాంత పోరాట యోధుడు బాపూజీ తెలంగాణ ప్రజానీకానికి ప్రాతఃస్మరణీయుడు.


**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# నిర్లక్ష్యపు నీడలలో శాతవాహనుల తొలి రాజధాని - సెప్టెంబర్ 27... ప్రపంచ పర్యాటక దినోత్సవం



అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు , శాత వాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహా రాష్ట్ర లోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతిపతిస" అను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగోబదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకంనిస" అని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిస్తున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చీఫ్ విప్ గా చేరాక, ఆయన చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి ఆరవ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు. 50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. మంత్రిగా కొప్పుల ఈశ్వర్ హరిత హోటల్ ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు చేపట్టడానికి కృషి చేశారు. మారిన ప్రభుత్వం, ప్రస్తుత రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేయూతను అందించి, పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రాబ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సంబంధ ఆధారాలను పరిరక్షించి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మించి, కోటిలింగాల ఉనికిని కనుమరుగు కాకుండా ఉండ గలందులకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# భారతీయ పునరుజ్జీవన ఉద్యమ పితామహుడు రామ్మోహన్ రాయ్ - సెప్టెంబర్ 27... రాజా రామ్మోహన్ రాయ్ వర్ధంతి




భారత సంఘ సంస్కరణల చరిత్ర లోనే రామ్మోహన్ రాయ్ పేరు, సతీ సహగమనాన్ని రూపుమాపడంతో ముడిపడి చిరస్థాయిగా నిలిచిపోయారు. రామ్మోహన్ రాయ్, హిందూ పూజారుల అధికారాన్ని ధిక్కరించి, ఆ కాలములో సాధారణమైన బహు భార్యత్వం నేరమని జనులకు నచ్చ చెప్పారు. రాజా రామ్మోహన్ రాయ్ ఆధునిక భారత పితామహుడు, పయనీర్ ఆఫ్ ఇండియా జర్నలిజం, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవన పితామహుడు, ఆధునిక భారత నిర్మాత. రామ్మోహన్ రాయ్ (మే 22, 1772 %-% సెప్టెంబరు 27, 1833) భారత దేశంలో మొదటి సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారు. ఆయన విశేష ప్రభావం రాజకీయ, ప్రభుత్వ నిర్వహణ, విద్యా రంగాలలోనే కాకుండా హిందూమతం పైన కూడా కనపడుతుంది. ఉపనిషత్తుల్లోని నిరాకార తత్వాన్ని అంగీకరించి, మనవ సమాజంలో ఐక్యతను ఆకాంక్షించారు. అస్పృశ్యత, కులజాడ్యంపై చైతన్యం కలిగించారు. బ్రిటీష్ ప్రభుత్వం ద్వారా సతీసహ గమనాన్ని నిషేధించారు. వితంతు పునర్వివాహం, మహిళలకు ఆస్తి హక్కుల కోసం అతను పోరాడారు. అందరికీ విద్య ముఖ్యంగా స్త్రీ విద్య వల్ల దేశం పురోగతి మారుతుందని నమ్మారు. బాల్య వివాహ రద్దు చట్టం తెచ్చారు. వితంతు పునర్వివాహాలు కోసం కృషి చేశారు, స్త్రీ పురుషులకు సమాన హక్కులు కోసం గట్టిగా పోరాడారు. ముఖ్యంగా ఆంగ్ల విద్యకు అనుకూలంగా ఉండి, దేశంలో ఆంగ్ల విద్యావిధానానికి కృషిచేశారు. రాజా రామ్మోహన్ రాయ్ బెంగాల్ లోని రాయ్ రాధా నగర్ లో 1772 మే 2 న జన్మించారు. ఆయన తండ్రి రమాకాంత్ వైష్ణవుడు, కాగా తల్లి తరిణి శాక్త మతానికి చెందింది. రామ్మోహన్ బెంగాలీ, పర్షియన్, అరబిక్, సంస్కృత భాషలను పదిహేనో యేడు వరకు అభ్యసించారు. యుక్తవయస్సులో కుటుంబ ఆచారాలతో సంతృప్తి పొందక, యాత్రలు సాగించడం మొదలు పెట్టారు. రామ్మోహన్ రాయ్ 1803 నుంచి 1814 వరకు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీలో, ఇంగ్లీష్ కోర్టులో బ్రాహ్మణ పండితులుగా పనిచేశారు. అదే సమయంలో గ్రీకు, లాటిన్ భాషలను నేర్చుకోవడం ప్రారంభించారు. 1803 నుంచి 1815 వరకు రాయ్ ముషీరాబాద్ లోని అప్పిలేట్ కోర్టు లో రిజిస్టర్ థామస్ వుడ్రాఫ్ కు మున్షి గా పని చేశారు. ఈ పదవికి రాజీనామా చేసిన తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ లో కలెక్టర్ జాన్ డిగిబ్ కోసం పని చేశారు. 1828 లో ఇంగ్లాండుకు వెళ్ళక ముందు ద్వారకా నాథ టాగూర్తో కలసి బ్రహ్మసమాజ్ ను స్థాపించారు. బ్రహ్మసమాజ్ ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక, మత సంస్కరణ ఉద్యమంగా మారి బెంగాల్ లో సాంఘిక, వివేచనాత్మక సంస్కరణలకు దారి తీసింది. అలా రామ్మోహన్ రాయ్, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఒక ముఖ్యుడిగా గుర్తించ బడ్డారు. తాము సంకల్పించిన సామాజిక, న్యాయ, మతపరమైన ఉద్యమాలలో రాయ్ మానవత్వాన్నే ప్రధానంగా తీసుకొన్నారు. ప్రజలకు తన ఉద్దేశం సమాజంలో ఉన్న మంచి సంప్రదాయాలను నిర్మూలించడం కాదని, కేవలం వాటిపై సంవత్సరాల పాటు నిరాదరణ వలన పేరుకు పోయిన కుళ్ళును తుడిచి వెయ్యడం అని చూపించుటకు కష్టపడ్డారు. ఉపనిషత్తులను, సూత్రాలను చదివారు. విగ్రహారాధనను ఖండించారు. ఆఖండానందాన్ని పొందుటకు, అధ్యాత్మిక చింతన, భగవంతుని ధ్యానం ఉన్నత మార్గాలని ప్రతిపాదించారు. అచార సంబంధమైన సంస్కృత విద్య కంటే ఇంగ్లీషు విద్య మంచిదని భావించి, సంస్కృత పాఠశాలలకు ప్రభుత్వ నిధులను వ్యతిరేకించాడు. 1822 లో ఇంగ్లీషు పాఠశాలను ప్రారంభించారు. రాయ్ 1831లో మొగల్ సామ్రాజ్య రాయబారిగా ఇంగ్లాండ్ ను దర్శించాడు. 1833 సెప్టెంబరు 27న మెదడు వాపు వ్యాధితో బ్రిస్టల్ మరణించారు. రాజా రామ్మోహన్ రాయ్ విదేశాల్లో మరణించిన మొదటి వ్యక్తి. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# రక్తపోటు కలవరం.. అదుపు తప్పిన మధుమేహం

పెద్దపల్లి : మారుతున్న జీవన శైలి, పని ఒత్తిడితో దీర్ఘకాలిక వ్యాధులు మనల్ని చుట్టేస్తున్నాయి. ఒత్తిడి, మానసిక ఆందోళనలకుతోడు ఆహార అలవాట్ల మూలంగా చిన్న వయసులోనే అసాంక్రమిక వ్యాధులకు గురవుతున్నారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ చేపట్టిన అసాంక్రమిక వ్యాధిగ్రస్థుల సర్వేలో తేలిన విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**కారణాలు అనేకం**పని ఒత్తిడి, మానసిక ప్రశాంతత లేకపోవడం, అధికంగా మాంసం, మద్యం, మత్తు పదార్థాలు తీసుకోవడం, వాతావరణ కాలుష్యం, ధూమపానం చేయడం.వ్యాయామం చేయకపోవడం, నిద్రలేమి, అలసటతో నీరసంగా ఉండటం.జన్యుపరమైన లోపం, పొట్ట భాగంలో కొవ్వు పెరగడం, శక్తి, ఉత్సాహం సన్నగిల్లడం, నిద్ర సరిగా పట్టకపోవడం వంటివి కారణాలు.

పల్లె, పట్టణాల్లో వైద్య సిబ్బంది అసాంక్రమిక వ్యాధులపై సర్వే చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 32,27,394 జనాభా ఉండగా వీరిలో 30 ఏళ్లపైబడిన 22,65,280 మంది ఉన్నారు. 25,38,683 మందిని పరీక్షించగా అధిక రక్తపోటుతో 4,18,280 మంది బాధపడుతుండగా 18.42 శాతం, మధుమేహం 2,17,285 ఉండగా 9.60 శాతం నమోదైంది. క్యాన్సర్ లక్షణాలతో 2,976 ఉన్నట్లు స్పష్టమైంది. కొందరు వ్యాధి లక్షణాలు తెలిపేందుకు అంగీకరించడం లేదు. ఈ ఏడాదిలో అధిక రక్తపోటుతో 28 వేలు,



మధుమేహంతో 19,895 మంది బాధపడుతున్నట్లు తేలింది.

**సాంత్వన కలిగించేలా..**జిల్లాకు 10 బెడ్లతో ప్రభుత్వ ఆసుపత్రితో పాలియేటివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేసి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు సాంత్వన చేకూర్చుతున్నారు. మంచానికే పరిమితమైన వారిని 'ఆలన' పేరిట ఉన్న వాహనంలో ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. ప్రతి రోజు నడక, వ్యాయామం చేయడం ద్వారా కొవ్వు, బరువు తగ్గడం ద్వారా గుండె కండరం దృఢంగా పని చేయడం, రక్తపోటు తగ్గడానికి దోహదపడుతుంది.

# విద్యార్థుల ప్రతిభకు 'వీవీఎం' పరీక్ష

మణుగూరు : విద్యార్థుల్లోని నూతన ఆలోచనలు, ఆవిష్కరణలను వెలికి తీయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విజ్ఞాన భారతి, విజ్ఞాన్ ప్రసార్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) సంయుక్తంగా ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహిస్తోంది. 2025–26 విద్యా సంవత్సరానికి అంతర్జాల వేదికగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పోటీ పడవచ్చు.ఉమ్మడి జిల్లాలో ప్రతిభ, ప్రయోగ పోటీల్లో పాల్గొంటున్న వారి సంఖ్య అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రస్తుతం వీవీఎమ్ ప్రతిభ పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 11వ తరగతి వరకు చదివే విద్యార్థులందరూ హాజరుకావచ్చు. రూ.200 రుసుము చెల్లించి %www.vvm.org.in% అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో పరీక్ష రాయొచ్చు. అంతర్జాలం ద్వారా ఈ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు వీవీఎమ్ వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

**నగదు బహుమతులు ఇలా..**

సామాన్య, గణిత పాఠ్య పుస్తకాల్లోని అంశాలు 50 శాతం, విజ్ఞాన శాస్త్రంలో భారతదేశ కృషిపై 20శాతం, శాస్త్రవేత్త జీవిత చరిత్రకు సంబంధించి 20శాతం, లాజిక్ రీజనింగ్ 10 శాతం ప్రశ్నలుంటాయి. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో పాల్గొన్న వారికి ధ్రువపత్రం, జ్ఞాపిక అందజేస్తారు. ప్రతిభ చూపిన ముగ్గురికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున, జాతీయస్థాయిలో ప్రతిభ చూపితే రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున ఇస్తారు. దేశంలోని పరిశోధన, అభివృద్ధి సంస్థలు సందర్శించేలా అవకాశం కల్పిస్తారు. 'భాస్కర స్కాలర్‌షిప్' పేరుతో ఏడాది పాటు నెలకు రూ.2వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు.పరీక్షలో సులువుగా పాల్గొనవచ్చు. ప్రతి ఒక్కరికీ కంప్యూటర్, సెల్‌ఫోన్‌పై అవగాహన ఉంటుంది. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు నమోదు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

బి.నాగలక్ష్మి, డీఈఓ

దరఖాస్తుల గడువు: సెప్టెంబరు 30

లెవెల్ 1 పరీక్ష: అక్టోబరు 28 నుంచి నవంబరు 02

ఫలితాలు: నవంబరు 7

లెవెల్ 2 పరీక్ష: నవంబరు 17, 23వ తేదీల్లో

ఫలితాలు: నవంబరు 27

రాష్ట్రస్థాయి పరీక్ష: డిసెంబరు 21, 28తో పాటు 2026 జనవరి 4న జాతీయ స్థాయి పరీక్ష: 2026 జనవరి 30

# సకాలంలో బిల్లులు.. జోరుగా పనులు!

కొత్తగూడెం : నిరుపేదల సొంతింటి కల నెరవేరేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు 22వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లిస్తుండటంతో నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. ఆర్థిక స్తోమత సహకరించకపోవటం, సిమెంట్, ఇసుక ధరలు అధికంగా ఉండటం తదితర కారణాలు అక్కడక్కడ కొంతమంది లబ్ధిదారులకు అవరోధంగా మారుతున్నాయి.

**ఖమ్మంలో భళా.. భద్రాద్రిలో డీలా**

ఖమ్మం జిల్లాలో సుమారు 85శాతం మంది, భద్రాద్రి జిల్లాలో దాదాపు 72శాతం మంది లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. భద్రాచలం, కొత్తగూడెం నియోజకవర్గాల్లో సగం మంది కూడా పనులు మొదలుపెట్టలేదు. ఖమ్మం జిల్లాలోని పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. భద్రాద్రి జిల్లాలో అశ్వారావుపేట మినహా మిగతా నియోజకవర్గాల్లో ఆశించిన పురోగతి లేదు.

'వివిధ కారణాలతో ముగ్గుపోయని, ముగ్గు పోసినా పనులు మొదలుపెట్టని లబ్ధిదారులతో మాట్లాడుతున్నాం. ఆర్థికపరమైన కారణాలు చెబుతున్నప్పటికీ పథకం అమలుతీరును విశ్లేషిస్తున్నాం. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని భద్రాద్రి కొత్తగూడెం గృహనిర్మాణశాఖ పీడీ రవీంద్రనాథ్'కు తెలిపారు.

# ఎత్తిపోస్తే.. సిరులే..!



సూర్యాపేట: పాలేరు జలాలతో మోతె, నడిగూడెం, మునగాల మండలాల్లో సాగునీటి కష్టాలు తొలగనున్నాయి. ఏటా రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందనుంది. మోతె మండలం అన్నారిగూడెం గ్రామ సమీపంలో.. పాలేరు రిజర్వాయర్‌కు 600 మీటర్ల దూరంలో ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రూ.244 కోట్ల వ్యయంతో చేపట్టే ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో పేర్కొన్నారు. పంపు హౌస్ నుంచి ప్రెజర్ మెయిన్–1: 15.980 కి.మీ. దూరంలోని బల్లతండా సమీప ఎస్సారెస్పీ 36ఎల్ కాలువ ద్వారా.. ప్రెజర్ మెయిన్–2: 5.82కి.మీ దూరంలోని రావిపహాడ్ సమీపంలోని ఎస్సారెస్పీ 22ఎల్ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తారు. ఎస్సారెస్పీ డీబీఎం71 పరిధిలోని 22ఎల్ కాలువ ద్వారా 11,281 ఎకరాలు, 36ఎల్ ద్వారా 34,455 ఎకరాల ఆయకట్టు సాగునీరందనుంది.

128 చెరువుల, కుంటల ఆయకట్టు 8,402 ఎకరాలు కాగా, కాలువల పరిధిలో 37,334 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలని ఖరారు చేశారు.

ఎత్తిపోతల పథకంకు విద్యుత్తు సరఫరాకు అవసరమైన 132/11 కేవీ సబ్‌స్టేషన్, 33కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. అందుకు రూ.11.75 కోట్లు వెచ్చించనున్నారు.

పథకం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాల్సి ఉంది.

26గ్రామాలు.. 45,736 ఎకరాల ఆయకట్టు: రిజర్వాయర్ నుంచి గ్రావిటి ద్వారా నీటితో ఎత్తిపోతల పథకం నింపుతారు. అక్కడి నుంచి రెండు వేర్వేరు విద్యుత్తు మోటార్లతో వదులుతారు. ఒక్కో మోటారు ద్వారా 205 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తారు. ఈ జలాలను ఎస్సారెస్పీ–2 డీబీఎం71 పరిధిలోని 22ఎల్, 36ఎల్ కాలువల పరిధి మూడు మండలాల్లోని 26 గ్రామాల్లో 45,736 ఎకరాల ఆయకట్టుకు అందిస్తారు. వీటి ద్వారా 128 చెరువులు, కుంటలను కూడా నింపుతారు. ఇందులో 22ఎల్, 36ఎల్ ద్వారా మోతె మండలంలోని ఆయకట్టుకు, మునగాల, నడిగూడెం మండలాల్లోని ఆయకట్టుకు 36ఎల్ నుంచి సాగునీరందనుంది.

# స్థానిక పోరుకు రిజర్వేషన్లు ఖరారు!



ఖమ్మం :జిల్లాలో స్థానిక ఎన్నికల సమరానికి రిజర్వేషన్లు ఖరారు చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ముందస్తు ప్రణాళిక అన్ని జిల్లాల్లో చేపట్టారు. ప్రక్రియ ముగిసింది. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు కలెక్టర్, ఎంపీటీసీ, సర్పంచి స్థానాలకు ఆర్డీఓలు, గ్రామ పంచాయతీ వార్డు స్థానాల రిజర్వేషన్లు ఎంపీడీఓలు ఖరారు చేశారు.గత ఎన్నికల్లో ఆయా స్థానాల్లో రిజర్వేషన్లు గుర్తించి మరోసారి అవే రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. పంచాయతీ వార్డుల వారీగా ఓటర్ల జాబితా, 2011 లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా, 2024 కులగణన మేరకు బీసీ జనాభా లెక్కలు సరిపోల్చుతూ అవసరమైన డేటా కలెక్టర్‌కు అందించింది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా పరిషత్ కార్యాలయంలో పోలీస్ బందోబస్తు మధ్య రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టారు. వార్డుల వారీగా విభజించి లెక్కలు తేల్చారు. సోమవారం రాత్రి 11 గంటల వరకు పనిచేసిన అధికారులు, ఉద్యోగులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మళ్లీ ఈ ప్రక్రియలో లీనమయ్యారు. రాత్రి 7 గంటల వరకు చాలా మండలాల్లో లెక్కలు తేలినా నాలుగైదు మండలాలు వెనకబడినట్లు సమాచారం. తిరుమలాయపాలెం, ముదిగొండ, ఖమ్మం రూరల్, కల్లూరు మండలాల్లోని పంచాయతీ వార్డుల లెక్కలు సరిపోల్చటంలో జాప్యం నెలకొంది. ఎట్టి పరిస్థితుల్లో ఈప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించటంతో రాత్రి 11 గంటల వరకు అన్ని మండలాల్లో రిజర్వేషన్ల ప్రతిపాదన ప్రక్రియ ముగించారు. కలెక్టర్ ఈ నివేదికను సర్కారుకు పంపించనున్నారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, జడ్పీ సీఈఓ దీక్షారైనా, ఉప సీఈఓ నాగపద్మజ, డీపీఓ ఆశాలత, డీఆర్డీఓ సన్యాసయ్య, ఎంపీడీఓలు, ఎంపీఓలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఈప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఎన్నెన్ని స్థానాలు ఏఏ వర్గాలకు కేటాయించారో వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు.

# నిధులున్నా.. పనులు సున్నా!



మంథని : మంథని ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి నోచుకోవటం లేదు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా.. పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. దీంతో అరకొర వసతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ ప్రాంగణం ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. డ్రైనేజీ నిర్మాణాలు చాలా ఏళ్ల కిందటివి కావటంతో వర్షపునీరు ప్రాంగణంలోనే నిలుస్తోంది. ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగాయి.

**నాలుగు నెలల క్రితం మంజూరు**

బస్టాండ్ అభివృద్ధి పనులకు నాలుగు నెలల క్రితం రూ.93 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రయాణ ప్రాంగణం ఆధునికీకరణ, రెండు అదనపు ప్లాట్‌ఫాంలు, నూతన మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టాలి. మంథని డిపోనకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.5కోట్ల లాభాలు రావడంతో బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేకించి ఈ నిధులు కేటాయించారు. పనులు చేపట్టపోవటం పట్ల ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ నుంచి నిత్యం సుమారు 14 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గోదావరిఖని, పరకాల, మంథని డిపోలకు చెందిన బస్సులు కాటారం, భూపాలపల్లి, భద్రాచలం, హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్, ధర్మవరం, జమ్మికుంట, మంచిర్యాల, గోదావరిఖని, చంద్రాపూర్, చెన్నూరు, తాడిచెర్ల ప్రాంతాలకు వెళ్తుంటాయి.

సరైన డ్రైనేజీ సదుపాయం లేక చిన్నపాటి వర్షానికి నీరు బస్టాండ్ ఆవరణలో నిలుస్తోంది. బురదమయంగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అదనపు ప్లాట్‌ఫాంలు లేకపోవటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం బయట వేచి ఉంటున్నారు.మహిళలకు ప్రత్యేకించి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభించటం లేదు.

ఆధునికీకరణ పనులకు టెండర్ల వ్యవహారం పూర్తయిందని.. త్వరలోనే గుత్తేదారు పనులు చేపడుతారని డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

# ఇసుక మేటలు.. రాళ్ల కుప్పలు

సిరిసిల్ల : జిల్లాలోని మానేరు వాగు ఇటీవల పోటెత్తింది. 80 వేల నుంచి లక్ష క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ ఉద్ధృతికి వాగువెంట ఉన్న పంట పొలాలు మొత్తం తుడిచిపెట్టుకుపోయాయి. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో 562 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు. ఎకరానికి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. నెలరోజుల్లో చేతికందే దశలో ఊడ్చుకుపోవడంతోపాటు ఇసుక, రాళ్లు మేటలు వేశాయి. వ్యవసాయశాఖ విచారణ నివేదికలను ప్రభుత్వానికి పంపింది. ఇసుక మేటలు వేసిన ప్రాంతాల్లో ఉపాధి కూలీలతో తొలగించాలని ఆదేశించింది.

**పట్టా భూములు 29.18 ఎకరాలే..**

జిల్లా రెవెన్యూ, వ్యవసాయశాఖ నుంచి తీసుకున్న నివేదికల ఆధారంగా డీఆర్డీవో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందులో చాలా వరకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ భూములే ఉన్నట్లు గుర్తించారు. నష్టం జరిగిన 562 ఎకరాల్లో 29.13 ఎకరాల పట్టా భూముల్లో 124 మంది రైతులను మాత్రమే గుర్తించారు. మిగతావి ఆక్రమించినవి కావడంతో వాటిని పరిగణనలోకి తీసుకోవడంలేదని వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చెబుతున్నారు. కూలీలతో పనులు చేపట్టాల్సిన పొలాల్లో చాలా వరకు బండరాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం కూలీలతో ఇసుకమేటలు తొలగించాలని మాత్రమే ఆదేశించింది. బండరాళ్లను తొలగించడం.. ఆ ప్రాంతంలో మట్టితో నింపి చదును చేసుకోవాలంటే రైతులకు భారీ ఖర్చుతో కూడుకున్నది. కోతకు గురైన ప్రాంతమంతా వాగులో నీటి ప్రవాహానికి సమానమైంది. ఈ ప్రాంతం మట్టితో నింపి, ఎత్తు చేస్తేనే పంటల సాగుకు అనువుగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

**సమీపిస్తున్న సీజన్**

వానాకాలం పంట కోతలు పది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. నవంబరు నెలాఖరు నుంచి యాసంగి సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటిలోగా భూములను అభివృద్ధి చేసి రైతులు వినియోగించుకునేలా ఉపాధిహామీలో పనులు చేపట్టాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వరి కోతలు ప్రారంభించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిమగ్నమవుతారు. సెప్టెంబరు, అక్టోబరులో ఉపాధి కూలీలు పనులు రావడం కష్టంగా ఉంటుంది. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నుంచి జూన్ వరకు ఉపాధి పనులకు వచ్చే కూలీలు ఎక్కువగా ఉంటారు. ఇసుక మేటలు తొలగించడానికి నెలరోజులపైనే సమయం పడుతుంది. మరోవైపు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పంటలు ముంచి.. ఆశలు తుంచి

నిర్మల్: వరద నీరు సాఫీగా వెళ్లడానికి సాగునీటి కాలువలు సరిగా ఉన్నాయా.. ఏమైనా ఆటంకాలు ఏర్పడుతున్నాయా.. వంటి వాటిపై ఎప్పటికప్పుడు నీటి పారుదలశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలి.. కానీ అవేమీ పట్టించుకోని కారణంగా అన్నదాతలకు శాపంగా మారుతోంది. 2020 సంవత్సరంలో జరిగిన పురపాలిక ఎన్నికలకు ముందు నిర్మల్ మున్సిపాలిటీలో విలీనమైన వెంకటాపూర్ గ్రామ చెరువు అలుగు నీరు మూడు కల్వర్టుల ద్వారా వెళ్లిపోయేది. ఆ కల్వర్టులు నిర్వహణ లేకపోవడంతో రెండు పూర్తిగా దెబ్బతిని ఆనవాళ్లు కోల్పోయాయి. ఉన్న ఒక్కటీ చిన్నగా ఉండటంతో గ్రామ చెరువు అలుగు నీటితోపాటు కడ్తాల్ చెరువు అలుగు ఎత్తు పెంచడంతో వరద ఎక్కువై పంటలు దెబ్బతింటున్నాయి. కల్వర్టులు బాగు చేయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కందకం లేకపోవడమూ కారణమే**

జిల్లాలోని సోన్ నుంచి మామడ మండలం ఆరెపల్లి సమీపం వరకు 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 44పై ప్రజల రాకపోకల కోసం 14 అండర్‌పాస్‌లు నిర్మించారు. నిబంధనల ప్రకారం వర్షం



నీటితో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి అండర్‌పాస్ ఇరువైపులా కందకాల తవ్వకాలు చేపట్టాలి. జిల్లాలో నాలుగైదు చోట్ల మినహా మిగతా ప్రాంతాల్లో ఎక్కడా లేకపోవడంతో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రవాహం పక్కనే ఉన్న పంట పొలాల్లోకి చేరడటంతో అన్నదాతలు నష్టపోతున్నారు. రోజుల తరబడి వాటిల్లో నీరు ఉండటంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి.

**ఏటా నష్టమే**కల్వర్టుల నిర్వహణ లేక ఆనవాళ్లు కోల్పోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామ చెరువు అలుగు ద్వారా నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో నీరు వెళ్లే మార్గం లేక సోయా, వేరుసెనగ, ఆయిల్‌పామ్, వరి పొలాలు కొట్టుకుపోయాయి. వరద నీరు పంట పొలాల్లోకి రాకుండా ఉండటానికి మూతబడ్డ రెండు కల్వర్టులు బాగు చేయించాలి. కొత్తగా మరో మూడు నిర్మించాలి. వెంకట్‌రెడ్డి, రైతు, వెంకటాపూర్

# నిధులు నీళ్లపాలు.. నిర్మాణంలో లోపాలు!

భువనగిరి: కాకతీయుల కాలం నాటి చెరువులకు మరమ్మతులు చేపట్టే పనులు 2017లో ప్రారంభించారు. రూ.కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ పనులను కొన్నిచోట్ల అసంపూర్తిగా వదిలేశారు. దీంతో చెరువులను మినీ ట్యాంక్ బండ్‌లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నెరవేరడం లేదు.హైదరాబాద్– భూపాలపట్నం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భువనగిరి పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు 2017లో రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు పూర్తిగా నాసిరకంగా జరిగాయనే విమర్శలున్నాయి. సుమారు రూ.మూడు కోట్ల వరకు ఖర్చు చేసి రెండు కి.మీ పొడవునా కట్టను వెడల్పు చేశారు. నాసిరకంగా పనులు జరగడంతో 2018లో భారీ వానలకు కట్టకుంగి పోయింది. రెయిలింగ్ దెబ్బతింది. రివిట్‌మెంట్ చేయకుండా వదిలేశారు. తదుపరి అభివృద్ధి కోసం హెచ్ఎండీఏకు



కేటాయించడంతో సుందరీకరణ జరిగింది. మరమ్మతులు చేపట్టారు. ఆలేరు మండలం కొలనుపాక పిన్న చెరువును గత ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసింది. చెరువు అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయి. చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. 1.8 కి.మీ పొడవున్న కట్టను ఎత్తు, వెడల్పు పెంచి బలోపేతం చేశారు. కట్టకు లోపలి వైపున ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. సుమారు రూ.3 కోట్ల పనులు జరగగా..మిగతా రూ.2కోట్ల విలువైన పనులు అటకెక్కాయి. ప్రస్తుతం కట్ట రెండువైపులా కంపచెట్లతో నిండిపోయింది. చౌటుప్పల్ ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మించేందుకు 2017లో రూ.4 కోట్ల నిధులు మంజూరు చేశారు. సుమారు రూ.కోటి ఖర్చుచేసి చెరువుకట్ట విస్తరణ పనులు చేపట్టారు. చెరువులో పూడిక తొలగించారు. మిగిలిన పనులు చేపట్టలేదు. నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారు మిగతా పనులను పూర్తి చేయలేదు.

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం, సైదాపురం, గండి చెరువులను గత ప్రభుత్వ హయాంలో మినీ ట్యాంక్‌బండ్‌లుగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. రూ.కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. అవి అసంపూర్తిగా ఉండటంతో స్థానికులకు ఆహ్లాదాన్ని పంచడం లేదు. మోత్కూరులోని పెద్ద చెరువుకు రూ.4.21 కోట్ల నిధులు కేటాయించి మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దే పనులు చేపట్టారు. సుమారు రెండు రూ.కోట్లకు పైగా పనులు జరిగాయి. అసంపూర్తిగా నాసిరకంగా చేపట్టడంతో ప్రయోజనం లేకుండా పోయింది. రేయిలింగ్ దెబ్బతింది.

# పారి'శుద్ధ్యం' అబద్ధం

హైదరాబాద్ : గ్రేటర్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అసహనం వ్యక్తం చేశారు. ఇంత అధ్వానమా.. అని బల్దియా కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన మరుసటి రోజే ఖైరతాబాద్ జడ్సీ అనురాగ్ జయంతి అంతా పర్యవేక్షించారు. చెత్తకుప్పల శుభ్రతకు మొత్తం 500 వాహనాలను కేటాయించాల్సి ఉండగా కేవలం 273 వాహనాలను ఉపయోగిస్తోన్న రాంకీ సంస్థకు రూ.లక్ష జరిమానా విధించారు. ఉపకమిషనర్లు ఉదయం 6 కల్లా క్షేత్రస్థాయిలో తిరిగి పర్యవేక్షించాలి. ప్రస్తుతం ఆ నిబంధన చాలాచోట్ల అమలు కావట్లేదు. ఐఏఎస్‌లు జడ్సీలుగా ఉన్న జోన్లలోనూ పారిశుద్ధ్యం దారుణంగా ఉంది.

జీహెచ్ఎంసీలోని 18 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, వందలాది మంది అధికారులు, అస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) నిపుణులు, రాంకీ యంత్రాంగం, స్వచ్ఛ ఆటోలు.. నిత్యం పని చేస్తున్నా.. రాజధానిలో చెత్త సమస్య తీరట్లేదు.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పారిశుద్ధ్య విభాగంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉంటారు. వాహనాల్లో తిరుగుతూ ఉల్లంఘనులను గుర్తించి అక్కడి కక్కడే జరిమానా వేస్తారు. ఇలాంటి విధానాన్ని ఇంతకు



ముందున్న కమిషనర్ ఇలంబర్తి కూడా అమల్లోకి తేవడంతో మార్చి నుంచి సెప్టెంబరు వరకు రూ.కోటి జరిమానా విధించారు.

చెత్త డబ్బాలను తొలగించింది.. 15 ఏళ్ల క్రితం
ఐదేళ్ల కిందట మళ్లీ ఏర్పాటు చేసినవి.. 1,200
అదనంగా ఏర్పాటు చేసినవి.. 1,300
డబ్బాలే లేని చెత్తకుప్పలు.. సుమారు 1,000
నగరంలో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త.. 8,500 టన్నులు
ఇంటింటి నుంచి స్వచ్ఛ ఆటోలు సేకరించేది.. 4,000 టన్నులే. (మిగిలినది హోటళ్ల వ్యర్థాలు, కొమ్మలు)
సేకరణ ఆటోలు.. 2,500
ఇంటింటి నుంచి నెలకు వసూలు చేసేది.. రూ.100-150 (ఈమాత్రమైనా ఇవ్వకుండా రోడ్లపై పడేస్తున్నారు.)చెత్తకుప్పలు అధికంగా ఉన్న జోన్లు.. చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్

# బడి గోడ దాటని భగీరథ

సారంగాపూర్ : సారంగాపూర్ మండలంలో 5 ఉన్నత, 3 ప్రాథమికోన్నత, 25 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 1,669 మంది విద్యార్థులు చదువుతున్నారు. సారంగాపూర్, రేచపల్లి ఉన్నత పాఠశాలల్లో దాతల సహకారంతో శుద్ధ జల యంత్రాలు ఏర్పాటు చేశారు.బీర్పూర్ మండలంలో 4 ఉన్నత, 3 ప్రాథమికోన్నత, 26 ప్రాథమిక పాఠశాలల్లో కలిపి 1,495 మంది విద్యార్థులున్నారు. మండలకేంద్రంతో పాటు తుంగూరు పాఠశాలల్లో మాత్రమే శుద్ధ జల పరికరాలున్నాయి. అది కూడా విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా ప్లాంటు సామర్థ్యం లేక తాగునీటి అవసరాలు తీరడం లేదు.

జిల్లావ్యాప్తంగా సర్కారు బడుల్లో దాహార్తి నెలకొంది. అన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ నీరు అందుతుందని రికార్డుల్లో ఉన్నా క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితి. పైపులైన్ వేసినా పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. మిషన్ భగీరథ, విద్యాశాఖల మధ్య సమన్వయం లేక శుద్ధ జలం అందని ద్రాక్షగానే మారింది. ఎక్కడైనా దాతల సహకారంతో ఏర్పాటు చేసినా ప్లాంట్ల సామర్థ్యం తక్కువగా ఉండటంతో అవసరాలకు సరిపోవడం లేదు.

**నిర్వహణ లేక ఏడాదికే మూలకు..**

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తున్నా తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. దీంతో పిల్లలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోంది. జిల్లాలో 781 ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి దాదాపు 60 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ నీటిని అందించాలని ఆదేశాలున్నా సరఫరా లేక బోరుబావి నీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. 2011లో ప్రభుత్వం పలు పాఠశాలలకు శుద్ధ జల పరికరాలు అందించింది. నిర్వహణ సరిగ్గా లేక ఏడాదికే పరికరాలు చెత్త కుప్ప పాలయ్యాయి.



**ముందు పైపులుంటే నీరందినట్లే(నా)!**

ప్రతి బడికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని ఆదేశాలున్నా ఎక్కడా అందడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల ముందు నుంచి పైపులైన్ వెళ్తే సరఫరా చేస్తున్నట్లు కాగితాల్లో చూపుతున్నట్లు తెలుస్తోంది. చాలా చోట్ల విద్యార్థులు ఇంటి నుంచి సీసాల్లో తెచ్చుకుంటున్నారు. ఉదయం 9 గంటలకు లీటరు సీసాలో నీటిని తీసుకొని బడికి వచ్చే విద్యార్థి సాయంత్రం వరకు వాటినే సరిపెట్టుకుంటున్నాడు. మధ్యాహ్న భోజనం తిన్నాక, ఆటలు ఆడిన తర్వాత సమీపంలోని బోరు లేదా ట్యాంకు నీటిని వాడాల్సి వస్తోంది. ప్రస్తుతం పాఠశాలలకు దసరా సెలవులున్నందున ఉన్నతాధికారులు చొరవ చూపి పైపులైన్ అందుబాటులో ఉన్న పాఠశాలలకు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# భగాయత్.. బాధలు తీరేదెన్నడో?



ఉప్పల్ : మూసీ ఒడ్డున 400 ఎకరాల్లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సమస్యలు నివాసితులను పీడిస్తున్నాయి. హెచ్ఎండీఏ వేలంలో గజం స్థలాన్ని రూ.లక్షకుపైగా విక్రయించింది. జీహెచ్ఎంసీకి లేఅవుట్ అప్పగింత ప్రక్రియ ఏళ్ల తరబడి కొనసాగుతుంది. ఇక్కడ అభివృద్ధిని మాత్రం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పట్టించుకోవడం లేదు. నిధులివ్వకుండానే హెచ్ఎండీఏ తప్పుకొంది. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, ఆస్తిపన్నును జీహెచ్ఎంసీ వసూలుచేస్తోంది. నిధుల్లేవంటూ జీహెచ్ఎంసీ పనులు చేపట్టడంలేదు. అందమైన లేఅవుట్ నేడు సమస్యలతో నిండిపోయింది. లేఅవుట్ ఫేస్-1,2లలో 3వేలకుపైగా కుటుంబాలు ఉంటున్నాయి. కనీస సౌకర్యాలు లేక నివాసితులు ఇబ్బందిపడుతున్నారు. ఫేస్-2లో మంచి నీటి సౌకర్యమూ లేదు.

గోదారులు.. వర్షపు నీటిని బయటకు తరలించే వ్యవస్థ ఏర్పాటుచేయలేదు. ఫేస్-2లో చిన్న వర్షానికే రహదారులన్నీ గోదారులుగా మారుతున్నాయి. ముఖ్యంగా డీమార్ట్, ఉప్పల్ ఐడీఏ, రామంతాపూర్ మార్గాలలో సమస్య తీవ్రంగా ఉంది. జలమండలి రూ.22 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఉన్న రోడ్లు తవ్వేసి వదిలేశారు.

ఆయా విభాగాల అధికారులకు సమస్యలు విన్నవించిన పట్టించుకోవడం లేదని భగాయత్ లేఅవుట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకల మధుసూదన్‌రెడ్డి వాపోయారు.

**ఎస్టీపీ ఏదీ?..** లేఅవుట్‌లో డ్రైనేజీని శుద్ధి చేసి మూసీలోకి వదిలేలా మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్టీపీ) నిర్మించలేదు. నేరుగా మూసీలోకే మళ్లించి హెచ్ఎండీఏ చేతులు దులుపుకొంది.

పడకేసిన పారిశుద్ధ్యం.. పారిశుద్ధ్య పనులను జీహెచ్ఎంసీ పర్యవేక్షిస్తోంది. ఇటీవలే 22 మందితో పనులు చేపట్టింది. ఫేస్-1లోనే అరకొరగా సాగుతున్నాయి. ఫేస్-2లో ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే ఉంటున్నాయి. దోమల సమస్య తీవ్రంగా ఉంది.

# తప్పు చేయకున్నా.. తప్పని తిప్పలు!..

# సైబర్ ఉచ్చులో ఖాతాదారులు




హైదరాబాద్ : బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి తన మిత్రుడికి రూ.లక్ష చేబదులుగా ఇచ్చాడు. 2 నెలలకు ఆయన వ్యాపారి బ్యాంకు ఖాతాకు ఆసొమ్ము బదిలీ చేశాడు. వారం తరువాత ఇద్దరి బ్యాంకు ఖాతాలు నిలిచిపోయాయి. ఆరాతీస్తే అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు బ్యాంకు అధికారులు చెప్పారు. కర్ణాటకలో బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు తెలుసుకున్నారు.

నగర శివారు కొంపల్లి ప్రాంతంలో ఒకరు చిన్నతరహా పరిశ్రమతో 20-30 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల రూ.80 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేయించుకున్నారు. మరుసటిరోజే లావాదేవీలు నిలిచిపోయాయి. గతంలో ఆయన యూపీఐ ఖాతాలో ఒక యువకుడు రూ.90 వేలు జమచేసి నగదు తీసుకున్నాడు. ఆయన సైబర్ నేరస్థుల సొమ్మును మార్పిడి చేసే ఏజెంట్ కావడంతో కేరళ పోలీసుల ఫిర్యాదుతో ఖాతా స్తంభింపజేసినట్టు బ్యాంకర్లు వర్తమానం పంపారు.వీరు ఎలాంటి నేరచరిత్ర లేకున్నా పోలీసు రికార్డుల్లోకి చేరారు. బాధితులు తమ కష్టార్జితాన్ని చెల్లించి బయటపడ్డారు. ఏతప్పు చేయకున్నా నేరస్థులుగా మారామనే మనోవేదన అనుభవించారు. ఇవిఉదాహరణలే. సైబర్ మాయగాళ్లు సామాన్యుల నుంచి బడా వ్యాపారుల వరకు వారికి తెలియకుండానే బ్యాంకు ఖాతాలను వాడుకుంటున్నారు.

సైబర్ నేరస్థులు కాజేసిన సొమ్ము తెలిసో, తెలియకో ఖాతాల్లోకి వచ్చినట్టు గుర్తిస్తే తప్పనిసరిగా ఫ్రీజ్ చేస్తారని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు గుర్తించగానే సంబంధిత బ్యాంకు, సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కొంత వెసులుబాటు ఉంటుందని చెప్పారు.

**పసిగట్టలేక.. విలవిల**

అకస్మాత్తుగా కొందరి బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతాయి. ఖాతాదారులు గుర్తించేలోపు మాయమవుతాయి. ఇందుకు సాంకేతిక కారణమైతే ఏసమస్యా ఉండదు. సైబర్ నేరస్థులతో సంబంధాలున్న వ్యక్తులు, సంస్థల నుంచి నగదు చేరినప్పుడు ఇబ్బందులు తప్పవు. తెలియక జరిగినా ప్రతిఫలం చవిచూడాల్సిందే. సైబర్ మోసగాళ్లు బాధితులనుంచి కాజేసిన సొమ్మును జమ చేసేందుకు చిరువ్యాపారులు,కూలీలు, నిరుద్యోగుల బ్యాంకు ఖాతాలను వాడుకుంటారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు పోలీసుల సిఫార్సుతో బ్యాంకు అధికారులు ఆ నగదు లావాదేవీలు జరిగిన అన్ని ఖాతాలను ఫ్రీజ్ చేస్తారు. దీని నుంచి బయటపడేందుకు నానాతంటాలు పడుతున్నారు. చివరికి కొందరు బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి చెల్లించి బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించుకుంటున్నారు. ఇటీవల నగరానికి చెందిన ఒక వ్యాపారి రూ.2 లక్షలు బాధితుడి ఖాతాకు జమ చేశాడు.

# ఛీదరించొద్దు.. ఆదరించండి




కొడంగల్ : కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన అఖిలను ఒంటి గంటకు మాతా, శిశు ఆసపత్రికి తీసుకొస్తే.. తెల్లవారు జాము వరకు వైద్యురాలు వచ్చి చూడకపోవడంతో నర్సులే వైద్యం చేశారు. పరిస్థితి విషమించి గర్భంలో శిశువుతోసహా తల్లి మృతిచెందింది.యాలాల మండలం దేవనూరుకు చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావడడంతో ఆస్పత్రికి వచ్చారు. సాధారణ ప్రసవం అవుతుందని వైద్యులు, సిబ్బంది రోజంతా కాలక్షేపం చేయించారు. గర్భంలో శిశువు మృతిచెందాక శస్త్రచికిత్స చేశారు. వైద్యులు, సిబ్బందితో బాధితులు గొడవపడ్డారు.

మాతాశిశు సంరక్షణ ఆస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. రోగులతో వైద్యులు, సిబ్బంది వ్యవహార శైలిపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యానికి వస్తే సిబ్బంది ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వాపోతున్నారు. గర్భిణులను ప్రసూతి వైద్యులు పరీక్షించకుండా కొన్ని సందర్భాల్లో స్టాఫ్‌నర్సులు, ఇతర నర్సులపై వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆస్పత్రిలో తరచూ గొడవలు, మాతాశిశు మరణాలు సంభవిస్తున్నాయని రోగులు అంటున్నారు.

**నిత్యం వందల సంఖ్యలో..:** తాండూరు- హైదరాబాద్ మార్గంలోని మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి, కర్ణాటక ప్రాంతం నుంచి గర్భిణులు, చిన్నారులు వైద్యసేవల కోసం రోజూ 450- 500 మంది వరకు వస్తుంటారు. వారిలో 30-50 మంది అడ్మిట్ అవుతుంటారు. ఆస్పత్రిలో ఒకరు రెగ్యులర్ ప్రసూతి వైద్యురాలుండగా.. మిగతా 8 మంది ఒప్పంద పద్ధతిపై పనిచేస్తున్నారు. చిన్నారుల వైద్యులు, మత్తు వైద్యులున్నారు. రోజూ 15- 20 వరకు సాధారణ ప్రసవాలు, 8-10 సిజేరియన్ కేసులు నమోదవుతున్నాయి.

**పరుష పదాలతో దూషిస్తూ..**

రోగులతో వైద్యులు, సిబ్బంది అమర్యాదగా ఉంటారని ఆరోపణలున్నాయి. ప్రసూతి గదిలో గర్భిణులతో పరుషంగా మాట్లాడతారని సంబంధీకులు చెబుతున్నారు. రోగుల వెంట వచ్చే వారిపైనా సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తారంటున్నారు. మెరుగైన వైద్యం అందిస్తున్నామని.. రోజూ సాధారణ, శస్త్ర చికిత్సలు చేస్తున్నామని డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శరత్ తెలిపారు.

**వైద్యురాలి సస్పెన్షన్**

ప్రసూతి వైద్యురాలు మంజులను సస్పెండ్ చేసినట్లు మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శరత్, ఆర్ఎంఓ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన అఖిల ప్రసవ వేదనతో ఆదివారం ఆస్పత్రిలో మృతిచెందడంతో బాధిత కుటుంబీకులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ రాజేశం, ప్రసూతి విభాగం అధికారిణి డా.సుమిత్ర ఆస్పత్రిలో విచారించారు. జరిగిన సంఘటనపై కిందిస్థాయి సిబ్బంది నుంచి వివరాలు ఆరా తీశారు. వైద్యురాలి నిర్లక్ష్యం ఉందని తేల్చిన అధికారులు ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

# పెద్దలే గద్దలు!

వికారాబాద్ :మర్పల్లి మండలం పట్లూర్ శివారులో కాందిశీకులకు చెందిన 400 ఎకరాల భూములున్నాయి. దాదాపు 100 మందికిపైగా రైతులు సాగు చేసుకుంటున్నారు. ఆ భూములపై కొందరు నేతల కన్ను పడింది. ఉన్నత స్థాయిలో ఆదేశాలు రావడంతో అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఆర్ఐపై ఒత్తిడి తేగా.. సెలవుపై వెళ్లినట్లు సమాచారం.మర్పల్లి మండలం గణాపూర్, దామస్తాపూర్‌లో డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి భూములు స్వాధీన పర్చుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల మర్పల్లి మండలంలోని పట్లూర్‌లో ఓ నాయకుడి ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా ఎకరా సీలింగ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన విషయమై దుమారం చెలరేగుతోంది.

పూడూరు మండలం రాకంచర్లలో ఓ నాయకుడు ఎకరా రూ.2 కోట్లు పలికే ఓ వృద్ధురాలి భూమిని హైదరాబాద్‌కు చెందిన వారికి రిజిస్ట్రేషన్ చేయించాడు. దీంతో ఆమె కుమారుడు గ్రామస్థులతో కలిసి ఠాణాలో ఫిర్యాదు చేశారు.జిల్లాలో భూ మాఫియా చెలరేగుతోంది. ఖాళీ స్థలాల కబ్జా, నకిలీ పత్రాలు సృష్టించి ఆస్తులను సొంతం చేసుకోవడం, అడ్డొచ్చిన వారిని బెదిరించడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. కుమార్తె పెళ్లికనో, అత్యవసర పనులకు పనికి వస్తాయనో చాలామంది ప్లాట్లు కొంటున్నారు. అవసరానికి అమ్ముకోవాలనుకుంటే ఏదో ఒక కొర్రీ పెట్టి సమస్య సృష్టిస్తున్నారు. ఈ వ్యవహారాల్లో నాయకుల హస్తం ఉండటం



అక్రమార్కులకు కలిసి వస్తోంది.

**కబ్జాలు చేసి.. రూ.కోట్లు గడించి..**

జిల్లాకు చెందిన ఓ నాయకుడు అనతి కాలంలోనే భూ మాఫియాతో చేతులు కలిపి రూ.కోట్లు గడించాడు. నకిలీ పత్రాలతో స్థలాలను ఆక్రమించి సంపాదించాడు. మరికొందరు ముఠాలను పోషిస్తూ పని కానిచ్చేస్తున్నారు. ఏవైనా వివాదాస్పద భూములుంటే చాలు ముఠాలు రంగంలోకి దిగుతున్నాయి. మందీమార్బలంతో వివాదాస్పద స్థలాన్ని ఆక్రమించుకొని సెటిల్‌మెంట్లకు దిగుతున్నారు.

**శివారు కాలనీలపై దృష్టి..**వికారాబాద్, తాండూరు పట్టణ శివారు ప్రాంతాల్లోని భూముల ధరలు పెరగడంతో కబ్జాదారుల కన్ను వాటిపై పడింది. తప్పుడు పత్రాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకొని కబ్జాలకు పాల్పడుతున్నారు. స్థానిక ముఠాలు భూ వివాదాలను సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్నాయి.

# అరకొర బస్సులు..

# దర్శనానికి తిప్పలు

ధర్మపురి : హైదరాబాద్ నుంచి ధర్మపురి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకునేందుకు అయిదుగురు సభ్యులున్న ఓ కుటుంబం రాత్రి 10 గంటలకు జగిత్యాల బస్‌స్టాండ్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో బస్సు లేక పిల్లాపాపలతో అక్కడే దోమలతో సావాసం చేస్తూ నిద్రించి మరునాడు 6 గంటలకు బస్సులో ధర్మపురికి చేరారు. ధర్మపురి నుంచి రాత్రి 10 గంటలకు కరీంనగర్‌కు వెళ్లాలనుకునే వరంగల్‌కి చెందిన నలుగురు వృద్ధులు బస్సు లేక ధర్మపురి ఆర్టీసీ బస్‌స్టాండులోని బెంచీలపై నిద్రించారు. మరునాడు ఉదయం 7 గంటలకు వయా రాయపట్నం మీదుగా కరీంనగర్‌కు వెళ్లారు.

జగిత్యాల ఆర్టీసీ డిపోలో సగానికిపైగా ఆదాయ వనరులున్న ధర్మపురి రూట్‌పై ఆర్టీసీ అధికారులు దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేస్తున్నారు. నిత్యం జగిత్యాల డిపోనకు చెందినవి నాలుగు జగిత్యాల-ధర్మపురి బస్సులు 7 ట్రిప్పులు, మరో రెండు లక్షెట్టిపేట, ధర్మపురి-దొంతాపూర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు ట్రిప్పులు మాత్రమే నడిపిస్తున్నారు. ఈ రూటులో ప్రతిరోజు కనీసం పది వేల మంది భక్తులతోపాటు జనం ప్రయాణం చేస్తుంటారు. సరిపోయినన్ని బస్సులు అందుబాటులో లేక భక్తులు అవస్థలు పడుతున్నారు.

**నైట్‌హాల్టుపై..**

జగిత్యాల నుంచి ధర్మపురికి రాత్రి 10 గంటల తర్వాత నైట్‌హాల్టు బస్సు ఏర్పాటు చేయాలని కోరుతున్నా డిపో అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. రాత్రి 7.20 గంటలు దాటిందంటే జగిత్యాల నుంచి ధర్మపురికి ఆర్డినరీ బస్సు లేదు. దీంతో దూర ప్రాంత భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రూ.80 టికెట్ పెట్టుకుని రాత్రి 11 గంటలకు వచ్చే రాజధాని బస్సులో నిరుపేద భక్తులు రాలేకపోతున్నారు. కనీసం



రాత్రి 10 గంటలకు జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు ఏర్పాటు చేయాలని, ఇదే నైట్‌హాల్టు బస్సు ఉదయం 5 గంటలకు వేములవాడకు వెళ్లేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. వయా రాయపట్నం కరీంనగర్‌కి చేరుకునేలా షటిల్ బస్సును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ధర్మపురి-జగిత్యాలకి 29 కి.మీలు మాత్రమే. బస్సులో 60-70 మంది ప్రయాణించాల్సి ఉండగా 100 నుంచి 120 మంది ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రతీ స్టేజీకి ఆగడం, వెళ్లడం వెరసి ధర్మపురి నుంచి జగిత్యాలకు గంటపావు సమయం తీసుకుంటోంది.

**పుణ్యక్షేత్రాలకు అనుసంధానమేదీ**

గతంలో ధర్మపురి నుంచి యాదగిరిగుట్ట, వేములవాడ, కొండగట్టు, వరంగల్‌కు బస్సులు నడిపేవారు. ఇవన్నీ రద్దు చేయడంతో దూర ప్రాంత భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.

# పైపైకి పాతాళగంగ

జగిత్యాల : జిల్లాలో జులై నెలాఖరున 4.49 మీటర్లుగా ఉన్న సగటు భూగర్భ జలమట్టం.. గత నెలాఖరు వచ్చేసరికి 3.61 మీటర్లుగా నమోదైంది. జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 683 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 3 శాతం అధికంగా 700.8 మి.మీ వర్షపాతం నమోదు కావడం, ఆయకట్టుకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీరు రావడంతో సగటు భూగర్భ జలమట్టం పెరిగింది. నెల రోజుల్లోనే 0.88 మీటర్లు పెరగడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**99 శాతం సాగు**

ఈ వానాకాలంలో 3,86,510 ఎకరాల్లో అన్ని రకాల పంటలను సాగు చేస్తారని అంచనాకాగా ఇప్పటివరకు 99.86 శాతంగా.. 3,85,955 ఎకరాల్లో అన్ని రకాల పంటలను విత్తుకున్నారు. ఈనెల మొదటి 15 రోజుల్లో పైర్ల సాగుకు అదను ఉండటంతో సాగు విస్తీర్ణం వందశాతం దాటనుంది. ప్రధాన పంట అయిన వరిలో ఇప్పటికే 3.13 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. కాగా ఈ మాసంలోనూ వర్షాల అంచనా, ఆయకట్టుకు కాలువ నీరు వస్తుండటంతో సగటు భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలో కొనసాగనుంది. దీంతో వానాకాలం పంటల పూర్తితోపాటు.. యాసంగి పైర్ల సాగుకు ఉపకరించనుందని భూగర్భ జలవనరులశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ప్రాజెక్టులు, నదీ పరివాహకాల్లో వరదలు కొనసాగుతుండటం కలిసి వస్తోందని.. సాగుకు నీటి ఇబ్బంది ఉండదని వివరించారు.

# ఆకృతి లేకుండానే అంతస్తులు

ఖమ్మం: సాంకేతిక విద్యనభ్యసించిన యువతకు ఉపాధి కల్పించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రభుత్వం ఐటీహబ్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. నెలలు గడుస్తున్నా రెండో దశ పనుల్లో ఆశించిన పురోగతి లేదు. నిరంతరం పర్యవేక్షించాల్సిన రాష్ట్ర మౌలిక సదుపాయా ల కల్పన సంస్థ(టీజీఐఐసీ) అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. భవనానికి ఏఏ హంగులు కల్పించాలి, ఎలా నిర్మించాలో తెలిపే డిజైన్ లేక గుత్తేదారు సంస్థ ప్రతినిధులు తలపట్టుకుంటున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్ నమూనాతో జీ౦2 వరకు నిర్మించి నిరీక్షిస్తున్నారు. ఇదీ ఖమ్మం జిల్లాకేంద్రంలోని ఐటీ హబ్-2 నిర్మాణ దుస్థితి.

**ఆగుతూ.. సాగుతూ..**

ఖమ్మం నగరాన్ని ఐటీకి నిలయంగా మార్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సకల హంగులతో ఐటీ హబ్-1 నిర్మించింది. ఇదీ సత్ఫలితాలివ్వటంతో మరికొన్ని కంపెనీలను రప్పించి మరింతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని సంకల్పించింది. 2021, ఏప్రిల్ 2న ఐటీహబ్-2కు శంకుస్థాపన చేయగా.. ఏడాదిలోపు పూర్తి చేయాలని గడువు విధించారు. రూ.32 కోట్లతో జీప్లస్ 6 భవనం నిర్మించాల్సి ఉంది. శంకుస్థాపన చేసిన 22 నెలల తర్వాత టెండరు ఖరారు చేసి గుత్తేదారుకు బాధ్యతలు అప్పగించారు. ఏళ్లు గడుస్తున్నా.. భవనం తుదిరూపు దాల్చలేదు.

**పనులిక్కడే.. అధికారులక్కడ**

జిల్లాకేంద్రంలో టీజీఐఐసీ జోన్ కార్యాలయం ఉన్నా నిర్మాణ బాధ్యతలను వరంగల్ జోనల్ మేనేజర్‌కు అప్పగించారు. వీరు ఏఈ, డీఈని పంపించి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీ౦6లో సగం పనులూ పూర్తికాలేదు. బిల్లులు రావడం లేదని రెండు నెలలపాటు ఆపేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గత నెల 24 నుంచి మళ్లీ మొదలయ్యాయి. ఇప్పటివరకు గ్రౌండ్‌ఫ్లోర్ ఎలా ఉండాలో తెలిపే డిజైన్ మాత్రమే ఇవ్వడంతో దాని ఆధారంగా మరో రెండు అంతస్తులు కట్టామని, పైఅంతస్తులు ఎలా కట్టాలో అర్థకావడం లేదని గుత్తేదారుల సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఇప్పుడు నిధులున్నా.. డిజైన్ లేకపోవడం ఆటంకంగా మారింది. అంతస్తులతో పాటు కింది భాగం నుంచి గోడలు నిర్మించాల్సి ఉది. ఈ ఇంకా మొదలుకాలేదు. జులై వరకు గడువు ఉండగా దాన్ని డిసెంబరు వరకు పెంచారు. ఆలోపు పూర్తయ్యే పరిస్థితి లేదు. త్వరగా పూర్తిచేస్తే.. కంపెనీలు వచ్చేవని, తమకు ఉద్యోగాలు దక్కేవని వందలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

**త్వరలో డిజైన్ రానుంది..: స్వామి, జోనల్ మేనేజర్, టీజీఐఐసీ వరంగల్**భవనం డిజైన్ చేసే కన్సల్టెంట్(గుత్తేదారు)కు కిడ్నీ దెబ్బతింది. రెండంతస్తుల వరకు



డ్రాయింగ్ ఉంది. మూడో అంతస్తుకు లేదు. డ్రాయింగ్ ఆలస్యం కావడంతో పాత కన్సల్టెంట్ మరొకరి సాయంతో డిజైన్ రూపొందిస్తున్నారు. మూడు, నాలుగు రోజుల్లో రానుంది. డిసెంబరులోపు భవన నిర్మాణం పూర్తిచేస్తాం.

# ఆటలపై.. చిగురిస్తున్న ఆశ!

చేగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు ఆటలు ఆడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో పీఈటీ పోస్టులు లేకపోవడంతో చిన్నారులు ఆటలకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, అవసరమైతే కాంట్రాక్టు విధానంలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని విద్యాశాఖకు సూచించారు. ఈ ఆదేశాలను అమలు చేస్తే జిల్లాలో పీఈటీలు లేని జడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలలకు మేలు జరుగుతుంది.

రాణించాలంటే: క్రీడల్లో రాణించాంటే ప్రత్యేక శిక్షణ అవసరం. వ్యాయామ ఉపాధ్యాయుల తర్ఫీదులో సాధన చేస్తే నైపుణ్యాలు పెంచుకునే అవకాశం ఉంటుంతి. జిల్లాలో ఎంతో మంది ప్రతిభగల విద్యార్థులు ఉన్నా, సరైన తోడ్పాటు లేక ముందుకు సాగలేకపోతున్నారు. జాతీయ పండుగల సమయంలో మాత్రమే నామమాత్రంగా ఆటలు ఆడిస్తున్నారు. జిల్లాలో పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులే లేవు. ఇక ప్రాథమికోన్నత పాఠశాలల్లో అదే పరిస్థితి. జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు ఉన్నా, ఆటల్లో ప్రావీణ్యం చూపడంలేదు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండల స్థాయిలో ఆడుతూ.. ఓటమి చెంది నిరాశతో ఇంటిముఖం పడుతున్నారు. అదే వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటే వారు క్రీడల్లో కఠినమైన శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పీడీలు, పీఈటీలు ఉన్న పాఠశాలల నుంచే ఎక్కువ మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల వరకు ఎదుగుతున్నారు. పీఈటీ పోస్టులను మంజూరు చేయాలని కోరుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తాజాగా సీఎం ఆదేశాలు అమలైతే చిన్నారులకు మేలు జరగనుంది.

జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయుల వివరాలు
జడ్పీ ఉన్నత పాఠశాలలు: 146
ప్రాథమికోన్నత: 128
పీడీలు ఉన్న పాఠశాలలు: 61
పీఈటీలు ఉన్నవి : 8
ఖాళీగా ఉన్నవి: 2
పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు (పీటీఐ): 15
పీఈటీ పోస్టులు లేని జడ్పీ పాఠశాలలు: 62
పీఈటీ పోస్టులు లేని యూపీఎస్‌లు: 128

# తడి.. పొడి.. ఆచరణలో తడబడి

జగిత్యాల : పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతో పాటు వ్యర్థాల పునర్వినియోగానికి తడి పొడి చెత్త సేకరణ విధానం అమలు చేస్తున్నారు. కాగా జగిత్యాల పట్టణంలో తడి పొడి చెత్త సేకరణ పూర్తిగా నిర్వీర్యమైంది. సరిపడా సిబ్బంది, వాహనాలున్నా అవగాహన లోపం, బాధ్యతా రాహిత్యంతో అమలులో చతికిలపడింది.

**వనరులున్నా నిరుపయోగం**

48 వార్డుల్లో ఇంటింటా చెత్త సేకరణకు 68 వాహనాలున్నాయి. పారిశుద్ధ్య విభాగంలో 262 మంది సిబ్బంది పని చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే క్రమంలో కార్మికులకు శ్రమ లేకుండా వాహనాల్లోనే ప్రత్యేక అరలు ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువు తయారీ కోసం 2020లో పట్టణ ప్రగతి నిధులతో నూకపల్లి డంపు యార్డులో ప్రత్యేక షెడ్డు నిర్మించారు. మొదట్లో 4 వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని అమలు చేసిన అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు.

**నాడు రాష్ట్రంలోనే ప్రథమం**

పురపాలిక పరిధిలో సేకరించిన తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంది. దీన్ని స్థానికంగా మొక్కల పెంపకంతో పాటు అవసరమైన వారికి అందజేయాల్సి ఉంటుంది. 2012లో అధికారుల కృషితో తడి, పొడిలో జగిత్యాల బల్దియా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. ఆ తరువాత వచ్చిన అధికారుల్లో చిత్తశుద్ధి లేక ప్రక్రియ పడకేసింది. పట్టణంలో నిత్యం 10 మెట్రిక్ టన్నుల తడి చెత్త, 8 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 4 టన్నుల మురుగు వ్యర్థాలు పోగవుతున్నాయి.

**ఇవీ కారణాలు**

తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

వాహనాలు తరచూ మరమ్మతుకు గురవుతుండటంతో సిబ్బంది ఒకే డబ్బాలో వేసుకొని వెళ్తున్నారు.

పొడి చెత్తను పట్టణ సమాఖ్య తీసుకొని నగదు చెల్లిస్తుండటంతో తడి



చెత్తపై నిర్లక్ష్యం కనిపిస్తోంది.

తడి, పొడి చెత్త సేకరణకు ప్రత్యేకంగా కేటాయించిన పర్యావరణ ఇంజినీర్‌కు హరితహారం బాధ్యతలు అప్పగించడంతో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన లేకపోవడంతో నామమాత్రంగా మారింది.

పురపాలిక సమాచారం
వార్డులు: 48, పట్టణ జనాభా: 1.20 లక్షలు
నిత్యం సేకరించే చెత్త: 70 మెట్రిక్ టన్నులు
వినియోగించే వాహనాలు: 68
మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది: 262

ప్రజలకు అవగాహన కల్పిస్తాంపట్టణంలో ఉత్పత్తి అవుతున్న చెత్త నుంచి 65 శాతాన్ని సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు ప్రాధాన్యమిస్తున్నాం. వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కొన్ని వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం. శ్రీకాంత్, పర్యావరణ అధికారి

# ఉత్పత్తిలో వెనుకంజ



గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆగస్టు నెలలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు. లక్ష్యానికి 8.2 లక్షల టన్నుల వెనుకంజలో ఉంది. గత నెలలో కురిసిన వర్షాలకు ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడింది. దీంతో 4.82 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 4.00 మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. దీని ప్రభావం అయిదు నెలల బొగ్గు ఉత్పత్తిపై కూడా పడింది. గడిచిన అయిదు నెలల్లో సంస్థ 25.64 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 24.19 మిలియన్ టన్నులు మాత్రమే సాధించింది. దీంతో 1.45 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకంజలో ఉంది. సింగరేణి వ్యాప్తంగా 94 శాతం బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది.**మూడు డివిజన్లలో వంద శాతం**

సింగరేణి వ్యాప్తంగా మూడు డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. ఆగస్టు నెలలో కొత్తగూడెం, ఆర్జీ-1, 2, డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. అయిదు నెలల ఉత్పత్తిలో కూడా కొత్తగూడెం, ఆర్జీ-2, మణుగూరు డివిజన్‌లు మాత్రమే వంద శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించాయి. మిగతా అన్ని డివిజన్‌లు తక్కువ స్థాయిలోనే బొగ్గు ఉత్పత్తి చేపట్టాయి. కేవలం ఒక్క ఆగస్టు నెలలోనే 8.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడింది. ఈనెలలో వర్షాలు ఎక్కువగా కురవడంతో ఉపరితల గనుల్లో పనులు నిలిచిపోయి ఉత్పత్తిపై ప్రభావం పడింది.

**ఏడు నెలల్లో 56.81 మిలియన్లు**

రానున్న ఏడు నెలల్లో 56.81 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంది. ఈ ఏడాది 76 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయిదు నెలల్లో 24.19 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి రానున్న ఏడు నెలల్లో 56.81 మిలియన్ టన్నులను వెలికి తీస్తేనే వార్షిక లక్ష్యాన్ని చేరుకునే అకాశం ఉంది. వార్షిక ఉత్పత్తి లక్ష్యం సాధించాలంటే నెలకు 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నెలకు 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంటున్న సింగరేణి రానున్న కాలంలో నెలనెలా పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

# జనం మారాలి.. జ్వరాలు తగ్గాలి



సిరిసిల్ల : వర్షాల నేపథ్యంలో జిల్లాలో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. ఆవాసాల్లో అపరిశుభ్రత పెరిగి, తొట్టిలు, పాడైపోయిన వస్తువుల్లో నీరు చేరింది. అందులో పుట్టి పెరిగిన లార్వాలు దోమలుగా మార్పుచెంది జనాలపై దండెత్తుతున్నాయి. దీనికి నిధుల కొరత వెరిసి పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఫలితంగా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా యంత్రాంగం డ్రై డేపై అవగాహన కల్పించినప్పటికీ జనాల్లో పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందక రోగాల బారిన పడుతున్నారు.

**మార్పు రావాలి....**జిల్లాలోని 260 గ్రామ పంచాయతీల పరిధిలో 5.5 లక్షల జనాభా ఉంది. 470 మంది ఆశా కార్యకర్తలతో వానాకాలంలో జ్వర సర్వే చేపడుతున్నారు. 1.7 లక్షల ఇళ్లను సందర్శించి జ్వర పీడితుల వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. జ్వర లక్షణాలను పరిగణలోకి తీసుకుని వారికి రక్తపరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. అదే సమయంలో వానలతో పరిసరాల పరిశుభ్రత, డ్రై డే ప్రాముఖ్యాన్ని వివరిస్తున్నారు. దోమలతో కలిగే దుష్ఫలితాలను చెబుతున్నప్పటికీ జనాల్లో మార్పు రావడం లేదు. దోమలను నిర్మూలించాలంటే తొట్టీల్లో నీటిని ఒక రోజు ఖాళీ చేయడం తప్పనిసరి. ఇలా చేయడంతో లార్వా నశించి దోమల వ్యాప్తి తగ్గుతుంది. కానీ క్షేత్ర స్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. రోజుల తరబడి నీటి నిల్వలను ఖాళీ చేయకపోవడంతో మశకాలు పెరుగుతున్నాయి. వాటి కాటుకు గురైన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ కేసులు ఎక్కువవుతున్నాయి.

**ఇవి ముఖ్యం**

జ్వరాలు తగ్గాలంటే జనాల్లో మార్పు రావాలి. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు నీటి నిల్వ ప్రాంతాల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయాలి. దోమ తెరలు, మస్కిటో రిపెలెంట్స్ వాడాలి. ఆరుబయట వేసిన వాహనాల టైర్లు, కొబ్బరి బోండాలు, కూలర్‌లు, ప్లాస్టిక్ గ్లాసులు, మద్యం సీసాల్లో వాన నీరు చేరుతుంది. ఇది డెంగీ దోమ పెరిగేందుకు అనుకూలంగా ఉంటాయి. అలాంటి వస్తువులను గుర్తించి చెత్త సేకరణ వాహనానికి అప్పగించాలి. చిన్న, పెద్ద తేడా లేకుండా జ్వరం వస్తే స్వీయ చికిత్సను మానుకోవాలి. పసి పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలను ఆయా ఉప కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బందికి తెలపాలి. **32 డెంగీ కేసులు!**

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 32 డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. 14 హైరిస్క్ ఏరియాలుగా అధికారులు ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో మహమ్మారి దోమ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నారు. మూడు ర్యాపిడ్ యాక్షన్ బృందాలను అందుబాటులో ఉంచారు. ఇటీవల వీర్నపల్లి మండలం కంచర్ల, రాశిగుట్టతండాలో పది కేసుల వరకు బయటపడ్డాయి. దీనికి ప్రధాన కారణం పారిశుద్ధ్య లోపమే. పరిసరాల్లో నీటి నిల్వల్లో పెరిగిన కీటకం చాలా మందిని కాటేయడంతో డెంగీ బారిన పడ్డారు.

# ముందు ఒక ముఠా.. వెనకాలే అసలు ఆట!

సత్తుపల్లి : సత్తుపల్లి నియోజకవర్గంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇసుకను సత్తుపల్లికి తరలిస్తున్నారు. వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల పోలీసుల దాడుల్లో లారీలు పట్టుబడుతున్నా ఏమాత్రం లెక్కచేయకుండా నిరంతరం ఇసుక దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తరలిస్తున్న ఇసుకనూ ఇతర గుత్తేదార్లు, బిల్డర్లకు రవాణా చేస్తూ భారీగా సొమ్ము దండుకుంటున్నారు.

**అధిక లోడుతో ఇసుక తరలిస్తూ..**

30 టన్నుల సామర్థ్యం ఉన్న టిప్పర్లలో, లారీల్లో 50 టన్నుల వరకూ ఇసుక తరలిస్తున్న వాహనాలను ఇటీవల సత్తుపల్లి, వేంసూరులలో ఎంవీఐ దాడులుచేసి కేసులు నమోదు చేశారు. సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో 8 లారీలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అధిక లోడుతో రోడ్లు సైతం శిథిలమవుతున్నాయి.

**అక్కడ 150.. ఇక్కడ 1300**

ఏపీలో ఇసుక టన్ను రూ.150కి కొనుగోలు చేస్తూ సత్తుపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.1100 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారంలో లారీల యజమానులకు వినియోగదారులకు మధ్య దళారీలు పుట్టుకురావడంతో దందా మరింత పెరిగిపోయింది. దళారులు ఇసుక లారీలకు ఒక్కో ట్రిప్పునకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు కమీషన్లు దండుకొంటున్నారు.



**వేంసూరు మీదుగా పలు దారుల్లో..**

ఏపీలోని విజయవాడ నుంచి ఇసుకను పలు మార్గాల ద్వారా వేంసూరు మీదుగా తరలిస్తున్నారు. అడపాదడపా వేంసూరు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. రవాణా ఆగడంలేదు. ఎక్కువగా రాత్రుళ్ల తరలుతున్న లారీలకు ఎస్కార్ట్‌గా కొందరు వ్యక్తులు ముందుగా ప్రయాణిస్తూ పోలీసులు లేరని నిర్ధారించాక రవాణా సాగుతోంది. కేసులు నమోదు చేస్తే పలుకుబడితో కొందరు తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కేవలం లారీలపైనే కాకుండా దళారీ వ్యవస్థనూ నిరోధించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

సత్తుపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచామని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, టిప్పర్లపై పలుమార్లు కేసులు నమోదు చేశామని ఏసీపీ ఎ.రఘు తెలిపారు. ప్రస్తుతం పలు మార్గాల్లో గస్తీని పెంచి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు.

# రెండు దశాబ్దాల ఎదురుచూపులు

ఖమ్మం: పూర్తి మెట్ట ప్రాంతమైన కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో చెరువులు నింపి సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిచేందుకు ఉద్దేశించిన బుగ్గవాగు ప్రాజెక్టు 20 ఏళ్లుగా కాగితాల్లోనే మగ్గుతోంది. ఉన్నత స్థాయిలో హైడ్రాలిక్ క్లియరెన్స్‌లు వచ్చినా ప్రాజెక్టు నిర్మాణం కొలిక్కిరావటం లేదు.

బుగ్గవాగు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రావిటీ ద్వారా నీరు మళ్లించేందుకు కాలువలు తవ్వాలని, ఇందుకు భూసేకరణ చేయాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదించారు. రూ.40 కోట్ల అంచనాతో టెండర్లు నిర్వహించారు. 25 కి.మీ. పొడవున కాలువలు తవ్వేందుకు సుమారు 100 ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా రైతులు అంగీకరించలేదు. భూములివ్వమని ఏజెన్సీలో గిరిజనులు ససేమిరా మొండికేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూసేకరణకు ప్రత్యామ్నాయంగా పైపులైన్లు నిర్మించి నీటిని తరలించే అవకాశాలు పరిశీలించాలని ఇటీవల ఆదేశించారు. భూమిలో పైపులైన్ నిర్మించి నీటిని మళ్లించేందుకు తాజాగా రూ.97 కోట్ల అంచనాతో ప్రతిపాదన రూపొందించి పంపించారు. **గత ప్రతిపాదనలు రద్దు..** గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న ఖమ్మంకు చెందిన గుత్తేదారు ఇటీవల ఒప్పందం రద్దు చేయాలని అధికారులకు లేఖ అందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక పంపారు. ఇదే సమయంలో ప్రాజెక్టు నూతన ప్రతిపాదనలూ ప్రభుత్వానికి అందించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన రూ.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి.



**ప్రాజెక్టు స్వరూపం**

సింగరేణి మండలం గేట్ కారేపల్లి సమీపంలో బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి. అక్కడి నుంచి నీటిని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 31 చెరువులకు మళ్లించటం ద్వారా సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది. కామేపల్లి మండలంలో పింజరమడుగు, నెమలిపురి, గోవింద్రాల, కొమ్మినేపల్లి, రఘునాథపాలెం మండలం కోటపాడు, పాపటపల్లి, కోయచెలక, శివాయిగూడెం, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీటిని మళ్లిస్తారు. ఇందుకు 38 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించనున్నారు.

**ప్రధానంగా కామేపల్లికి..**

సాగునీటి వసతి లేని రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల రూపంలో 30పైచిలుకు చెరువులకు సాగర్ నీరు అందించే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఈ ఎత్తిపోతలలో లబ్ధి పొందే కొన్ని చెరువులు పూర్వ బుగ్గపాడు ప్రాజెక్టు పరిధిలో ఉన్నా రెండు పథకాల రూపంలో కరవు నేలకు రెండు పంటలా నీరందే అవకాశం ఉంది. అంతకంటే ముఖ్యంగా ఎలాంటి నీటి వనరులేని కామేపల్లి రైతులకు బుగ్గపాడు ప్రాజెక్టు ఎంతో అవసరం.

# రభశా.. గుంతల వరుస!

కనిగిరి : 36 కిలోమీటర్లు.. 300 గుంతలు.. అడుగుకో గుంత అన్నట్టుగా తయారైంది జిల్లాలో కీలకమైన కనిగిరి– సీఎస్‌పురం రహదారులు, భవనాలశాఖ రహదారి. ఓ వైపు గుంతల మార్గాలను కూటమి ప్రభుత్వం బాగు చేస్తుంటే మరోవైపు భారీ వాహనాలు, క్వారీ, క్రషర్ లారీలు ఛిద్రం చేస్తుండడంతో ఆనవాళ్లు లేకుండాపోయింది. గత తెదేపా ప్రభుత్వంలో కనిగిరి నుంచి సీఎస్‌పురం, భైరవకోన, నారాయణస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులతోపాటు కడప, బెంగుళూరు ప్రయాణించే వారి కోసం రూ.50 కోట్లతో 36 కిలోమీటర్ల మేర రహదారులు, భవనాలశాఖ తారు రహదారిని నిర్మించింది దీంతో ప్రయాణం ఎంతో సుఖవంతమైందనుకున్న సమయంలో భారీ వాహనాల రాకపోకలతో రహదారి మొత్తం ఛిద్రమైపోయింది. వాస్తవానికి 15 నుంచి 20 టన్నుల బరువుతో వెళ్లాల్సిన వాహనాలు 50 నుంచి 60 టన్నులతో రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి గుంతలమయంగా తయారైంది. కనిగిరి, వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల మధ్య 36 కిలోమీటర్ల రహదారిలో అడుగుకో గుంత పడింది. ఎటుచూసినా పెచ్చులూడిపోయింది. ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్ర



వాహనాలు, ఆటో చోదకులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. గోతులమయంగా మారిన రహదారిలో తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. ప్రతిరోజు వందల సంఖ్యలో గుత్తేదారులకు చెందిన భారీ వాహనాలు తిరుగుతున్నాయని, దీంతో రహదారంతా గుంతలమయంగా మారిందని, అధికారులు స్పందించి గుత్తేదారులతోనే కొత్త రహదారి నిర్మాణ పనులు చేయించాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై రహదారులు, భవనాలశాఖ ఈఈ సమర్పణరావు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇతర నిర్మాణ పనులకు భారీ వాహనాలు తిప్పుతుండడంతో చాలాచోట్ల రహదారి దెబ్బతిందని, మరమ్మతులకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు.

# 'దివ్య'మైన సేవలు!

ఒంగోలు : ఒంగోలు రైలునిలయంలో పట్టాలు దాటుతున్న ఓ కుక్క ప్రమాదానికి గురై ఒక కాలు, తోక కోల్పోయి దీనస్థితిలో పడి ఉంది.. వెంటనే అక్కడకు వెళ్లి దానిని తీసుకొచ్చి శస్త్రచికిత్స చేయించడంతో చక్కగా తిరుగుతోంది. సింగరాయకొండ వద్ద కారు కింద పడిన ఓ కుక్క లేవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా దానికి చికిత్స అందించి సపర్యలు చేయడంతో లేచి పరిగెడుతోంది. ఇలా వందల సంఖ్యలో కుక్కలకు స్వస్థత చేకూర్చుతున్నారు ఒంగోలు నగరానికి చెందిన టి.దివ్య. ఇందుకోసం తన సంపాదన మొత్తం వెచ్చిస్తున్నారామె. చిన్నప్పుడు ఇంట్లో కుక్కను పెంచడంలో ఎదురైన సమస్యలను దగ్గరుండి చూశారు దివ్య. వీధిలో ఏదైనా కుక్క గాయపడితే వెంటనే దానికి సపర్యలు చేస్తే, అది కోలుకుని మాములుగా తిరగడం సంతృప్తినివ్వడంతో అప్పటి నుంచి కుక్కలకు సేవలందిస్తున్నారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వాటికి శస్త్రచికిత్సలు చేయించి జాగ్రత్తగా చూసుకోవాల్సి రావడంతో ఆమె ఇంట్లోనే సంరక్షిస్తూ వస్తున్నారు. ఈమెకు తల్లిదండ్రులు కూడా సహకరించడంతో వీరింట్లో అనారోగ్యం పాలైన కుక్కలు 10 నుంచి 15 వరకు ఉంటున్నాయి. దస్తావేజు లేఖరిగా పనిచేస్తున్న దివ్య తన సంపాదనంతా కుక్కల సంరక్షణకే వినియోగిస్తున్నారు. ఈమె సేవలను గుర్తించిన ప్రజాప్రతినిధులు ఒంగోలు నగర పాలక సంస్థ స్థలంలో కుక్కల సంరక్షణకు అవకాశం కల్పించారు.

**మూగజీవాల సంరక్షణ..**వీధుల్లో నడవలేని స్థితిలో ఉన్న కుక్కలు, గాయాలపాలై కదల్లేని స్థితిలో ఉన్నవాటికి ఇంటికి తీసుకెళ్లి ఆహారం అందిస్తున్నారు. రోడ్లపై తిరిగే కుక్కలకు దాహం తీర్చాలనే ఉద్దేశంతో ఒంగోలు నగర వీధుల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. కుక్కలతో పాటు రోడ్లపై తిరిగే ఆవులు గాయపడిన సందర్భాల్లో వాటికి వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నారు.


**అంధులైన వృద్ధులకు ఆశ్రయమే లక్ష్యం**

ఇంటర్మీడియట్ చదువుతున్నప్పటి నుంచి కుక్కలకు సేవలందించడం అలవాటుగా మారింది. అనారోగ్యం పాలైన సుమారు 500 వరకు కుక్కలకు ఇప్పటి వరకు చికిత్స అందించడంతో కోలుకున్నాయి. గాయపడినవి వైద్యసేవల అనంతరం చక్కగా తిరుగుతుండటం నాకెంతో ఆనందాన్నిస్తుంది. గుడ్డివారైన వృద్ధులను ఎవరూ పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితిలో గడుపుతున్నారు. వారి సంరక్షణకు ఆశ్రమం ఏర్పాటు చేయాలన్నదే నా లక్ష్యం.టి.దివ్య

# గ్రామీణ విద్యార్థులకు వరం... ఎన్ఎంఎంఎస్

ఒంగోలు : ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు మేలు చేకూర్చేవిధంగా కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) ప్రదానం చేస్తోంది. దీని కోసం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు. దానిలో అర్హత సాధించిన వారికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు వారి ఖాతాలకు జమ చేస్తారు. దేశవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు ఉపకార వేతనం ఇస్తుండగా, జిల్లాలో 200 మందికి పైగా లబ్ధి పొందుతున్నారు. 9,10,11,12 తరగతుల వరకు ఏడాదికి రూ.12 వేలు అందజేస్తారు. ఆ నాలుగు తరగతులు ఖచ్చితంగా ప్రభుత్వ విద్యాలయాల్లో చదివితేనే ఉపకార వేతనం అందజేస్తారు.అర్హతలు: ఈ ఏడాది పరీక్ష రాసేవారు 2025–26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, జిల్లాపరిషత్తు, మండల పరిషత్తు, ఎయిడెడ్, ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతుండాలి. కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్ వంటి వసతిగృహాల్లో ఉండేవారు అనర్హులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు ఏడో తరగతిలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు పొంది ఉండాలి. పరీక్షలో మెంటల్ ఎబిలిటీలో 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. మిగిలిన మార్కులు ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు కేటాయిస్తారు. అర్హత సాధించిన విద్యార్థులను ప్రభుత్వ రిజర్వేషన్ నిష్పత్తి ప్రకారం ఎంపిక చేస్తారు. పరీక్ష ఫీజు ఓసీ, బీసీ, పీహెచ్ కేటగిరీల వారు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చెల్లించాలి. పరీక్ష డిసెంబరు 7వతేదీన జరగనుంది. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేయాలి. ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసేవిధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ కోరారు. విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర సమాచారం తప్పులు లేకుండా దరఖాస్తులో నమోదు చేయాలన్నారు.

# భూమి కొలతలు.. తీరని కలతలు..!



చిత్తూరు : రహదారి సమస్య పరిష్కరించాలని.. సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేయాలని.. భూ విస్తీర్ణంలో తేడాలున్నాయంటూ సర్వే శాఖకు దరఖాస్తులు నిత్యం వస్తూనే ఉన్నాయి. అయితే సర్వేయర్లు క్షేత్రస్థాయికి వెళ్లకనే.. గడువు ముగిసే రోజున దరఖాస్తులను క్లోజ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కీలకమైన సర్వే ప్రక్రియకు ముడుపులు ఇస్తే గానీ రైతులకు పని జరగడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్న పరిస్థితులు జిల్లాలో కనిపిస్తున్నాయి.

**అవసరాలే ఆసరాగా..**

భూమి.. రైతుకు ఆరోప్రాణం. భూమిని పక్క పొలం వ్యక్తో, బలమున్న వారో ఆక్రమించి వివాదం సృష్టిస్తే సర్వేయర్లను ఆశ్రయించడం సాధారణం. ఆస్తి పంపకాల సమయంలోనూ సబ్ డివిజన్ చేసి వారసులకు ఇవ్వాలన్నా సర్వే చేయించి హద్దులు నిర్ణయించాల్సిందే. ఇలాంటి అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు సర్వేయర్లు చెలరేగిపోతున్నారు. తామిచ్చిన సర్వే నివేదిక ఆధారంగానే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదవుతాయంటూ బాహాటంగానే వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. ఫిర్యాదు చేస్తే పని చేయరేమో అనే భయంతో చాలా మంది రైతులు వెనకంజ వేస్తున్నారు. సర్వే కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తున్నామని.. సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని జిల్లా సర్వే శాఖ ఏడీ జయరాజ్ పేర్కొన్నారు.

# ఉప్పుటేరు.. ఊపిరి తీస్తోంది!



అచ్యుతాపురం: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో ప్రమాదకరమైన పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ గాడి తప్పుతోంది. రసాయనాలను శుద్ధి చేసి సముద్రంలోకి పైపులైను ద్వారా విడుదల చేయాల్సిన కొన్ని కంపెనీలు మురుగు కాలువల్లో వదిలేస్తున్నాయి. కొందరు ట్యాంకర్ల ద్వారా పూడిమడక సమీపంలోని ఉప్పుటేరులో కలిపేస్తున్నారు. ఫలితం ఉప్పుటేరు కాలుష్య కాసారంగా మారి జలచరాల ఊపిరి తీస్తోంది. కొన్నాళ్లుగా చేపలు, తాబేళ్లు, కప్పలు, పీతలు చనిపోయి పైకి తేలుతున్నాయి. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో 5600 ఎకరాల్లో విస్తరించగా.. సెజ్, నాన్ సెజ్ పరిధిలో 210 వరకు పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఫార్మా, రసాయన పరిశ్రమలే అధికం. రసాయన వ్యర్థాలను శుద్ధి చేసి సముద్రంలో కలిపేందుకు పూడి వద్ద సీఈటీపీ ప్లాంట్‌ను నిర్మించారు. కొన్ని కంపెనీలు వ్యర్థాలను పరవాడలోని రాంకీకి పంపుతుండగా, మరికొన్ని మురుగు కాలువలు, ఉప్పుటేరులో విడుదల చేస్తున్నాయి. జలచరాలు చనిపోతుండటంతో మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతోంది. మత్స్యకారుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ రసాయన వ్యర్థాలను పరిశీలించి కంపెనీలను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను కలిపే పరిశ్రమలను గుర్తించాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు. వందలాది రసాయన పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యంతో కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ) స్థానికంగా లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. వ్యర్థాలు కలిసిన నీటితోనే రైతులు ఉప్పు పండిస్తున్నారు. దీని వల్ల ప్రజా ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. స్థానికులు ఫిర్యాదు చేస్తే నీటి నమూనాలు సేకరించే పీసీబీ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించడం లేదని పూడిమడకకు చెందిన మత్స్యకార సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మెప్మాలో మేతగాళ్లు



నంద్యాల : మెప్మాలో సీఆర్పీల నుంచి రూ.కోట్లు వసూలు చేసేలా కొందరు ఉద్యోగులు ప్రణాళికలు రచించారు. భారీఎత్తున డబ్బులు డిమాండు చేశారు. దీనికి సీఆర్పీలు ఎదురు తిరగడం.. అధికారులకు ఫిర్యాదు చేయడం.. వారు విచారణకు ఆదేశించడంతో విషయం బహిర్గతమైంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు సహకారం అందించేందుకు ఆయా సంఘాల నుంచే కొందరిని సీఆర్పీలుగా ఎన్నుకుంటారు. వీరికి రూ.8 వేల గౌరవ వేతనం, సర్వీసు రుసుము కింద సంఘాల నుంచి రూ.2 వేలు కలిపి నెలకు రూ.10 వేలు అందుతుంది. బ్యాంకు రుణాలు ఇప్పించినందుకు కొందరు రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఇస్తుంటారు. సీఆర్పీలపై ఆరోపణలు వచ్చినప్పుడు సభ్యులు తీర్మానం చేసి వారిని తొలగించి కొత్తవారిని ఎన్నుకుంటారు. నంద్యాల మెప్మా కార్యాలయంలో ఓ అధికారిణి, మరికొందరు సీవోలు కలిసి కొద్దిరోజుల నుంచి సీఆర్పీలను బెదిరించారు. ఒక్కొక్కరు రూ.2 లక్షలు ఇవ్వకపోతే తొలగిస్తామని భయపెట్టారు. ఈ క్రమంలో కొందరు ఎదురుతిరిగారు.

**కీలక నేత పేరు చెప్పి..**

నంద్యాలలోని ఓ కీలక నేత పేరు చెప్పి కొందరు వార్డు స్థాయి నాయకులు అక్రమాలకు ప్రణాళికలు రచించినట్లు సమాచారం. ఒక్కో వార్డు పరిధిలో మూడు నుంచి ఐదుగురు సీఆర్పీల చొప్పున నంద్యాల పట్టణంలో 136 మంది ఉన్నారు. వారి నుంచి రూ.2.72 కోట్లు వసూలు చేసేలా పథకం వేశారు. అందులో రూ.1.36 కోట్లు అధికారులకు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని పంచుకోవాలని నాయకులు భావించారు. వసూళ్ల విషయమై ఫిర్యాదు రావడం.. విచారణకు రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశించడంతో పథకం బెడిసికొట్టింది.

**డబ్బులు అడిగారు..**

మెప్మా కార్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారించేందుకు కర్నూలు నుంచి ముగ్గురిని నంద్యాలకు పంపారు. విచారణకు పిలవగా 80 మంది సీఆర్పీలు హాజరయ్యారు. తమను డబ్బులు అడిగిన విషయం వాస్తవమేనని పలువురు స్పష్టం చేయడంతో అక్రమాల గుట్టు రట్టయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ మహిళ కూడా విచారణ కమిటీలో ఉండడం గమనార్హం.

**ఇన్‌ఛార్జి పాలనతో ఇష్టారాజ్యం**

వైకాపా హయాంలో జిల్లాల విభజన జరిగినా మెప్మాను మాత్రం విభజించలేదు. ఈ నేపథ్యంలో నంద్యాల మెప్మాలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం జూన్‌లో మెప్మాను విభజించినప్పటికీ ఇన్‌ఛార్జి బాధ్యతలను మళ్లీ కర్నూలు పీడీకే అప్పగించారు. కర్నూలు పీడీ బదిలీపై వెళ్లిన తర్వాత వైఎస్ఆర్ కడప జిల్లా మెప్మా పీడీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన కడపలో ఉండడంతో విషయాలు వారి దృష్టికి వెళ్లలేదని సమాచారం.


# 'టెలీమానస్'... సరికొత్తగా!!

పెదవాల్తేరు: ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తున్న 'టెలీమానస్' కేంద్రం సేవలను విస్తరించడానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మానసిక ఆసుపత్రి ఆవరణలో పనిచేస్తున్న ఈ విభాగంలో ఇటీవల వీడియో కాల్ సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. ఎవరైనా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్నవారు ఈ కేంద్రానికి రాకుండా వీడియో ద్వారా సంప్రదించడానికి అవకాశం కల్పించామని డాక్టర్ నిత్య ఐశ్వర్య తెలిపారు. దూరప్రాంతాల నుంచి రావడానికి అవకాశం లేని వారు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు.కొత్త క్యాబిన్ ఏర్పాటు: మానసిక ఆసుపత్రిలో టెలీమానస్ కేంద్రానికి కొత్త క్యాబిన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ 20 మంది వరకు కౌన్సిలర్లను నియమిస్తున్నట్లు డాక్టర్ నిత్య ఐశ్వర్య తెలిపారు. బాధితులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కౌన్సెలింగ్ పొంది దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడంతోపాటు అవసరమైన మందులు తీసుకోవచ్చన్నారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు మానసిక సమస్యలకు అవసరమైన మందులను ఇండెంట్ పెట్టి తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆత్మహత్య ఆలోచనలు ఉన్న వారు టెలీమానస్ కాల్ సెంటర్(14416) సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

# ఉన్నత చదువులకు ఊతం

పామూరు : యువత ఉన్నత విద్యను అభ్యసించడానికి కేంద్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని పీఎం విద్యాలక్ష్మి పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎలాంటి పూచీకత్తు, హామీదారులు లేకుండా నేరుగా బ్యాంకుల ద్వారా రుణ సాయం కల్పించడమే దీని ఉద్దేశం. 2024–25 నుంచి 2030–31 వరకూ పథకం అమలుకు కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. విదేశాల్లో ఉన్నత చదువులు చదివేవారు సైతం అర్హులుగా ప్రకటించింది.

నమోదు ఇలా.. : విద్యాలక్ష్మి వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, చరవాణి నంబరు, ఈమెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలు నమోదు




చేయాలి. పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, చివరిసారి చదివిన కోర్సుకు సంబంధించిన పత్రాలు, ప్రస్తుతం చదవాలనుకుంటున్న కోర్సులకు చెందిన ప్రవేశపత్రం, ఆదాయ ధ్రువపత్రాలు జత చేయాలి.

మూడు విడతల్లో రుణం... : రుణం మంజూరు కాకపోతే కారణాలు చెబుతూ 15 రోజుల్లో ఈ మెయిల్‌కు సందేశం వస్తుంది. అర్హులుగా ప్రకటిస్తే మూడు విడతల్లో రుణం మంజూరు చేస్తారు. మొదటి విడతలో రూ.4 లక్షలు, రెండో విడత రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు, మూడో విడతగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు అందిస్తారు. దరఖాస్తుదారు వార్షిక ఆదాయం, తీసుకున్న రుణం ఆధారంగా 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తారు.

అర్హులు ఎవరంటే... : ఇంజనీరింగ్, వైద్యవృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు.కుటుంబ వార్షికాదాయం రూ.4 లక్షల్లోపు ఉండాలి.ఒకసారి మాత్రమే దరఖాస్తుకు వెసులుబాటు. ఉన్నత విద్యను అభ్యసించే పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు, విద్యాశాధికారులు సూచిస్తున్నారు.

# ప్రయోగ భాగ్యం.. అన్నదాతకు దూరం

కనిగిరి : సేద్యంలో సాంకేతిక, నాణ్యతాపరమైన సమస్యలు అధిగమించడానికి గత వైకాపా ప్రభుత్వంలో 'అగ్రి టెస్టింగ్ ల్యాబ్'లు ఏర్పాటు చేశారు. వీటికి తగిన మానవ వనరులు, సిబ్బందిని నియమించకపోవడంతో పథకం లక్ష్యం నెరవేరడంలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

**రెండేళ్ల వ్యవధిలోనే భవనాలు పూర్తి**

జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యయంతో 2020లో శంకుస్థాపనలు చేసి రెండేళ్ల వ్యవధిలో భవన నిర్మాణాలు పూర్తిచేశారు. ఒక్కో ల్యాబ్ భవనం, ప్రయోగ పరికరాలకు కలిపి రూ.కోటికి పైగా వెచ్చించారు.ఖరీఫ్, రబీ కాలాలకు ముందుగా అన్ని అంశాలను పరీక్షించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలనేది ఉద్దేశం. సాంకేతిక నిపుణులు, ఇతర అధికారులు, సిబ్బందిని నియమించడంలో అలసత్వంతో ల్యాబ్‌లు అలంకారప్రాయంగా మారాయి.

**రెండుచోట్ల మాత్రమే కొనసాగింపు**

విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించే వ్యాపారుల నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించి నివేదికలను పంపడం తప్ప రైతులకు నేరుగా అవగాహన పెంచే కార్యక్రమాలు జరగడంలేదు. ఒక్క గిద్దలూరు, దర్శిలో మాత్రమే పైలట్ ప్రాజెక్ట్ కింద నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. మార్కాపురం అగ్రి ల్యాబ్ పునాదుల్లోనే ఉంది. మిగతా ల్యాబ్‌లు నామమాత్రంగానే ఉన్నాయి. సరిగ్గా పరీక్షలు జరగడం లేదు.కనిగిరి ఏడీఏ షేక్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ నీళ్లు లేవనే కారణంతో కనిగిరిలో పరీక్షలు జరగడం లేదని తెలిపారు. దర్శి ఏడీఏ బాలాజీనాయక్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విత్తన, రసాయనాల నమూనాలను పరీక్షించి నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు.

# ఆరు నెలలు.. 19 శాతం పనులు!

బాపట్ల : నిజాంపట్నం హార్బర్ విస్తరణ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. కొంతకాలం నుంచి స్తబ్ధత నెలకొన్న ఈ పనులను తిరిగి పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది మార్చి చివరికల్లా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.నిజాంపట్నం పాతజెట్టీలో 40 ఏళ్ల కిందట 80 వేట పడవలు మాత్రమే నిలిచే సామర్థ్యం ఉంది. తుంగభద్ర కాలువ నుంచి సముద్రంలోకి వేట పడవలు ప్రవేశించే మొగ పరిసరాలు పూడికతో నిండిపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ హార్బర్ నుంచి ఏటా రూ.120 కోట్ల విలువైన చేపల ఎగుమతి జరుగుతున్నా సమస్యకు చాలాకాలం పరిష్కారం లభించలేదు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా 2022లో రూ.451 కోట్ల అంచనాతో అభివృద్ధి పనులు చేపట్టారు. హార్బర్ విస్తరణ, సముద్రంలోకి 1.50 కిలోమీటర్ల మేర రిటైనింగ్ గోడల నిర్మాణం, 250 వేట పడవలు నిలపడానికి వీలుగా కొత్త జెట్టీ ఏర్పాటు.. ఇలా అనేక పనులు సంకల్పించారు.ఇదీ పరిస్థితి.. వేట పడవల తయారీ, మరమ్మతులకు డాక్‌యార్డు, విశ్రాంతి భవనం తదితరాలు ఏర్పాటు చేసేందుకు 90 ఎకరాల అటవీ భూమి కావాలని ప్రతిపాదనలు కేంద్రానికి పంపారు. ప్రస్తుతం రెండెకరాల్లో కొత్త జెట్టీ అసంపూర్తిగా నిర్మితమైంది. ఇక్కడా 70 మీటర్ల స్థలం కావాల్సి ఉంది. అనేక భూసమస్యలున్నాయి. ప్రస్తుతం 81 శాతం పనులు పూర్తికాగా.. మరో 19 శాతం చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన భూసమస్యలు పరిష్కరించాల్సి ఉంది. కొన్ని అంశాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు అనివార్యం కానున్నాయి.

# విద్యార్థి.. సేవా దీప్తి

గుంతకల్లు: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ సేవా విభాగంలో పాల్గొని ఉత్సాహంగా సత్కార్యాలు చేస్తున్నారు. వారు రాష్ట్ర, జాతీయస్థాయి శిబిరాల్లో పాల్గొంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో 50 మంది మహిళలు, పురుషులు వాలంటీర్లుగా ఉన్నారు. పాటలు, నృత్యం వివిధ పోటీల్లో ప్రతిభ చాటుతూ పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారు చదువుకుంటున్న కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కల్ని తొలగించి కళాశాలకు రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు.

**జాతీయ శిబిరాల్లో..**

ప్రస్తుత విద్యాసంవత్సరంలో కర్ణాటకలోని బెలగావి, మహారాష్ట్రలోని కొల్హాపూర్, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ శిబిరాల్లో వాలంటీర్లు విశ్వనాథ్, స్మైలీ, భార్గవి, సంజీవరాయుడు, బాలనారాయణ, పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. మొక్కలు నాటడం, కాలనీలు శుభ్రం చేయడం, ముళ్ల పొదల్ని తొలగించడం తదితర తదితర పనులతో సమాజాభివృద్ధికి దోహదపడుతున్నారు.



**నాయకత్వ లక్షణాలు తెలిశాయి**– స్మైలీ, వాలంటీర్

డిగ్రీ చదువుతూ ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటూ వాలంటీర్‌గా మారాను. ఇందులో చేరిన తరవాత నాయకత్వ లక్షణాలు, సేవా భావం ఇతరులకు సాయపడే గుణాన్ని అలవర్చుకున్నాను. ఎన్ఎస్ఎస్ క్రమశిక్షణ నేర్పుతోంది.

**పలు అంశాలు నేర్చుకున్నా.. – బాలనారాయణ, వాలంటీర్**

ఎన్ఎస్ఎస్‌లో పనిచేస్తూ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన జాతీయ శిబిరంలో పాల్గొన్నా. ఇతర రాష్ట్రాల వారు రావడంతో జాతీయ సమైక్యత అంటే ఏమిటో తెలుసుకున్నా. ఇతరులతో ఎలా మెలగాలో, నాయకుడంటే ఎలా ఉండాలో అవగాహన కల్గింది.

**క్రమశిక్షణ నేర్పుతున్నాం... – డాక్టర్ లక్ష్మయ్య, ప్రధానాచార్యుడు**

విద్యార్థులను చదువుకే పరిమితం చేయకుండా ఇతర అంశాల్లోనూ ప్రతిభను చాటుకునేలా శిక్షణ ఇస్తున్నాం. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలను ఏర్పాటు చేసి విజ్ఞానం, సేవా భావం, క్రమశిక్షణ నేర్పుతున్నాం. పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తున్నారు.

# ఆక్రమణల 'కట్ట'దిట్టం

నంద్యాల : ఎస్బీఐ కాలనీ–ఎన్జీవో కాలనీ మధ్య నిర్మించిన వంతెన ప్రాంతం నిండా మునిగింది. వంతెనకు 20 అడుగుల దూరంలో కాల్వ శిఖం భూమిని ఆక్రమించి బహుళ అంతస్తుల భవనం నిర్మాణం చేపడుతున్నారు. వాగులో ప్రవాహన్ని అడ్డుకునేందుకు మట్టి కట్ట వేశారు. దీంతో నీళ్లు వెనక్కి తగ్గి వంతెన మునిగింది. జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న చామ కాల్వను అక్రమార్కులు చెరిపేస్తున్నారు. ఎక్కడికక్కడ యథేచ్ఛగా అక్రమించుకుంటున్నారు. ఏకంగా కాల్వను పూడ్చేసి 'పక్కా'గా కట్టడాలు చేపడుతున్నారు. ఎస్‌బీఐ కాలనీలోని పెద్ద చెరువు నుంచి ప్రారంభమయ్యే ఈ కాల్వ బొమ్మలసత్రం ప్రాంతంలోని కుందూ నది వరకు సుమారు 6.7 కి.మీ. పొడవునా విస్తరించి ఉంది. ఎస్బీఐ కాలనీ–ఎన్జీవో కాలనీలను కలిపే వంతెన సమీపంలో రెండు బహుళ అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. కాల్వ శిఖం భూమిని ఆక్రమించారు. పిల్లర్లు వేసేందుకు భారీ యంత్రాలతో 15 అడుగుల లోతు గుంతలు తవ్వారు. నీటికి అడ్డుకట్ట వేసి ఏకంగా పునాదుల నిర్మాణం చేపడుతున్నారు.

**ముందస్తు ఎత్తుగడలు**

వాగు వెంట ఆక్రమణలు పెరిగి స్థిరాస్తి వెంచర్లు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏ మేరకు ఆక్రమణలు జరిగాయన్న విషయమై కేసీ కాల్వ అధికారులు సర్వే చేయిస్తున్నారు. పట్టణ శివారులోని పెద్ద చెరువు నుంచి ఎన్జీవో కాలనీలోని ఓ ఆశ్రమం వరకు ప్రస్తుతం ల్యాండ్



అండ్ సర్వే శాఖ అధికారులు సర్వే చేస్తున్నారు.

సర్వే ఆధారంగా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడంతోపాటు ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడం.. భవిష్యత్తులో చామ కాల్వ వెంబడి రక్షణ గోడ నిర్మించాలనేది ఆలోచన. ఈ క్రమంలో ఓవైపు సర్వే జరుగుతుండగా.. మరోవైపు ఎస్బీఐ కాలనీ చివరి ప్రాంతంలో ఏకంగా కాల్వలోనే పునాదులు తీస్తున్నారు.

**అధికారులు పట్టించుకోక..**

గత వారం రోజులుగా కాల్వలో 3 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. ఎస్బీఐ కాలనీలో అక్రమంగా నిర్మించిన కొన్ని బహుళ అంతస్తుల సముదాయంలోకి నీరు చేరుతోంది. వారు పొక్లెయిన్లు పెట్టి కాల్వ ఒడ్డున 5 మీటర్ల పొడవునా పెద్దఎత్తున మట్టి కట్ట వేశారు. ఎస్బీఐ కాలనీలో రెండు బహుళ అంతస్తు భవనాల నిర్మాణంలో భాగంగా మట్టికట్ట వేసి ప్రవాహాన్ని అడ్డుకోవడంతో వరద నీరు వెనక్కి వచ్చి సమీపంలో ఉన్న వంతెన పైకి చేరుతోంది. వంతెన పక్కనే ఉన్న లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఒకవైపు కట్టను ధ్వంసం చేసి నిర్మాణాలు చేయగా.. మరోవైపు ప్రవాహాన్ని అడ్డుకునేందుకు మట్టి కట్టలు వేస్తున్నా జల వనరుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

# ఇళ్లు కొట్టేశారు.. పరిహారం మరిచారు



హిందూపురం : హిందూపురంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య అధికం కావడంతో అప్పటి వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కిందట టీడీఆర్ బాండ్లు ఇస్తామని చెప్పి రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. రైల్వే రోడ్డు, స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట నుంచి రహమత్‌పురం సర్కిల్ వరకు కిలోమీటర్ పొడవునా 70 అడుగులకు విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేసింది. విస్తరణకు అడ్డుగా ఉన్న 200 భవనాలను దాదాపుగా తొలగించారు.

**అడుగడుగునా నిర్లక్ష్యమే..**

రహదారిలో స్థలాలు కోల్పోయే వారికి టీడీఆర్(ట్రాన్సఫర్బుల్ డిపాజిటరీ రీసీట్స్) బాండ్లు మున్సిపాలిటీ జారీ చేయాలి. చదరపు అడుగుకు మార్కెట్ విలువ ఎంత ఉందో అంతకు నాలుగింతలు విలువ చూపుతూ ఈ బాండ్లు ఇచ్చి వారి స్థలాన్ని రహదారికి తీసుకోవాలి. స్థలాలు తీసుకుని ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటిదాక బాండ్లు జారీకి ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

**కొలతలే వేయలేదు..**

రహదారి నుంచి ఎంత స్థలాన్ని తీసుకున్నామనేది టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఇప్పటి దాకా తెలియదు. ఐదేళ్లలో ఈ విభాగానికి పది మందికి పైగా అధికారులు వచ్చారు వెళ్లిపోయారు. ప్రస్తుతం 40 మంది కార్యదర్శులు, మరో పది మంది అధికారులు ఉన్నారు. ఐదేళ్లు గడిచినా కనీసం రహదారి విస్తీర్ణాన్ని అంచనా వేయలేదు.

స్థలాలు కోల్పోయిన వ్యాపారులు : 176 మంది

అందాల్సిన పరిహారం దాదాపు : రూ.100 కోట్లు

**బాండ్ల జారీకి చర్యలు తీసుకుంటాం** –మల్లికార్జున, కమిషనర్

టీడీఆర్ బాండ్లు అందని మాట వాస్తవమే. జారీకి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో చర్చలు జరుపుతున్నాను. ఇప్పటికే కొలతలు వేయాలని ఆదేశాలు ఇచ్చాను. త్వరలో వారికి బాండ్లు అందేలా చూస్తాను.

# ఆస్తిపై కన్నేసి.. కాజేసి!



అనంతపురం: వారసులు లేని ఇంటి యజమానురాలు చనిపోయిందని తెలియగానే అధికార పార్టీకి చెందిన నాయకుడు ఆస్తిపై గద్దలా వాలిపోయాడు. నకిలీ వీలునామా సృష్టించి కాజేశాడు. బంధువులు మృతురాలి దహన సంస్కారాలు, క్రతువులు పూర్తిచేసి వచ్చేలోపు కబ్జా చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నాడు. కోర్టును ఆశ్రయించేందుకు ప్రయత్నించిన బంధువులపైనా దౌర్జన్యానికి దిగి.. వారు లొంగకపోవడంతో సెటిల్ చేసుకుందామంటూ బేరాలు మొదలుపెట్టాడు. పుట్టపర్తికి చెందిన సుసర్ల కనకదుర్గ అనంతపురం నగరంలోని సత్యసాయి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. 15 ఏళ్ల కిందటే కళాశాల సమీపంలోనే సర్వే నంబరు 309లో 6.48 సెంట్ల స్థలం కొని ఇల్లు నిర్మించుకున్నారు. వివాహం కాకపోవడంతో ఒంటరిగానే జీవించేవారు. గతేడాది నవంబరులో రాజమహేంద్రవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. కనకదుర్గకు వారసులు లేరని తెలుసుకున్న స్థానిక అధికార పార్టీ నాయకుడు.. ఆమె ఇంటిపై కన్నేశాడు. హిందూపురానికి చెందిన బి.శకుంతలకు తన తదనాంతరం ఆస్తి చెందేలా కనకదుర్గ వీలునామా రాసినట్లు పత్రాలు సృష్టించాడు. తర్వాత శకుంతల నుంచి పుట్టపర్తికి చెందిన ఈ.శేఖర్ అనే వ్యక్తికి జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేశారు. మృతురాలి ఇల్లు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంలో అక్కడ సెంటు విలువ రూ.25 లక్షల పైనే ఉంది. 6.48 సెంట్లు సుమారు రూ.1.60 కోట్లు ఉంటుంది.

**కీలకనేత అండతో..** కనకదుర్గ మరణాంతరం హైదరాబాద్‌లోని ఆమె అన్న కుమారుడు సాయి మనోహర్ అనంతపురంలోని ఇంటికి వెళ్లి వస్తుండేవారు. ఈ క్రమంలోనే ఇంటిని అమ్మాలనే ఆలోచనతో వంశవృక్షం కోసం స్థానిక వీఆర్వోను సంప్రదించారు. ఇంటి పన్ను రశీదు, మరణ ధ్రువీకరణ.. తదితర పత్రాలు సమర్పించారు. కొద్దిరోజులు తర్వాత వీఆర్వోకు ఫోన్ చేసి ఆరా తీయగా సంబంధిత పత్రాలన్నీ అనంత నగరంలోని కీలక నాయకుడి వద్ద పనిచేస్తున్న వ్యక్తి తీసుకెళ్లారని.. మీ పని పూర్తి కావాలంటే అతన్ని కలవాలని చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలోనే ఓ వ్యక్తి సదరు ఇంటికి తాళం వేసుకుని వెళ్లినట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

**సెటిల్ చేసుకుందామంటూ..**

సాయి మనోహర్‌కు అధికారుల తీరుపై అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో పరిశీలించగా అప్పటికే ఇంటిని మరొకరి పేరుతో జీపీఏ చేసినట్లుగా ఉంది. దీంతో అతను కోర్టు ఆశ్రయించాలని నిర్ణయించుకుని అనంతపురంలోని ఓ న్యాయవాది వద్దకు వెళ్లారు. వెంటనే సదరు నాయకుడు అతనికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. సాయి మనోహర్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో విషయం సెటిల్ చేసుకుందామంటూ బేరాలకు దిగినట్లు తెలుస్తోంది.

వంశవృక్షం కోసం మృతురాలి సోదరుడి కుమారుడు అందజేసిన పత్రాలను స్థానిక వీఆర్వో నేరుగా తీసుకెళ్లి అక్రమార్కుల చేతిలో పెట్టడంతో వారి పని సులువైంది. ఆస్తి బదలాయింపు సమయంలోనూ రిజిస్ట్రేషన్ వీలునామాను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండగా.. అనంతపురం అర్బన్ సబ్‌రిజిస్ట్రార్‌కు శకుంతల అనే మహిళ ఇచ్చిన సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా మరొకరికి జీపీఏ చేయడం గమనార్హం. ఈ విషయంపై జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని.. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆపదా.. సాయం పొందండిలా గోవిందా!

తిరుపతి : శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల వసతి, భద్రతకు ఇతర శాఖల సమన్వయంతో తితిదే పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో భక్తులకు ఇక్కడి వసతులు, సదుపాయాలు, హక్కులపై అవగాహన అవసరం.

**మిస్సింగ్ కేసుల్లో ఇలా..** బ్రహ్మోత్సవాలకు కుటుంబ సభ్యులు, స్నేహితులు బృందంగా వస్తుంటారు. వృద్ధులు, మహిళలు రద్దీతో తప్పిపోతుంటారు. అలాంటప్పుడు వెంటనే సమీపంలో విధుల్లో ఉన్న పోలీసులు, హెల్ప్‌డెస్క్‌కు చెప్పాలి. సమీప స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తారు. తప్పిపోకుండా ట్యాగ్‌లు కడతారు.


**హోమ్‌స్టేలు, లాడ్జీల్లో..** తిరుపతిలో 250 హోమ్‌స్టేలు, 700 హోటళ్లు, లాడ్జీలు ఉన్నాయి. బోర్డులోని ధరలకే గదులు కేటాయించాలి. భక్తులకు తాగునీరు, పార్కింగ్, మరుగుదొడ్ల వెసులుబాటు కల్పించాలి. అమర్యాదగా ప్రవర్తించినా, అధికంగా వసూలు చేసినా కమాండ్ కంట్రోల్ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

**అధిక ఛార్జీలు అడిగితే**

తిరుమలకు జీపులు, ట్యాక్సీల్లో వెళ్లేందుకు ప్రయాణ ఛార్జీ పెద్దలకు రూ.110, పిల్లలకు రూ.60 నిర్ణయించారు. రద్దీ ఉందని అధికంగా వసూలు చేస్తే విధుల్లో ఉన్న పోలీసు, ఆర్టీఏ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి. స్వయంగా కార్లు, ద్విచక్ర వాహనాల్లో తిరుమల, పరిసర ప్రాంతాలు తిరగాలనే వారికి బైక్ రైడర్లు, రెంటల్ కార్లు అందుబాటులో ఉన్నాయి. నగరంలో ఆటోవాలాలు అధిక ఛార్జీలు వసులు చేసినా.. అమర్యాదగా ప్రవర్తించినా డయల్ 112, 80999 99977 నంబరుకు సమాచారం ఇవ్వాలి. ఎక్కడైనా ట్రాఫిక్‌లో ఇరుక్కునా ఇదే నంబర్లకు సమాచారం ఇవ్వాలి.

**చరవాణులు పోతే..**

చరవాణి పోగొట్టుకున్న వెంటనే 'సీఈఐఆర్.కామ్' పోర్టల్‌లో నమోదు చేస్తే డేటా దుర్వినియోగం కాకుండా ఉంటుంది. జిల్లా పోలీసులు అందుబాటులోకి తెచ్చిన మొబైల్ హంట్ వాట్సప్ నంబర్‌కు హాయ్ అని టైప్ చేశాక వచ్చే లింకు ద్వారా వివరాలు నమోదు చేస్తే ఫిర్యాదుగా




స్వీకరిస్తారు. భక్తుల మెడలోని బంగారు గొలుసులు, పర్సులు, బ్యాగులు చోరీకి గురైతే విధుల్లో ఉన్న పోలీసులు, సమీప స్టేషన్‌ను ఆశ్రయించాలి.

మొబైల్ హంట్ నంబర్: 94906 17873

కమాండ్ కంట్రోల్ నంబరు: 80999 99977, 112

అత్యవసరంలో సంప్రదించాల్సిన అధికారుల నంబర్లు

తిరుపతి తూర్పు సీఐ : 94407 96748

తిరుపతి పడమర సీఐ : 94407 96750

అలిపిరి పీఎస్ సీఐ : 94407 96752

తిరుచానూరు సీఐ : 94407 96755

ఎస్వీయూ సీఐ : 94910 74524

తిరుపతి రూరల్ సీఐ : 94910 74525

రైల్వే కమాండ్ కంట్రోల్: 94405 74207

రవాణా శాఖాధికారి : 98485 28580

# నిధులున్నా.. నీరసమే

వీరవాసరం : భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని వీరవాసరం – పెనుమంట్ర, నవుదూరు – భీమవరం, తోలేరు, బాలేపల్లి, కొణితివాడ – మడుగుపోలరం, బలుసుగొయ్యపాలెం ఆర్ అండ్‌బీ రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు రహదారులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా గుత్తేదారులు ఇంకా పనులు ప్రారంభించలేదు. మిగిలిన రహదారుల మరమ్మతులకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంకా నిధులు మంజూరు చేయలేదు. వీరవాసరం – పెనుమంట్ర ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించేలా గుత్తేదారుతో చర్చించాం. మరికొద్ది రోజుల్లో ఈ పనులు ప్రారంభమవుతాయి' అని ఆర్ అండ్ బీ డీఈ రమణ తెలిపారు. వీరవాసరం – పెనుమంట్ర ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతింది. మరమ్మతులకు ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు



చేసి ఏడాది కావస్తున్నా గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. అధికారులను ప్రశ్నిస్తుంటే అదిగో ఇదిలో అంటున్నారు. ఇటీవల ఈ రహదారిపై ఏర్పడిన గుంతలను తప్పించపోయి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. అండలూరు – భీమవరం ఆర్‌అండ్‌బీ రహదారిపై పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతుల కోసం ప్రభుత్వ రూ.40 లక్షలు విడుదల చేసి నెలలు కావస్తున్నా.. గుత్తేదారులు ఇంకా పనులు ప్రారంభించలేదు. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# రాయల రాజసం మట్టిలో కలిసింది


కౌతాళం : కౌతాళం మండలం హాల్వి గ్రామంలోని నరసన్న(పెద్ద) బావిలో శిల్పకళ ఉట్టిపడుతోంది..దీన్ని శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. సుమారు ఐదెకరాల్లో విస్తరించిన ఈ బావి పొడవు, వెడల్పు సమానంగా ఉండటం విశేషం. లోపలి భాగం.. సుమారు 125 అడుగుల పొడవు, వంద అడుగుల వెడల్పు



ఉంది. లోపలికి వెళ్లేకొద్దీ వైశాల్యం తగ్గి అడుగు భాగంలో పొడవు, వెడల్పు.. నాలుగు అడుగుల చతురస్రాకారంలో ఉంటుంది. బావిలోకి దిగేందుకు ఆరు మెట్ల మార్గాలు, నాలుగు ద్వారాలున్నాయి. 25 ఏళ్ల కిందటివరకు ఈ బావిలో నీరు సమృద్ధిగా ఉండేది. 20 ఎకరాలకు సాగునీరు అందేది. చెత్తాచెదారం, మట్టి పేరుకుపోవడంతో నీటి ఊట తగ్గింది.. తొలగిస్తే తిరిగి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది.

# చిట్టి 'తల్లులు'

అనకాపల్లి : జిల్లాలో బాలికలు గర్భం దాల్చుతున్న ఘటనలు అధికమవడం ఆందోళన కలిగిస్తోంది. బాల్య వివాహాలు అధికమవడం, తెలిసీతెలియని వయసులో వేస్తున్న తప్పటడుగులు గర్భం దాల్చడానికి కారణమవుతున్నాయి. చోడవరం, కశింకోట ప్రాంతాల్లో ఇటీవల కాలువల్లో పసికందులను పడేసిన ఘటనలు హృదయ విదారకరంగా మారాయి. టీనేజీలో గర్భం దాల్చడంలో బాలికలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీన్ని అరికట్టడానికి అధికారులు ప్రచారం చేస్తూ చైతన్యం తీసుకువస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సక్రమంగా జరగడం లేదు. టీనేజీ ప్రసవాల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2024–25 సంవత్సరంలో 21,090 గర్భిణులు ఉండగా 465 టీనేజీ ప్రసవాలు జరిగాయి. 2025–26 ఆగస్టు వరకు 7,818 గర్భిణుల్లో 221 మంది టీనేజీ వారే ఉన్నారు. ఏడాదిలో వందల సంఖ్యలో బాలికలు గర్భం దాల్చడం అందరిలో ఆందోళన కలిగిస్తోంది. బాల్య వివాహాలను అరికట్టడం, టీనేజీ ప్రసవాలను నిర్మూలనకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా.. పూర్తిస్థాయిలో ఫలితాలు రావడం లేదు. జిల్లాలో పెరుగుతున్న టీనేజీ ప్రసవాలను అరికట్టేలా అధికారులు



ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. చిన్న వయసులో గర్భం దాల్చిన వారి నుంచి ఎక్కువ మొత్తంలో నగదు తీసుకుంటూ కొన్ని ప్రైవేటు క్లినిక్స్‌లో గర్భస్రావం చేస్తున్నారు. దీనిపైన నిఘా పెట్టాల్సి ఉంది. పిన్న వయసులోనే తల్లులవుతూ అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నా.. వయసు రాకుండానే పెళ్లి చేసే ఆలోచనలో చాలామంది తల్లిదండ్రులు ఉండడం బాల్య వివాహాలకు దారితీస్తోంది. వీటిని అరికట్టేలా ప్రభుత్వం జీవో1ను తీసుకొచ్చి నగర, పట్టణ, గ్రామ స్థాయిల్లో కమిటీలు వేసి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నా పక్కాగా అమలు కావడం లేదు. చిన్న వయసులోనూ గర్భం దాల్చడం వల్ల అనారోగ్య సమస్యలతోపాటు ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**విద్యార్థులకు వైద్య పరీక్షలు: డాక్టర్ హైమావతి, డీఎంహెచ్ఓ**

టీనేజీలో ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లలతోపాటు తల్లిదండ్రులకూ అవగాహన కల్పించేలా రాష్ట్రీయ కిశోర స్వస్థ (ఆర్‌కేఎస్‌కే) కార్యక్రమం ద్వారా ప్రచారం చేస్తున్నాం. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల పరిధిలోని కళాశాలల్లో సదస్సులు నిర్వహించడంతోపాటు వైద్య పరీక్షలు చేస్తున్నాం.

# ఆహారంలో కల్తీ జరిగిందా.. ఫిర్యాదు చేయండి!

పెదవాల్తేరు : ఆహార భద్రత అధికారులు ఇటీవల నగరంలో హెూటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, కర్రీ పాయింట్లలో తనిఖీలు చేసి నిల్వ ఉంచిన, గడువు తీరిన ఆహార పదార్థాలను గుర్తించారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వాటిల్లో 10 నమూనాలు ప్రమాదకరమైనవని తేలింది. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై 43 కేసులు నమోదు చేశారు. ప్రతినెల సుమారు 15 రోజులు ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఆహార కల్తీకి పాల్పడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా ఇలాంటివి గుర్తిస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. నిత్యావసర వస్తువులైన బియ్యం, కూరగాయలు, పప్పులు, ఉప్పు, మాంసం, గుడ్లు, పండ్లు, నూనె లాంటి వస్తువులతో పాటు డెయిరీ ఉత్పత్తులైన పాలు, పెరుగు, శీతల పానీయాలు...బేకరీ ఉత్పత్తులైన



కేకులు, బ్రెడ్ విక్రయించే దుకాణాలు ఆయా పదార్థాలు ఎప్పుడు ప్యాక్ చేశారు. ఖరీదు, బరువు, ఎప్పటి వరకు వాడాలి, లైసెన్స్, తదితర అంశాలతో పాటు కస్టమర్ కేర్ నెంబర్‌ను ముద్రించాలి. 100 గ్రాముల్లో ఎన్ని ప్రొటీన్స్, ఖనిజాలు, విటమిన్లు, కొవ్వు ఉన్నాయో కవర్‌పై ఉండాలి.

ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ.(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా) చట్టం ప్రకారం... తినడానికి పనికిరాని వస్తువులు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారి జి.వి. అప్పారావు తెలిపారు. తనిఖీల్లో సేకరించిన నమూనాలను ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తామని, నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే రూ.10 లక్షల వరకు జరిమానాలు విధిస్తామన్నారు.

ప్రజలు కూడా దుకాణాలు, హెూటళ్లలో ఎవరైనా నాసిరకం సరకులు, నిల్వ ఉంచిన ఆహారం విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే 9912199 284 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. వెంటనే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఉల్లి రైతుకు ఊరట


పెదవాల్తేరు : ఉల్లి రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా దిగుబడులు కొనుగోలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అమలు చేసే పనిలో పడ్డారు అధికారులు. కర్నూలు మార్కెట్‌యార్డులో ప్రభుత్వం తరపున క్వింటా రూ.1200తో ఉల్లి కొనుగోళ్లు చేపట్టారు. 39 లాట్లలో 1,607 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులొచ్చాయి. ఈ-నామ్ విధానంలో ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.1,329, మధ్యస్థం రూ.1,200, కనిష్ఠ ధర రూ.517 పలికింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొదట 12 లాట్లను క్వింటా రూ.1,200తో కొనుగోలు చేసింది. మరో 11 లాట్లను మధ్యాహ్నం కొనుగోలు చేశారు. ఇందులో ఒక్క లాట్‌ను గరిష్ఠ ధర రూ.1,329తో తీసుకున్నారు.

**ఉదయం దళారుల పన్నాగం**

ఉదయం 16 లాట్ల ఉల్లి దిగుబడులకు వ్యాపారులు, ఇటు మార్క్‌ఫెడ్ సిబ్బంది అసలు ధరనే రాయలేదు. కొనుగోలు చేయలేదు. ఇదే అదనుగా దళారులు మార్కెట్‌లోకి చొరబడ్డారు. కొనుగోలు చేయని సరకును ప్యాకెట్ రూ.100, రూ.200కు బేరం చేశారు. సి.బెళగల్ మండలం మారందొడ్డికి చెందిన రైతు మస్తాన్ తెచ్చిన ఉల్లిని ఓ దళారి ప్యాకెట్ రూ.250 చొప్పున కొనుగోలు చేశారు. అదే గ్రామానికి చెందిన మరోరైతు వెంకటరాముడు నుంచి ప్యాకెట్ ఉల్లిని రూ.280కు అనధికారికంగా కొనుగోలు చేశారు. మరికొన్ని లాట్లను రూ.100 నుంచి రూ.200లోపే ఇచ్చి ఎగరేసుకెళ్లారు. ఎండుమిరప షెడ్లలో ఉన్న ఉల్లి దిగుబడులను దళారులు బహిరంగంగా కొనుగోలు చేస్తున్నా మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది అటువైపు చూడనేలేదు.

**మధ్యాహ్నం అధికారుల రాకతో**

కలెక్టర్ , రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్, జేసీలు సాయంత్రం మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు



తెలుసుకున్నారు. క్వింటా రూ.1200 కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసిన 10 లాట్లను, అసలు టెండరులో ధరలే రాయని 16 లాట్ల గురించి ఆరా తీశారు. కొన్ని లాట్లకు రూ.1200, మరికొన్నింటికి తక్కువ ధరలు రాశారు, సరకు నాణ్యంగా లేదని 16 లాట్లను కొనుగోలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి మార్కెట్‌కు వచ్చిన మొత్తం దిగుబడులను క్వింటా రూ.1200తో కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. దీంతో సరకునంతా కొనుగోలు చేశారు.

ఈ-పంట నమోదు చేసుకొంటేనే

ఉల్లి సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలి.. అప్పుడే ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200తో కొనుగోలు చేస్తారని జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రామాంజనేయులు సూచించారు. జిల్లాలో 12 వేల హెక్టార్లలో ఉల్లి సాగుచేయగా ఇప్పటి వరకు 80 శాతం మేర నమోదైందన్నారు.

# ఆరు నియోజకవర్గాలకు కృష్ణా జలాలు



చిత్తూరు : ఎన్నికల హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాలువల్లో పెండింగ్ పనులు శరవేగంగా పూర్తి చేసింది. రామకుప్పం మండలంలో కృష్ణా జలాలు ప్రవేశించిన నాలుగు రోజులకే చివరి పాయింట్ పరమసముద్రం చెరువుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చెరువు వద్ద ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రధాన కాలువ, నీవా బ్రాంచి కాలువ, చింతపర్తి, ఎల్లుట్ల, సదుం డిస్ట్రిబ్యూటరీలనూ ఏడాదిలో పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయని తెలిపారు. ఇప్పటికే హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. అక్కడ చిన్న చిన్న మార్పులు చేసి పరిపాలనా అనుమతులు ఇవ్వనున్నారు. 2014-19 మధ్య తెదేపా హయాంలో కుప్పం బ్రాంచి కాలువ(కేబీసీ)ను 87 శాతం పూర్తి చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ కేవలం రెండు శాతం పనులతోనే సరిపెట్టింది. శాంతిపురం మండలం వరకే అప్పట్లో నీరు చేరాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు వీటిని పూర్తి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం రాగానే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను పరుగులు పెట్టించారు. ఎప్పటికప్పుడు పురోగతి తెలుసుకుంటూ గుత్తేదారులకు దిశానిర్దేశం చేశారు. పాలనా అనుమతులు వచ్చిన ఆరు నెలలకే లైనింగ్, విస్తరణ చేయించి చరిత్ర సృష్టించారు. ఇప్పుడు ప్రధాన కాలువను ప్రాధాన్య జాబితాలో చేర్చారు.

150 కిలోమీటర్లే కావడంతో.. పీబీసీ, కేబీసీ కలిపి దాదాపు 330 కిలోమీటర్ల పొడవుంది. అదే హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ 150 కిలోమీటర్లే ఉంది. సామర్థ్యం కూడా ఎక్కువ రావడంతో వేగంగా నీరు ప్రవహిస్తుంది. అడవిపల్లె రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకున్నా 12 కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్లు, బావులు రీఛార్జ్ అవుతాయి. అదేవిధంగా రాయచోటి నియోజకవర్గంలోని శ్రీనివాసపురం జలాశయమూ నిండనుంది. చిత్తూరు నగర ప్రజల తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం లభించనుంది.

**ఐదు ప్యాకేజీలు.. 1,20,500 ఎకరాలు**ప్రస్తుతం హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువపై రెండు ప్యాకేజీలు, నీవాపై మూడు ప్యాకేజీల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కుప్పం, పుంగనూరు బ్రాంచ్ కాలువల తరహాలోనే అవసరమైన చోట విస్తరణ, లైనింగ్ చేయనున్నారు. తొలుత ప్రధాన కాలువకు రూ.350 కోట్లు వ్యయమవు తుందని అంచనా వేశారు. తంబళ్లపల్లె, నీవా, ఎల్లుట్ల, చింతపర్తి, మిగతా పనులతో కలుపుకొంటే రూ.900 కోట్ల వరకు ఖర్చవుతుంది. తద్వారా 1,20,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రతిపాదనలకు పాలనా అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు ఖరారు చేయనున్నారు.

# ఊరు ఒకటే.. మండలాలు మూడు



ఎలమంచిలి : రెండు నియోజకవర్గాలు.. మూడు మండలాలు.. మూడు గ్రామ పంచాయతీలు కలిపితే జంపపాలెం. ఇదేం చిత్రం అనుకుంటున్నారా.. మీరు వింటున్నది నిజమే. జిల్లాలోని ఎలమంచిలి మండలం, జంపపాలెం పంచాయతీది భిన్నమైన భౌగోళిక స్వరూపం. ఊరు ఒక్కటే అయినా మూడు పంచాయతీల పరిధిలో ఉండటంతో ఈ ప్రాంత ప్రజలది పాలనాపరంగా మూడు ముక్కలాటలా తయారైంది. శారదా నదిని ఆనుకొని ఉన్న జంపపాలెం గ్రామం ఎలమంచిలి మండలం పరిధిలోకి వస్తోంది. దాదాపు రెండు వేల జనాభా కలిగి వ్యవసాయ ఆధారంగానే ఇక్కడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. పేరుకు ఒకే గ్రామమైనా మూడు పంచాయతీల పరిధిలో గృహాలు విస్తరించి ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఒక రోడ్డే ఊరును మండలాలుగా విభజిస్తోంది.

గ్రామంలో కొంతభాగం కశింకోట మండలం ఏనుగుతుని గ్రామ పంచాయతీ శివారు ప్రాంతం చిన్న ఏనుగుతుని పేరుతో కొనసాగుతోంది. దీని పరిధిలో దాదాపు 50 గృహాలు, 300 మందిమందికి పైగా జనాభా ఉన్నారు. వీరంతా రేషన్, పింఛన్లు, ఇతర ఏ అవసరం వచ్చినా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏనుగుతుని వెళ్లాల్సిన పరిస్థితి. భౌగోళికంగా జంపపాలెంలోనే కలిసి ఉన్నా అధికారికంగా అక్కడ పాలనపైనే ఆధారపడాల్సి వస్తోంది.

మరికొంత భాగం మునగపాక మండలం మెలిపాక రెవెన్యూ. ఇంకొంత భాగం మెలిపాక శివారు చిన యాదగిరిపాలెం పరిధిలో కొనసాగుతోంది. ఇక్కడ కూడా 50 కుటుంబాలకు పైగా జీవనం సాగిస్తున్నాయి. వీరంతా విద్య, వైద్యం ఇతర ఏ అంశమైనా సమీపంలోని జంపపాలెం, ఎలమంచిలి పైనే ఆధారపడతారు. చిన యాదగిరిపాలెం ప్రజలు శారదానదిని దాటుకొని పంచాయతీ అయన మెలిపాక వెళ్లాల్సిన పరిస్థితి. పండగలైనా, శుభకార్యమైనా వీరి బంధాలు, బంధుత్వాలు, ఆధ్యాత్మిక భావాలు జంపపాలెంతోనే ముడిపడి ఉంటాయి.

నియోజకవర్గాలూ వేరే..

సాధారణంగా ఒకే మండలంలో గ్రామాలు కలిపి ఉంటే ఇబ్బందులు ఉండవు. జంపపాలెం ఎలమంచిలి నియోజకవర్గంలో ఉంటే, ఏనుగుతుని అనకాపల్లి నియోజకవర్గంలోకి రావడంతో పాలకులు సైతం మారిపోతున్నారు. ఇక చిన యాదగిరి పాలెం ప్రజలు మునకపాక మండల కేంద్రానికి వెళ్లాలి. వీరంతా తమ సమస్యలు చెప్పుకోవాలంటే దాదాపు 20 కిలోమీటర్లు దూరంలో మండల కేంద్రాలకు చేరుకోవాలి. అదే ఎలమంచిలి అయితే కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

# 'సెంటు' లేఅవుట్లు మింగేస్తున్నాయ్ రూ.కోట్లు!



విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'ఒక సెంటు' ప్లాట్ల కోసం ఎక్కడపడితే అక్కడ కొండ వాలు ప్రాంతాల్లో స్థలాలు సమీకరించారు. ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు ఖర్చు చేశారు. వాటిలో నాణ్యత లోపాలు బయటపడ్డాయి. గతంలోనే విజిలెన్స్ విచారణ సాగినా...అదీ తూతూమంత్రమే అయిందనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక..రైతులకిచ్చే పరిహార లేఅవుట్‌లలోనూ భారీగా పనులు చేపట్టినా ఇక్కడా నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినట్లు పనులను చూస్తే అర్థం అవుతుంది.

ఆనందపురం మండలం తంగుడుబిల్లిలో రూ.3 కోట్లతో కొద్ది రోజుల కిందట నిర్మించిన తారు రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి దారుణంగా దెబ్బతింది. పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోంది. భారీ వాహనం వెళ్తే గోతులు పడిపోతున్నాయి.

రామవరం లేఅవుట్‌లోనూ రోడ్డు పాడైపోయింది. తారు రోడ్డు ముక్కముక్కలుగా విడిపోతోంది.

సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో వేసిన రోడ్ల పరిస్థితీ అంతే. నీటి ప్రవాహ మార్గాలు లేకపోవడంతో భారీగా కోతకు గురయ్యాయి.

భీమిలి మండలం నేరెళ్లవలస వద్ద వేసిన లేఅవుట్‌లోనూ కాలువలు పూడుకుపోయాయి. వాటి గట్లు దెబ్బతిన్నాయి.

గిడిజాలలో వరదకు రహదారులు పలు చోట్ల కోతకు గురయ్యాయి.

శొంఠ్యాంలోనూ ఇదే పరిస్థితి.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో..

ఒక సెంటు లేఅవుట్లు: 83

పాట్లు: 1,41,654

మౌలిక వసతుల కల్పనకు వీఎంఆర్‌డీఏ చేసిన ఖర్చు: రూ. 175 కోట్లు : లేఅవుట్లలో తాత్కాలిక అవసరాలకు దారులు నిర్మించారు. బోర్లు తవ్వారు. కొన్ని చోట్ల గోదాంలు, విద్యుత్తు స్తంభాలు నిర్మించారు. టెండర్ల ద్వారానే వీటిని చేపట్టినా... అప్పట్లో నచ్చిన గుత్తేదారులకు పనులు అప్పగించారు. వాటిలో లోపాలున్నా కీలక అధికారులూ పట్టించుకోలేదు.

మొదట దశలో: రైతులకు పరిహారంగా ఇచ్చిన 48 లేఅవుట్లలో మొదటి దశగా రూ.200 కోట్లు ఖర్చు చేసి మౌలికవసతులు కల్పించారు. వీటిలోనూ నాణ్యత కొరవడినట్లు తెలుస్తోంది.

రెండో దశలో: రూ. 300 కోట్ల అంచనాతో బీటీ రోడ్లు, మొక్కలు నాటడం, పార్కుల అభివృద్ధికి ప్రణాళిక చేసి కొన్ని ఆరంభించారు. నాటిన మొక్కలు చాలా వరకూ ఇప్పటికే ఎండిపోయాయి.

మూడో దశలో: రూ. 155 కోట్లతో ఈ లేఅవుట్ల వద్ద నీటి వసతి కల్పించాల్సి ఉంది.

# ఆ ఒక్కటీ అడగొద్దు!

ఒంగోలు : కందిపప్పు.. ఆ ఒక్కటి అడగొద్దు అనే పరిస్థితి చౌక ధరల దుకాణాల్లో నెలకొంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పుతోపాటు పామాయిల్, రాగులు, గోధుమలు, జొన్నలు పంపిణీ చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం చేస్తున్నా క్షేత్రస్థాయిలో కార్యచరణకు నోచుకోవడం లేదు. కార్డుదారులకు ఈనెలలో కూడా కందిపప్పు సరఫరా నిలిచింది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచే జిల్లాకు కేటాయింపులు లేకపోవడంతో డీలర్లు సైతం డీడీలు తీయలేదు. 65 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందుల్లేకుండా వారికి ఇంటి వద్దకే డీలర్ల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. ఈ నెలకు సంబంధించి సోమవారం నుంచి దుకాణాల ద్వారా కార్డుదారులకు సరకుల పంపిణీ ప్రారంభించారు. గత ఎనిమిది నెలలగా కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో కార్డు దారులకు బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు.



**బయట కొనలేక**

జిల్లాలో 1,392 రేషన్ దుకాణాలుండగా, వాటి పరిధిలో 6.61 లక్షల బియ్యం కార్డులున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచదార, కందిపప్పు తూకంలో తేడాలను నియంత్రించింది. కార్డుదారులకు నెలలతరబడి కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో వారంతా ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని కార్డుదారులకు నెలకు 650 టన్నుల డిమాండు ఉండగా అందుకు ఈ నెలలోనూ కేటాయింపులు జరగలేదు. కిలో కందిపప్పు బయట మార్కెట్‌లో నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.120 వరకు ఉండగాబీ పౌరసరఫరాలశాఖ ద్వారా రూ.67కే అందిస్తున్నారు. ఇది కార్డు దారులకు అధిక ధరల నుంచి ఉపశమనం కలిగించనుంది. రాష్ట్రస్థాయి నుంచే కందిపప్పు సరఫరా లేకపోవడంతో జిల్లాలోని పౌరసరఫరాలశాఖాధికారులు చేతులెత్తేశారు. దీంతో కార్డుదారులకు డీలర్లు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

# మురుగు.. ఇక కనుమరుగు!

ఒంగోలు: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రహదారులు నిర్మించినా మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచే దిశగా కూటమి ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. మ్యాజిక్ డ్రెయిన్ విధానం కింద ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థపు నీరు నేరుగా భూమిలోకి ఇంకేవిధంగా చేస్తారు. ఇందుకు సిమెంటు రహదారి పక్కన సమాంతరంగా మురుగు కాలువ స్థానంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నీరు అక్కడ నుంచి మరో చోటకు ప్రవహించకుండా ఉండేందుకు ఒకటిన్నర మీటరు లోతు ఉండేలా రహదారి పక్కనున్న ప్రదేశంలో డ్రెయిన్ నిర్మాణం చేపడతారు. అందులో ప్రతి 50 మీటర్లకు ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తారు. అందులో కంకర రాళ్లు నింపి పైన చిప్స్ అమర్చుతారు. కాలువ పొడవునా కంకర రాళ్లు నింపుతారు. దీంతో మురుగునీరు ఇంకుడు గుంతలోకి చేరిన తర్వాత వడపోతకు గురై భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భజలాలు సైతం వృద్ధి చెందుతాయి.

**తొలివిడతగా ఎక్కడంటే..**

మ్యాజిక్ డ్రెయిన్ కింద చేపట్టనున్న నిర్మాణ పనులకు ఉపాధిహామీ మెటీరియల్ కాంపొంనెంట్ నిధులను కేటాయించనున్నారు. జిల్లాలో తొలివిడతగా పైలట్ ప్రాజెక్టు కింద చోడవరం (వెలిగండ్ల), పెద్ద నాగులవరం (మార్కాపురం), శివపురం (టంగుటూరు), వేములబండ పంచాయతీ రమణారెడ్డి ఆవాస ప్రాంతం (ముండ్లమూరు), గౌతవరం



(రాచర్ల), పాదర్తి (కొత్తపట్నం) గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఈ విధానం కింద మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 150 మీటర్ల పొడవు, 0.55 మీటర్ల వెడల్పు, 0.50 మీటర్ల లోతు ఉండేవిధంగా గుంత తవ్వి రాళ్లతో నింపుతారు. ప్రతి 50 మీటర్లకు ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేస్తూ పక్కన నాపరాయితో నిర్మించనున్నారు. ఇందుకు ఉపాధిహామీ పథకం కింద రూ.లక్ష వ్యయం కానున్నట్లు అంచనా వేశారు.

**పనుల ప్రారంభానికి శ్రీకారం**

జిల్లాలో ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాల్లో కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వెలిగండ్ల మండలం చోడవరంలో సోమవారం కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిబీ టంగుటూరు మండలం శివపురంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పనులు ప్రారంభించారు. ఎంపిక చేసిన ఆరు గ్రామాల్లో 9,924 మీటర్ల పొడవునా కాలువల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు డ్వామా పీడీ జోషఫ్‌కుమార్ తెలిపారు.

# వర్షాలకు జోరుగా వరి నాట్లు

ఆనందపురం: మండలంలో ఇటీవల కొన్ని వారాలుగా కురుస్తున్న అల్పపీడన వర్షాలతో వరినాట్లు జోరందుకున్నాయి. ఈ వర్షాలతో చెరువులు, నేల బావులు నిండిపోవడంతోపాటు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో వరినాట్లు మెట్ట పంటలు సాగులో ఉత్సాహంగా ఉన్నారు. ఆనందపురం మండలంలో ఇప్పటివరకు 750 ఎకరాల్లో వరి నాట్లు వేసినట్లుగా వ్యవసాయ శాఖ అధికారిని సంధ్యా రత్నప్రభ తెలిపారు. రైతులందరూ ఈ క్రాప్ చేయించుకోవాలని ఈ సందర్భంగా గ్రామాల్లో రైతులకు తెలిపారు. ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతులు దగ్గర నుంచే ధాన్యం సేకరణ ఉంటుందని పేర్కొన్నారు.

చురకలు

శనివారం 27 సెప్టెంబర్ 2025

# మాతృ వందనం.. గర్భిణులకు వరం

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా పేద గర్భిణులు, బాలింతలకు ప్రధాన మంత్రి మాతృవందన యోజన వరం లాంటిది. పౌష్టికాహార లోపాన్ని నిర్మూలించడం.. రక్తహీనతను గణనీయంగా తగ్గించడమే పథకం ప్రధాన ఉద్దేశం. ఒక్కో ప్రసవానికి రూ.5వేలు ప్రోత్సాహకాన్ని అందిస్తారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం జననీ సురక్ష యోజన కింద మరో రూ.వెయ్యి కలిపి రూ.6వేలు ఇస్తారు. గరిష్ఠంగా రెండు ప్రసవాలకు పథకాలు వర్తింపజేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 5126 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాతృవందన యోజన నమోదు మొదలు కానుంది. ప్రస్తుతం గర్భిణు, బాలింతలు 36,438 మంది ఉన్నారు.



**ఎవరు అర్హులు.. దరఖాస్తు ఎలా?**

అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త వద్ద దరఖాస్తు చేసుకోవాలి. 18 ఏళ్ల ఏడు మాసాలు నిండిన మహిళ నుంచి 55 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, ఫొటో, ఆరోగ్యకార్డు.. తదితరాలు అంగన్‌వాడీ కార్యకర్తకు ఇవ్వాలి. గర్భిణి 3 మాసాల సమయంలో నమోదు చేసుకుంటారు. ఆరు మాసాల్లోగా రెండుసార్లు ప్రభుత్వ వైద్యుడితో పరీక్షలు చేయించుకున్న తర్వాత రూ.3వేలు ఒకసారి, బిడ్డకు 14వారాల్లోపు నిర్దేశిత టీకాలు వేయించిన తర్వాత తక్కిన రూ. 2వేలు జమ అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1000 ప్రసవం కాగానే ఇవ్వనున్నారు.

# భక్తులు నిండుగా.. ఆదాయం మెండుగా

కాణిపాకం : రాష్ట్రంలో ఒకప్పుడు చాలా చిన్న ఆలయం.. ప్రస్తుతం పెద్ద ఆలయాల్లో ఒక్కటి. నాడు కేవలం వందల సంఖ్యలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు నేడు వేల సంఖ్యకు చేరుకుంది. అదే తరహాలో స్వామివారి ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోంది. ఇదీ కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం. ఎలాంటి ఆస్తులు లేకుండా కేవలం భక్తులు అందిస్తున్న కానుకలు, ఇతర వాటితో ఆదాయం రోజురోజుకు సమకూరుతోంది. ఫలితంగా భక్తులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతోంది.



**ఆలయ పునర్నిర్మాణంతో..**

స్వామివారి ఆలయాన్ని 2022లో దాత విరాళంతో పునర్ నిర్మించారు. అప్పటి వరకు ఉన్న ఆదాయం ఒక్కసారిగా రెట్టింపు అయ్యింది. స్వామివారికి ప్రధానంగా హుండీల్లో సమర్పించే కానుకలు, విరాళాలు, టిక్కెట్లు, ప్రసాదాల విక్రయం, దుకాణాల సముదాయం, పార్కింగ్, తలనీలాల విక్రయం, లీజుల ద్వారా ప్రస్తుతం ఆదాయం వస్తోంది. ఐదు సంవత్సరాలతో పోలిస్తే 2020-21లో రూ.42.22 కోట్లు ఆదాయం కాగా 2023-24లో అది కాస్త రూ.82.95 కోట్లకు చేరుకుంది. గడిచిన ఐదు నెలల్లో రూ.45 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

# కొత్త పంచాయతీలకు సొంత భవనాలు!

నర్సీపట్నం : జిల్లాలో 28 పంచాయతీలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. ఈ మేరకు అనుమతిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్కే తేజ తాజాగా ఉత్తర్వులిచ్చారు. ఒక్కో భవనానికి రూ.32 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. ఇందులో రూ.7 లక్షలు ఉపాధి హామీ పథకం నుంచి కేటాయించనున్నారు. మిగతా నిధులు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద వెచ్చిస్తారు. ఈ నిధులన్నీ కొత్త గ్రామ పంచాయతీలకే కేటాయించారు. ఎన్నికలు జరిగిన నాలుగున్నరేళ్ల తర్వాత వీటికి నిధులిచ్చారు. చాలాచోట్ల అద్దె భవనాల్లో కార్యాలయాలు నడుస్తున్నాయి. సమావేశాల నిర్వహణకు, బ్లీచింగ్, సున్నం, విద్యుద్దీపాలు, ఫాగింగ్ యంత్రాలు తదితర సామగ్రి నిల్వ చేయడానికి చోటులేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవనాలకు నిధులు మంజూరవడంతో ఆయా గ్రామాల సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో భవనాన్ని 1226 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. కనీసం ఐదుసెంట్ల భూమి అందుబాటులో ఉన్నచోటనే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. నర్సీపట్నం మండలం.. కేఎల్‌పురం, దుగ్గాడ, నాతవరం మండలం.. సుందరకోట, వైబీపట్నం, లింగంపేట, మాకవరపాలెం మండలం.. మామిడిపాలెం, బీఎస్‌పేట, మల్లవరం, కొత్తతూటిపాల, చామంతిపురం, ముసిడిపాలెం, గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం, పాయకరావుపేట మండలం.. నామవరం, చీడికాడ మండలం.. డి.సురవరం, ఎలమంచిలి మండలం పీఎన్‌ఆర్‌పాలెం, ములకలాపల్లి, మునగపాక మండలం మల్లవరం, కాకరాపల్లి, గొల్లలపాలెం, బుచ్చయ్యపేట మండలం సీతయ్యపేట, కరక, రావికమతం మండలం ఒమ్మవరం, కేబీపీ అగ్రహారం, మాడుగుల మండలం ఎం.కృష్ణాపురం, రోలుగుంట మండలం పడాలపాలెం గ్రామాల్లో భవనాలను నిర్మించనున్నారు.

# మొండిగోడల మధ్యే వైద్యం



గుత్తి: ముందుచూపులోపంతో గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత పాలకులు ఆయా పనులను నామినేషన్ పద్ధతిన తమ కార్యకర్తలకు అప్పగించారు. ఫలితంగా రూ.కోట్లకు సార్థకత లేకుండాపోతోంది. ప్రస్తుతం వైద్యసిబ్బందితోపాటు రోగులు అవస్థ పడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

చాలీచాలని అంచానాలతో హెల్త్ సెంటర్లకు భవనాలకు డిజైన్ చేయడం వల్లే గ్రామాల్లో ఆయా పనులు పూర్తి కాక దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తుయి. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల్లోని పలు గ్రామాల్లో 31 భవనాలను వైకాపా ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.17.50 లక్షల చొప్పున నిర్ణయించింది. అన్నిహంగులతో నిర్మించాలంటే రూ.21.80 లక్షలు వెచ్చించాల్సి ఉంది. పంచాయతీరాజ్ ఇంజినీర్లు అప్పట్లో మంజూరు చేసిన నిధులతో అయిన కాడికి నిర్మాణాలు పూర్తి చేశారు. పనుల వ్యయం పెరగడంతో వారు ప్రభుత్వానికి అంచనాలను పెంచి ప్రతిపాదనలు పంపారు. ఈలోగా వైకాపా ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. అదనంగా నిధులు మంజూరు చేస్తేనే నిర్మాణాలు పూర్తవుతాయి. ఇంజినీర్లు కేవలం భవనాన్ని నిర్మించి ఇవ్వాలనుకోగా వైద్యులు తమకు అన్ని వసతులు, సౌకర్యాలతో హెల్త్ సెంటర్లను నిర్మిస్తేనే వాటిని స్వాధీనం చేసుకుంటామని మెలికపెట్టారు.

**వైద్యులు, రోగులకు తిప్పలు**

గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలలోని పలు గ్రామాల్లో మొండిగోడల మధ్యే రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఓ వైపు రోగులు, వైద్యసిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గుత్తి మండలంలోని పెదొడ్డి, అబ్బేదొడ్డి గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తి కాలేదు.

జక్కలచెరువు, తొండపాడు, కొత్తపల్లి, వన్నేదొడ్డి, కరిడికొండ, ఊబిచర్ల, బసినేపల్లి, తురకపల్లి,ఎర్రగుడి, కొజ్జేపల్లిలో నిర్మాణాలను పాత అంచానాలతోనే పూర్తి చేయించారు. మిగిలిన రెండు గ్రామాల్లో పనులు ముందుకు సాగడంలేదు. గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం, దంచర్ల, అయ్యవారుపల్లి, నక్కన దొడ్డి, ములకలపెంట, ఓబుళాపురంలో పనులు ఆగిపోయాయి. పామిడి మండలంలోని పాళ్యం, జి.కొట్టాలలో భవన నిర్మాణాలు పడకేశాయి. దేవరపల్లిలో భవనం కిటికీలు, తలుపులు, విద్యుత్తు వైరింగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.

**నిధుల్లేకనే పనులు జరగలేదు**

మల్లేశ్‌నాయక్, హేమ్లానాయక్, గుత్తి, పామిడి, మండల ఇంజినీర్లు

అంచనా వ్యయం పెగడంతోనే హెల్త్ సెంటర్ల పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే అనేక గ్రామాల్లో భవన నిర్మాణాలను పూర్తి చేయించాం. అంచనా వ్యయం పెరిగింది. గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేకపోయింది. నిధులు వస్తే మిగిలిన వాటిని పూర్తి చేయిస్తాం.

# హైస్కూల్ ప్లస్.. క్షేత్రస్థాయిలో మైనస్




గోరంట్ల : మారుమూల గ్రామాల పిల్లలకు ఉన్నతవిద్య అవకాశం కల్పించాలన్న ఆలోచనతో వైకాపా పాలనలో ఏర్పాటుచేసిన హైస్కూల్ 'ప్లస్' పథకం శ్రీసత్యసాయి జిల్లాలో క్షేత్రస్థాయిలో 'మైనస్'గా మారిందని ఉపాధ్యాయుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. మధ్యలో బడిమానివేసే వారిసంఖ్య తగ్గించడంతో పాటు బాలికా విద్యకు ప్రోత్సాహం కల్పించే ఆశయంలో మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టూ ఏర్పాటు పథకానికి శ్రీకారం చుట్టారు. మౌలిక వసతులు కల్పించడం, అధ్యాపకులను నియమించడంలో అప్పటి ప్రభుత్వం విఫలం కావడంతో అందులో చేరడానికి విద్యార్థులు ఏమాత్రం ఆసక్తి చూపడంలేదు. దీంతో ఆ పాఠశాలల్లో రెండేళ్లు గడుస్తున్నా అడ్మిషన్లు జరగలేదు. ఈక్రమంలో పథకం ఆలోచనను ప్రభుత్వం రద్దు చేసుకునే అవకాశాలు లేకపోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ప్లస్ టూ పథకం ఏర్పాటుకు ఎనిమిది పాఠశాలలు ఎంపికచేశారు. అందులో రెండు చోట్ల మాత్రం విద్యార్థులు చేరడంతో కొనసాగుతున్నాయి. మిగిలిన ఆరింటిలో ఇప్పటి వరకు అసలు చేరలేదు. బత్తలపల్లి, బుక్కపట్నం, గోరంట్ల బాలుర, ఓబుళదేవరచెరువు, సోమందేపల్లి, గాండ్లపెంట జడ్పీ ఉన్నత పాఠశాల ల్లో రెండేళ్లలో ఒకరు చేరకపోవడంతో వీటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఆరు మండలాల్లో కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాల లు లేవు. విద్యార్థులకు కళాశాల విద్యకావాలంటే ప్రైవేటు విద్యాసంస్థలో చేరాలి.. లేదంటే 20- 30 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి. డీఈవో ఏమంటున్నారంటే: ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప మాట్లాడుతూ కమిషనర్ కార్యాలయంలో ఈవిషయంపై చర్చ జరిగింది. ఈడీఎస్సీలో మంజూరు చేస్తారేమో చాడాల్సి ఉంది. కమిషనర్ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో రెండు హైస్కూల్ ప్లస్‌ల్లో మాత్రమే విద్యార్థులున్న మాట వాస్తవం.

# అడిగేదెవరు... తరలించేయ్!



పుట్టపర్తి : శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి సమీప కొండలు, గుట్టలు, వంకలను అక్రమార్కులు వదలడం లేదు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తరలించేస్తున్నారు. అడిగేనాథుడే లేకపోవడంతో మట్టిమాఫియా రెచ్చిపోతోంది. కొందరు నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. అనుమతులు లేకుండానే తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో కొండలు, గుట్టలు రూపురేఖలు కోల్పోతున్నాయి. వైకాపా హయంలో మట్టి దందా చేసిన వారే ప్రస్తుతం కూటమి నేతలతో చేతులు కలిపి తవ్వకాలు సాగిస్తుండటం గమనార్హం. ఎర్రమట్టికి గిరాకీ ఉండటంతో యంత్రాలను పెట్టి దోపిడీ చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

**టిప్పర్ రూ.2,500కు పైగానే..**

పుట్టపర్తి పురపాలిక పరిధిలోని కర్ణాటకనాగేపల్లి టిడ్కో గృహాల వద్ద, నూతన నాలుగు వరుసల రహదారి సమీప గుట్టలు, కోవెలగుట్లపల్లి, బీడుపల్లి సమీపంలోని గుట్టలు, వంకల నుంచి టిప్పర్లతో మట్టి అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్ ఎర్రమట్టి రూ.2,500 నుంచి రూ.3,200 వరకు పుట్టపర్తి పట్టణంతోపాటు బుక్కపట్నం, కొత్తచెరువులో విక్రయిస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల అండతోనే దందా సాగుతోంది. దీంతో అధికారులు తవ్వకాలు చేసే ప్రాంతాలకు వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. మొన్నటి వరకు రాత్రి వేళల్లో సాగిన మట్టి దందా..

ప్రస్తుతం పట్టపగలే సాగుతుండటం గమనార్హం.

**ప్రత్యేక నిఘా పెట్టాం** ఓబుళరెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి

మట్టి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం. ఇప్పటికే కొన్ని కేసులు నమోదు చేయించాం. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మట్టి దోపిడీ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# అందని పౌష్టికాహారం.. రక్తహీనత శాపం..!

పుత్తూరు మండలం గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఓ మహిళ ప్రసవం కోసం పుత్తూరు ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు రక్తంలో 5 గ్రాముల హిమోగ్లోబిన్ మాత్రమే ఉంది. ప్రసవం చేయడం కష్టంగా భావించి తిరుపతి పంపారు. పుత్తూరులో పదో తరగతి విద్యార్థిని ప్రార్థన సమయంలో కింద పడిపోయింది. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వైద్యపరీక్షలు చేయగా బాలికకు రక్తంలో 6 గ్రాముల హిమోగ్లోబిన్ మాత్రమే ఉందని తేలింది.

పుత్తూరు, న్యూస్‌టుడే: జిల్లాలో రక్తహీనతతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకు ఎక్కువవుతోంది. పేద, మధ్య తరగతి వర్గాల్లో ఈ సమస్య మరీ అధికంగా ఉంటోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న వారు అధికంగా ఉన్నారని వైద్య,



ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరం, పిచ్చాటూరు, కేబీవీపురం, నారాయణవనం, పుత్తూరు గ్రామీణ తదితర మండలాల్లో గర్భిణులు అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రక్తహీనత బాధితుల్లో ముఖ్యంగా మహిళలు, గర్భిణులు, బాలింతలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో గర్భిణులు 40 శాతం పైగా రక్తహీనతతో బాధపడుతుండగా పిల్లలు 18 శాతం, పురుషులు 15 శాతం, మహిళలు 20 శాతం ఉన్నారు. రక్తహీనత తక్కువ ఉంటే పలు వ్యాధులకు గురికావాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జిల్లా జనాభా: 42.23 లక్షలు
మహిళలు: 22.11 లక్షలు
బాలింతలు: 39,671
గర్భిణులు: 52,440
06లోపు పిల్లలు: 4.60 లక్షలు

# అనుమతి గోరంత.. తవ్వకం దొరికినంత

పలమనేరు జిల్లాలో ప్రస్తుతం క్వారీ నిర్వాహకులు గోరంత అనుమతులతో దొరికినంతగా దోచుకునేందుకు తవ్వకాలు చేపడుతున్నారు. కొండలను పిండిచేసి మరీ బ్లాక్ గ్రానైట్, కలర్‌గ్రానైట్, రెడ్ మినరళ్లను తోడేస్తున్నారు. ఇంకొందరు ఒక చోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వేస్తున్నారు. వైకాపా హయాంలో వ్యాపారులు క్వారీబండలను లారీల్లో మితిమీరిన లోడ్లతో తరలించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీరి ఆగడాలకు కళ్లెం వేయడం ప్రారంభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ రెండు ప్రత్యేక బృందాలను ప్రత్యేకంగా నియమించారంటే అక్రమాలు ఏమేరకు జరుగుతున్నాయో అర్థమవుతుంది.

పలమనేరు డివిజన్ గనులు, భూగర్భ శాఖ పరిధిలో మొత్తం 252 క్వారీలు ఉన్నాయి. ఇందులో 125 క్వారీల్లో మాత్రమే పనులు జరుగుతున్నాయి. అధికారులు ఎనిమిది క్వారీలపై కేసులు నమోదు చేయగా వీటిలో కుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లోని క్వారీలే కావడం గమనార్హం.

**సీజ్‌చేసినా ఎవరూ రాక..**

అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని గుర్తించి గనులు, భూగర్భశాఖ



వారు కేసులు నమోదు చేశారు. వారి నుంచి దాదాపు 14 బ్లాకుల గ్రానైట్ రాళ్లను సీజ్ చేశారు. ఆరు నెలలు కావస్తున్నా అవి తమవి అని చెప్పుకోవడానికి ఎవరూ రాలేదు. ప్రస్తుతం క్వారీ నడుస్తున్న ప్రాంతాల్లో కూడా చాలావరకు అనుమతులున్న చోట కాకుండా వేరే చోట్ల పనులు చేస్తున్నారు. వీటికి క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కొన్ని సర్వే నంబర్లు అటవీశాఖ పరిధిలో ఉన్నా మంచిరాయి ఉంటే తవ్వేస్తున్నారు. పర్మిట్ లేకుండా 8 చోట్ల తవ్వకాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిపై కూడా ప్రస్తుతం కేసులు నమోదు చేశారు.

**కఠిన చర్యలు తప్పవు**

అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టినా, పర్మింట్ లేకుండా తరలించినా చర్యలు తప్పవు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రెండు ప్రత్యేక బృందాలు దీని కోసం తిరుగుతున్నాయి. ఇప్పటికే దర్యాప్తు 80 శాతం పూర్తయింది. నోటీసులు ఇచ్చిన వారి నుంచి జిల్లా వ్యాప్తంగా జరిమానా రూ.2 కోట్ల వరకు వసూలు చేశాం. ఇంకా రూ.1.50 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. - సత్యనారాయణ డీడీ, మైన్స్, చిత్తూరు

## పండుగ వేళ ఫెస్టివ్ కలెక్షన్స్ తో అదరగొట్టేసిన పూజా హెగ్డే!

ట్రెండ్ ఫాలో అవ్వడం కాదు ట్రెండ్ సెట్ చేయడం అంటే అది పూజా హెగ్డే వల్లే సాధ్యమవుతుంది.. పూజా హెగ్డే ఇప్పటివరకు చాలా షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ కి గెస్ట్ గా వెళ్లడం వాటిని ప్రమోట్ చేయడం మనం తరచూ చూస్తూనే ఉంటాం. అలా పూజా హెగ్డే సినిమాలతో పాటు నగలు, దుస్తులు ప్రమోట్ చేయడంలో భాగమవుతోంది. అయితే ప్రస్తుతం పండగ సీజన్ కాబట్టి తాజాగా ఈ హీరోయిన్ తన సోషల్ మీడియా ఖాతాలో సాంప్రదాయమైన కుర్తా సెట్స్ మొదలు లేటెస్ట్ వెస్ట్రన్ వేర్ దుస్తులకు సంబంధించిన దుస్తులను ధరించి ఫోటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ హీరోయిన్ ఆ ట్రెండీ వేర్ డ్రెస్సుల్లో ఆకర్షిస్తోంది. పైగా అన్ని రకాల డ్రెస్ లను వేసుకొని అటు వెస్ట్రన్ ఇటు ట్రెడిషనల్ అన్నింటిని ప్రమోట్ చేస్తోంది. పూజా హెగ్డే వేసుకున్న ప్రతి ఒక్క డ్రెస్ ఆమెలో ఉన్న విశ్వాసాన్ని హైలెట్ చేస్తోంది. రొటీన్ ఫోటోషూట్స్ తో కాకుండా వివిధ భంగిమల్లో ఉంటూ డ్రెస్సులు వేసుకొని తనలో ఉన్న ఆత్మ విశ్వాసాన్ని



బయటపెట్టింది పూజా హెగ్డే. మొదట ఒక అద్భుతమైన పేస్టల్ పింక్ కలర్ కుర్తాని స్టైల్ చేసింది. ఈ లుక్ లో పూజా హెగ్డే గాంభీర్యం , సాంప్రదాయమైన కల్చర్ కనిపిస్తోంది.అలాగే రెండో ఫోటోలో బ్లాక్ కలర్ వెస్ట్రన్ వేర్ ధరించి ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. అలాగే గోల్డ్ కలర్ మరో వెస్ట్రన్ వేర్ ధరించింది. ఇక చివరిగా వైట్ ఎల్లో కాంబోలో వచ్చిన కుర్తాని వేసుకొని తన స్టైల్ ని ఫినిష్ చేసింది.అలా రకరకాల దుస్తులు వేసుకొని ఫోటోలకు ఫోజులిస్తూ తన లుక్ ని హైలెట్ చేసుకుంది. ఇవన్నీ కూడా ఒక స్టోర్ ప్రమోషన్స్ లో భాగంగానే చేసినట్లు క్యాప్షన్ లో జోడించింది అంతేకాకుండా ఈ ఫోటోలకు క్యాప్షన్ గా "నాకు పండగ సీజన్ అంటే రంగులు,నవ్వు, ఇంట్లో మంచి అనుభూతినిచ్చే క్షణాలు.. సరికొత్త పండగ కలెక్షన్ వచ్చేసింది.స్టైలిష్ ఆనందం, వేడుకతో ఈ కలెక్షన్ నిండి ఉంది. ఈ ఉత్సాహం ఇక్కడితో ఆగదు కాబట్టి పండుగ ఆఫర్లు మీకోసం వేచి ఉన్నాయి.. అంటూ రాసుకొచ్చింది. అలా ఫెస్టివల్ కలెక్షన్ డ్రెస్సులతో పూజా హెగ్డే ఆకట్టుకుంది.. పూజా హెగ్డే సినిమాల విషయానికి వస్తే..ఈ హీరోయిన్ చివరిగా తమిళ్ నటుడు సూర్యతో కలిసి రెట్రో మూవీలో కనిపించింది. కానీ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయ్యింది. ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ దళపతితో జననాయగన్, రాఘవ లారెన్స్ తో కాంచన-4 సినిమాలు చేస్తుంది.అలాగే బాలీవుడ్ లో హై జవానీ తో ఇష్క్ హెూనా హై, సాంకీ సినిమాల్లో నటిస్తోంది.

## రామ్ లిరిక్స్.. ఎంతో క్యూట్ గా పాడిన భాగ్యశ్రీ!

యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే గురించి ఎంత చెప్పినా తక్కువే. యూత్ కలల రాణిగా మారిన అమ్మడు.. మాస్ మహారాజా రవితేజ మిస్టర్ బచ్చన్ మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. సినిమాలో యాక్టింగ్, గ్లామర్ కు అంతా ఫిదా అయ్యారు. తెలుగులో డెబ్యూ మూవీతోనే యువతలో స్పెషల్ క్రేజ్ ఆమె సొంతమైందనే చెప్పాలి. సినిమా అనుకున్నట్లు రాణించకపోయినా.. భాగ్యశ్రీకి ఫేమ్ మాత్రం మామూలుగా రాలేదు. వరుస ఆఫర్స్ ఆమె సొంతమయ్యాయి. రీసెంట్ గా టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ లీడ్ రోల్ లో వచ్చిన కింగ్ డమ్ లో నటించింది అమ్మడు. కానీ సినిమాలో చేసిన రోల్ కు అంతగా ప్రాధాన్యత లేకపోవడంతో భాగ్యశ్రీ బోర్సేకు కలిసి రాలేదు. ఇప్పుడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో ఆంధ్రా కింగ్



తాలూకా మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీ ఫేమ్ పి.మహేష్ బాబు దర్శకత్వంలో భాగ్యశ్రీ ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. కాలేజీ అమ్మాయిగా కనిపించనుండగా.. ఇప్పటికే ఆమెకు సంబంధించిన లుక్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. అయితే ఆ సినిమాకు గాను.. రామ్ తనలోని రైటర్ ను పరిచయం చేశారు. 'నువ్వుంటే చాలే' పాటకు లిరిక్స్ అందించగా.. వివేక్, మెర్విన్ ట్యూన్ కంపోజ్ చేశారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ ఆ సాంగ్.. పాడగా ఇప్పటికే చార్ట్ బస్టర్ గా నిలిచింది. మ్యూజిక్ లవర్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. ట్రెండింగ్ లో కూడా నిలిచింది. ఇప్పుడు ఆ పాటను భాగ్యశ్రీ బోర్సే పాడారు. బ్యాక్ గ్రౌండ్ లో ఆ బ్లాక్ బస్టర్ మెలోడీ సాంగ్ ప్లే అవుతుంటే.. లిరిక్స్ ను ఎంతో అందంగా ఆలపించింది. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సో క్యూట్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ముద్దుముద్దుగా పాడిందని చెబుతున్నారు. అదే సమయంలో రామ్ లిరిక్స్ రాసిన సాంగ్ ను భాగ్యశ్రీ ఆలపించడం గమనార్హం. మొత్తానికి ఈ మ్యాటర్ కూడా నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఎందుకంటే రామ్, భాగ్యశ్రీ రిలేషన్ షిప్ లో ఉన్నట్లు కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. దానిపై ఇప్పటి వరకు ఇద్దరూ ఎక్కడా స్పందించి క్లారిటీ ఇవ్వలేదు. ఓసారి భాగ్యశ్రీ పరోక్షంగా రెస్పాండ్ అయ్యారు.




## 'జైలర్ -2' డేట్ లాక్ చేసిన సూపర్ స్టార్!



సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై పాన్ ఇండియాలో ఎలాంటి అంచనాలున్నాయో చెప్పాల్సిన పనిలేదు. జైలర్ భారీ విజ యం సాధించడంతో రెండవ భాగంగాపై అంచనాలు అంతంతకు రెట్టింపు అవుతున్నాయి. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా? అని ప్రేక్షకాభిమానులంతా ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదరు చూస్తున్నారు. 'కూలీ' కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమవ్వడంతో? 'జైలర్ 2' తో ఆలెక్కలన్నీ సరిచేస్తారని అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

**అనూహ్య ప్రకటన ఓ సంచలనంగా:** ఈ నేపథ్యంలో రజనీకాంత్ నోట రిలీజ్ డేట్ రావడం సంచలనంగా మారింది. ఈ చిత్రాన్ని జూన్ 12న రిలీజ్ చేస్తున్నట్లు రజనీకాంత్ కేరళ వెళ్లి తిరుగొస్తున్న స మయంలో ప్రకటించారు. ఇప్పుడీ అనూహ్య ప్రకటన అంతే సంచ లనంగా మారింది. సాధారణంగా సినిమా రిలీజ్ తేదీని నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తుంది. రిలీజ్ తేదీల విషయంలో హీరోలు కల్పించుకోరు. నిర్మాణ సంస్థ చెప్పే వరకూ కూడా హీరో నోరు విప్పరు. ఒకవేళ హీరో లీక్ చేసినా నిర్మాణ సంస్థ చెప్పిన తర్వాతే చెబుతారు. ఈ నేపథ్యంలో రజనీ కేరళ టూర్ రిటర్న్ జర్నీలో చెప్పడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇది రజనీ సొంత ప్రకటనా?..** నిర్మాణ సంస్థ చేయాల్సిన పనిని రజనీ చేసారేంటి? అంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలొస్తున్నాయి. ఓ పెద్ద సినిమా రిలీజ్ తేదీని ఇంత సింపుల్ గా ఎలా ప్రకటిస్తారంటూ మరికొంత మంది వాదనలకు దిగుతున్నారు. ప్రకటన అన్నది ఓ సంచలనంగా ఉండాలి తప్ప ఇంత సింపుల్ గా ఉంటే ఎలా? అంటున్నారు. జూన్ టార్గెట్ గా పెట్టుకుని ప్రకటించిన తేదీ తప్ప ఇది కచ్చితమైన తేదీ కాదని అంటున్నారు. అయితే నిర్మాణ సంస్థ రజనీకాంత్ కి చెప్పకుండానే ఆయన ఇలా ప్రకటించారా? అంత సాహసం ఆయనెందుకు చేస్తారు? అని మరో వర్గం వాదిస్తోంది.

**నిర్మాణ సంస్థ రంగంలోకి దిగాల్సిందే:** మరి ఈ విమర్శ, వ్యతిరేకతకు తెర పడాలంటే నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా క్లారిటీ ఇస్తే ఇలాంటి అనవసర చర్చకు తెరపడుతుంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది. పెండింగ్ చిత్రీకరన కూడా వీలైనంత త్వరగా ముగించాలని దిలీప్ అండ్ కో నిరంతనం పని చేస్తోంది. ఈ సినిమా షూటింగ్ మొదలైన నాటి నుంచి మధ్యలో విరామాలు కూడా ఇచ్చారు. కూలీ సినిమాతో పాటు షూటింగ్ జరగడం...ఆ సినిమా రిలీజ్ సమయంలో ప్రచారం కోసం రజనీ కాంత్ బ్రేక్ తీసుకోవడం తెలిసిందే.

## కాంతార చాప్టర్ 1 ట్రైలర్: మరో ప్రపంచంలో ఈశ్వర రూపం




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాంతార సినిమా 400 కోట్లతో పాన్ ఇండియా లెవెల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇక ఆ తర్వాత అదే కథను కొనసాగిస్తూ రిషబ్ శెట్టి కాంతార ప్రపంచాన్ని మరింత లోతుగా కొత్త రహస్యాలను చూపించబోతున్నట్టుకు అర్థమవుతుంది. కాంతార చాప్టర్ 1గా రానున్న కొత్త సినిమా మీద ప్రేక్షకుల్లో అంచనాలు గట్టిగానే ఉన్నాయి. మొదటి భాగం ఊహించని విజయం సాధించడంతో ఈసారి ఏ రేంజ్‌లో చూపిస్తాడోనని అభిమానులందరూ వెయిటింగ్‌లో ఉన్నారు. ఇక లేటెస్ట్ గా రిలీజ్ అయిన ట్రైలర్ మాత్రం ఆ అంచనాలకు రెట్టింపు క్రేజ్ తెచ్చిపెట్టింది. దాదాపు మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్ మొదలైన దగ్గర నుంచి చివరి వరకు మరో కొత్త ప్రపంచాన్ని హైలెట్ చేసింది. "నాన్న ఎందుకు ఇక్కడే మాయమయ్యాడు?" అనే ప్రశ్నతో మొదలై, ప్రతి షాట్ కూడా ఎమోషన్‌తో ఉండేలా జాగ్రత్త పడ్డట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నేటివిటీ టచ్‌తోపాటు ఎమోషనల్ లేయర్స్ యాడ్ చేయడం వలన విజువల్స్ మరింత కనెక్ట్ అయ్యే అవకాశం ఉంది. ఇక అజినిష్ సాలిడ్ బిజీఎమ్ కూడా బాగానే హైలెట్ అయ్యింది. రిషబ్ శెట్టి లుక్, ప్రెజెన్స్ ఈసారి కూడా హైలైట్ అయ్యాయి. లోకల్ కల్చర్, దేవుడిపై నమ్మకం, సామాజిక అన్యాయం, తిరుగుబాటు అన్నీ కలిపి ఒకే ఫ్రేమ్‌లో చూపించారు. చివర్లో ఈశ్వరుడు ఉన్నాడు అంటూ చూపించిన షాట్ మాత్రం వైబ్ క్రియేట్ చేసేలా ఉంది. గతంలో కాంతారలో సాదాసీదా కథకు దైవికతను జోడించి వేరే స్థాయిలోకి తీసుకెళ్లిన రిషబ్ ఈసారి మరింత లోతుగా వెళ్ళాడని అనిపిస్తోంది. ప్రొడక్షన్ విల్యూస్ ఈ ట్రైలర్‌కి మరో లేయర్ జోడించాయి. హంబలే ఫిలింస్ ఖర్చుకు వెనకాడలేదని ప్రతి ఫ్రేమ్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. అజనీష్ లోకనాథ్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా విజువల్స్‌ని మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. ఆర్ట్, కెమెరా వర్క్, లైటింగ్ అన్నీ కలిపి ఒక పెద్ద కాన్వాస్‌ను ఆవిష్కరించాయి. తెలుగులో ఈ సినిమాను గీత ఆర్ట్స్ రిలీజ్ చేస్తుండగా, నైజాంలో మైత్రి మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూషన్ బాధ్యతలు చేపట్టారు. సౌత్ మార్కెట్‌తో పాటు నార్త్ ఇండియా, ఓవర్సీస్‌లోనూ ఈ సినిమా సునామీలా దూసుకెళ్తుందని ట్రేడ్ టాక్ వినిపిస్తోంది. ట్రైలర్ ద్వారా సినిమాను గట్టిగానే హైలెట్ చేశారు. ఇక సినిమా కథ ఎంతవరకు కనెక్ట్ అవుతుంది అనే దానిపై ఫలితం ఆధారపడి ఉంటుంది. మరి అక్టోబర్ 2న వస్తున్న ఈ సినిమా ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

## హాట్ అందాలతో ఆకట్టుకుంటున్న మిరాయ్ బ్యూటీ..

కొత్త నీరు వస్తే పాత నీరు పోయినట్టుగా ఇండస్ట్రీలోకి ఎవరైనా కొత్త హీరోయిన్లు వచ్చారు అంటే.. పాత హీరోయిన్ లకి పెద్దగా స్కోప్ ఉండదు అనే వార్తలు వినిపిస్తూ ఉంటాయి. అయితే ఇక్కడ ఆ కొత్త హీరోయిన్లు మాత్రం తమ నటనతో ప్రూవ్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా ప్రూవ్ చేసుకుంటే మాత్రం కుర్రాళ్ళ క్రష్ అయిపోతారు అనడంలో సందేహం లేదు. ఈ క్రమంలోనే ఒక నటి తన పాత్రకు పెద్దగా స్కోప్ లేకపోయినా తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకొని.. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ అయిపోయింది. అంతేకాదు ఈమెను చూసిన వారంతా బొమ్మలా ఉంది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈమె అందానికి మంత్రముగ్ధులవుతూ ఈమెపై పలు రకాల కామెంట్లు కూడా చేస్తున్నారు. ఆమె ఎవరో కాదు రితిక నాయక్.. ఇటీవల కార్తీక ఘట్టమనేని దర్శకత్వంలో తేజా సజ్జ హీరోగా నటించిన చిత్రం మిరాయ్. సూపర్ యోధ పాత్రలో వచ్చిన ఈ సినిమాలో రితిక హీరోని ఒక లక్ష్యం కోసం ముందుకు నడిపించే పాత్రలో నటించింది. అయితే



ఈ పాత్రకు పెద్దగా స్కోప్ లేకపోయినా తన నటనతో సినిమాకే హైలెట్ గా నిలిచింది అని చెప్పవచ్చు. ఇందులో తన అద్భుతమైన పర్ఫామెన్స్ తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది రితిక. ఇప్పుడు ఈ సినిమాతో పాన్ ఇండియా లెవెల్లో గుర్తింపు రావడంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ అయిపోయింది. అందులో భాగంగానే గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. అందులో కట్ వర్క్ గోల్డెన్ కలర్ సారీ ధరించిన ఈమె దీనికి ఆపోజిట్ గ్రీన్ కలర్ స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి అందాలతో మెస్మరైజ్ చేసింది. సింపుల్ జ్యూవెలరీతో తన అందాన్ని ఫుల్ ఫిల్ చేసింది అని చెప్పవచ్చు. మొత్తానికైతే ఇందులో ఈమె తన అందంతో అభిమానులను ఆకట్టుకోవడమే కాదు ఈమె ఫోటోలు చూసి బొమ్మలా ఉంది బ్రో అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ఏదేమైనా రితిక నాయక్ షేర్ చేసిన ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రితిక నాయక్ విషయానికి వస్తే.. 2019లో ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ సీజన్ 12 టైటిల్ ని గెలుచుకున్న ఈమె ఆ తర్వాత మోడల్ రంగంలోకి అడుగు పెట్టింది. 2022లో విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'అశోక్ వనంలో అర్జున కళ్యాణం' అనే సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. మొదటి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఇప్పుడు సినిమాతో తెలుగులో భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. మధ్యలో 'హాయ్ నాన్న' సినిమాలో అతిథి పాత్ర పోషించిన ఈమె 'డ్యూయెట్' సినిమాతో అటు తమిళ్ ప్రేక్షకులను కూడా పలకరించబోతోంది. ఈ సినిమా తెలుగు, తమిళ్ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతోంది.

## బీచ్ లో చెల్లితో సందడి చేసిన సాయి పల్లవి..ఫోటోలు వైరల్!

సాయి పల్లవి.. 'ప్రేమమ్' సినిమా ద్వారా మలయాళ చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈమె.. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'ఫిదా' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే.. "భానుమతి.. ఒక్కటే పీస్.. హైబ్రిడ్ పిల్ల" అంటూ భారీ పాపులారిటీ అందుకుంది. ఇందులో తెలంగాణ యాసలో చక్కగా ఒదిగిపోయింది సాయి పల్లవి. ఆ తర్వాత సెలెక్టివ్ గా పాత్రలు ఎంచుకుంటూ "లేడీ పవర్ స్టార్" అనే బిరుదును కూడా సొంతం చేసుకుంది. అంతేకాదండోయ్ చాలా సెలెక్టివ్ గా పాత్రలు ఎంచుకుంటూ పాత్రకు ప్రాధాన్యతనిస్తూ తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంది. ముఖ్యంగా గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండే సాయి పల్లవి.. చాలా సెలెక్టివ్ గానే సినిమాలు చేస్తోంది అని చెప్పడంలో సందేహం లేదు. ఈ క్రమంలోనే సౌత్ లో వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె అటు బాలీవుడ్ లో కూడా రెండు సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ నటిస్తున్న రొమాంటిక్ చిత్రం 'ఏక్ దిన్' అనే సినిమాతో బాలీవుడ్



రంగ ప్రవేశం చేస్తోంది. ఈ సినిమా 2025 నవంబర్ 27న విడుదల కాబోతోంది. ఈ సినిమాతో పాటు రణబీర్ కపూర్ తో కలిసి 'రామాయణం' అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో సీత పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యింది సాయి పల్లవి. అంతేకాదు రెండు భాగాలుగా రాబోతున్న ఈ సినిమాను సుమారుగా రూ. 4వేల కోట్లకు పైగా బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఒకవైపు బాలీవుడ్ లో వరుస సినిమాలను ప్రకటిస్తూ బిజీగా మారిన సాయి పల్లవి.. మరొకవైపు కాస్త సమయం దొరికితే వెకేషన్ కి వెళ్లి ఎంజాయ్ చేస్తోంది. అందులో భాగంగానే ఇటీవలే వివాహం చేసుకొని విదేశాలలో సెటిల్ అయిన తన చెల్లెలు పూజా కన్నన్ ఇంటికి వెళ్లింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే అక్కడ తన చెల్లితో కలిసి బీచ్ కి సరదాగా వెళ్ళింది. అందుకు సంబంధించిన ఫోటోలను పూజా కన్నన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడంతో ఈ ఫోటోలు కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. వీరిద్దరూ ఇసుకలో ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా స్విమ్ చేస్తూ.. అందుకు సంబంధించిన ఫోటోలను కూడా ఈ అక్కాచెల్లెళ్ళు సోషల్ మీడియాలో షేర్ చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536